

జిల్లాకు శిక్షణ ఐపీఎస్‌లు

నెల్లూరు(క్రైం), మే 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాకు కేటాయించిన శిక్షణ ఐపీఎస్‌లు బుధవారం నెల్లూరుకు చేరుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు 163 మంది శిక్షణ ఐపీఎస్‌లను కేటాయించారు. జిల్లాకు మయాంక్ మిశ్రా, పీకే సిద్ధార్థ్ రామ్‌కుమార్, ప్రతీక్ సింగ్, కుష్ మిశ్రా, సూరజ్ డీ, అభినవ్ ద్వివేది, జమా సోనార్, ఆషిమా వాశ్వాణి, అపర్ణను కేటాయించారు. వారంతా జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు గురించి తెలుసుకున్నారు. ఎన్నికలు ముగిసేవరకు జిల్లాలోనే ఉంటారు.

మా ఓటు అమ్ముకోం.. ఎవరూ రావొద్దు!

- కాకివాయి గ్రామస్థుల తీర్మానం
- ప్రతి ఇంటి ముందు ఫ్లెక్సీ ఏర్పాటు
- నెల్లూరులోనూ బోర్డుల ఏర్పాటు



కాకివాయిలో ప్రతి ఇంటి ముందు 'మా ఓటు అమ్మకానికి లేదు'...అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన గ్రామస్తులు

ఆ గ్రామస్థులంతా ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నారు. ఈసారి ఎన్నికల్లో ఓవరూ ఓటుకు నోటు తీసుకోకూడదని. ఆ తీర్మానం జిల్లా అంతటా ఆలోచించేలా చేసింది. చేజర్ల మండలం కాకివాయి గ్రామానికి చెందిన ప్రజలు తమ గ్రామంలో స్వచ్ఛందంగా ఓటు వేసేలా ప్రతి ఇంటి ముందు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 'మా ఓటు అమ్మకానికి లేదు.. మై ఓట్ నాట్ ఫర్ సేల్' అంటూ తమ ఇంటి ముందు స్టిక్కర్లు అతికించారు. 'రాజ్యాంగాన్ని మార్చాలని భావించేవారు, ఓట్లు కొనాలనుకునే పార్టీల నేతలు మా ఇంటికి రావనవరం లేదు.' అని వాటిపై పేర్కొన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 'మా గ్రామంలో ఓట్లు అమ్మబడవు.. మేమే మీకు అన్ని విధాలా సహకరిస్తాం. మీరు కూడా మా గ్రామ అభివృద్ధికి సహకరించాలని ప్రార్థిస్తున్నాం' అంటూ అందులో పేర్కొన్నారు.

● నెల్లూరు నగరంలో కూడా...

అలాగే నెల్లూరు నగరంలోని పొగతోట, గాంధీనగర్, సంతపేట, కలెక్టరేట్, వేదాయపాలెం, స్టోన్‌హౌస్‌పేటలోని పలు గృహాల గేట్లు ముందు కూడా 'ఈ ఇంటిలో ఓట్లు అమ్మకానికి లేవు. ఓట్లు కొనేవారు మా ఇంటికి రావద్దు.' అంటూ బోర్డులు పెట్టి గేట్లకు తాళాలు వేశారు.



నెల్లూరులో..

\- చేజర్ల/నెల్లూరు (సాంస్కృతికం)

ఓటర్లకు వైసీపీ నేతల ఎర!

- 112కి ఫిర్యాదుతో పోలీసుల తనిఖీ
- స్కూటర్‌లో రూ.1,01,000 పట్టివేత

కావలి, మే 8: కావలి వైకుంఠపురం సెంటర్‌లో మంగళవారం రాత్రి రెండో పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్కడున్న స్కూటర్ వద్ద బెజవాడ వేణు, వెంకయ్య ఉండగా, వారిని సోదా చేయగా రూ.1,01,000 లభించింది. దీంతో పోలీసులు ఫ్లయింగ్ స్క్వాడ్‌కు ఫోన్ చేశారు. వారు వచ్చి ఆ నగదును స్వాధీనం చేసుకుని నెల్లూరు ఐటీ అధికారులకు అప్పగించారు. సేకరించిన సమాచారం మేరకు, ఆ ప్రాంతంలో వైసీపీ నేతలు మంగళవారం రాత్రి నగదు పంపిణీ చేస్తున్నారు. గమనించిన కొందరు స్థానికులు 112కు ఫిర్యాదు చేయగా, పోలీసులు వచ్చేసరికి వారు పరారయ్యారు. అయితే అక్కడ స్కూటర్ వద్ద ఉన్న వేణు, వెంకయ్యల నుంచి పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారు. అయితే డబ్బులు కలిగి ఉన్న వారిని తప్పించి వారు చెప్పిన పేర్లను పోలీసులకు ఇచ్చారని తెలిసింది.



● డబ్బు పంపిణీలో సచివాలయ ఉద్యోగి

బిట్రగుంట : కోవూరుపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి వైసీపీ నేతలతో కలసి మంగళవారం రాత్రి ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నాడని బుధవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ విషయమై కావలి ఆర్డీవో శీనానాయక్‌ను, ఎంపీడీవో జమీఉల్లాను వివరణ కోరగా, వెల్ఫేర్ అసిస్టెంట్ నగదు పంపిణీ చేస్తునట్లు కొంతమంది తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయమై విచారణ జరుపుతున్నామని వారు పేర్కొన్నారు.

11న సాయంత్రం 6 గంటల వరకే

ప్రచారానికి అనుమతి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మే 8 : ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకే ఎన్నికల ప్రచారానికి అనుమతి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. బుధవారం కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్‌కు 48 గంటల ముందు భారత ఎన్నికల సంఘం పేర్కొన్న అన్ని నిబంధనలను అభ్యర్థులు పాటించాలని సూచించారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటల తరువాత ఎటువంటి మైకులు, జనం లేకుండా కేవలం నలుగురితో మాత్రమే ఇంటింటికి వెళ్లి నిశ్శబ్దంగా వెళ్లి ప్రచారం చేసుకోవాలన్నారు. బయటి నియోజకవర్గాల నుంచి వచ్చిన వారు జిల్లాను విడిచి వెళ్లాలని, అన్నిచోట్ల తనిఖీలు చేస్తామని హెచ్చరించారు. పోలింగ్ రోజు కేవలం 3 వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. పోలింగ్ రోజు 200 మీటర్ల దూరంలో ఒక బూతును రాజకీయ పార్టీ ఏర్పాటు చేసుకోవచ్చని, అందులో కేవలం ఒక టేబుల్, రెండు కుర్చీలు, ఒక బ్యానరు మాత్రమే ఉండాలన్నారు. కేవలం ఇద్దరు మాత్రమే ఆ బూత్‌లో ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, ఎన్నికల సూపరింటెండెంటు సుబ్రహ్మణ్యం, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.





ఉదయగిరి తహసీల్దారు కార్యాలయం వద్ద ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉద్యోగులు

ఓటెత్తిన ఉద్యోగవర్గం!

- భారీగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్
- 95 శాతానికిపైగా పోలైన ఓట్లు
- ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో పెరిగిన ఆసక్తి
- నేడు కూడా వినియోగానికి అవకాశం
- వైసీపీకి ఎదురుగాలి తప్పదా..?

నెల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల తొలి అంకంలో భారీగా పోలింగ్ నమోదైంది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గతంలో ఎప్పుడూ లేని విధంగా 96 శాతానికి పైగా నమోదైంది. నాలుగు రోజుల పాటు ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఓటింగ్‌కు అవకాశం కల్పించగా, వారంతా ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు. సాధారణంగా ప్రతి సారి పోస్టల్ బ్యాలెట్ తీసుకునేందుకు, తీసుకున్నా ఓటు వేసేందుకు ఉద్యోగులు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. పోస్టల్ బ్యాలెట్ తీసుకున్న వారిలో 70 నుంచి 80 శాతానికి ఓటింగ్ మించదని ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. అయితే ఈసారి దాదాపుగా ప్రతి ఉద్యోగి ఓటు వేయడం గమనార్హం.

● 20,533 పోస్టల్ బ్యాలెట్లు

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 20,533 మంది పోస్టల్ బ్యాలెట్‌లను అందుకున్నారు. తొలి మూడు రోజుల్లోనే 19,245 మంది ఓటు వేశారు. అంటే 94 శాతం వరకు పోలింగ్ నమోదైంది. ఇక నాలుగో రోజు కూడా మిగిలిన ఉద్యోగులు ఓటు వేసేందుకు ఫెసిలిటేషన్ కేంద్రాలకు వచ్చారు. దీంతో పోలింగ్ శాతం మరింత పెరిగింది. వీరే గాక ఇతర జిల్లాల్లో ఓటు ఉన్న ఉద్యోగులు కూడా భారీగానే ఓటు వేశారు. ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటు ఉన్న 2054 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ జాబితాలో కొంతమంది ఉద్యోగుల పేర్లు గల్లంతయ్యాయి. అందులో టీచర్లు ఎక్కువగా ఉన్నారు. వీరు ఫెసిలిటేషన్ కేంద్రాలకు వెళ్లాక వారి పేరు లేకపోవడంతో వెనుదిరగలేదు. అక్కడి నుంచే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి మరీ అక్కడికక్కడే ఓటు సాధించుకున్నారు. మరికొంత మంది ఏ కేంద్రంలో ఓటు వేయాలన్న వివరాలు తెలియక పోయినా, ఓపిగ్గా వివరాలు కనుక్కొని ఎండని కూడా అనుకోకుండా అక్కడికి వెళ్లి ఓటు వేశారు. ఇలా గతానికి భిన్నంగా ఓటు వేసేందుకు ఉద్యోగులు ఆసక్తి ప్రదర్శించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

● వైసీపీకి ఎదురుగాలి తప్పదా ?

సాధారణంగా పోలింగ్ శాతం పెరిగిందంటే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుంది. ఎక్కువ పోలింగ్ నమోదయ్యే కొద్దీ పాలకపక్షానికి ఇబ్బందిగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.చరిత్రను ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు. ఇప్పుడు పోస్టల్ బ్యాలెట్‌లో భారీగా పోలింగ్ నమోదవడంతో ఆ ప్రభావం వైసీపీకి ఎదురుగా లిగా మారుతుందా.. ? అన్న చర్చను లేవనెత్తారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరించడం, వారి బెనిఫిట్స్‌ను, హక్కులను ఇవ్వకపోవడంతో ఉద్యోగులు రోడ్ల మీదకు రావడం వంటి విషయాలను విశ్లేషకులు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. సాధారణంగా ఉద్యోగ వర్గాల్లో ఏ ఆలోచన అయితే ఉంటుందో... అదే ఆలోచన ప్రజల్లోనూ కనిపి స్తుందని అంటున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎవరికి ఎక్కువగా వస్తే ఆ పార్టీకే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గడిచిన ఎన్నికలను ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. దీంతో ఇప్పుడు ఉద్యోగులు ఎవరి వైపు నిలబడ్డారన్నది రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద గందరగోళం

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను మొదట మూడు రోజులు మాత్రమే వేసేందుకు గడువు ఇచ్చినా, దాన్ని బుధవారం వరకు పొడిగించారు. ఇతర జిల్లాల్లో ఓటు ఉన్న ఉద్యోగులకు నెల్లూరులోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే బుధవారం కొందరు ఉద్యోగులు అక్కడ ఓటు వేసేందుకు వెళ్లగా ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఎత్తేశారు. డీకేడబ్ల్యూ కాలేజీకు వెళ్లాల్సిందిగా అక్కడున్న సిబ్బంది సూచించారు. దీంతో వారంతా డీకేడబ్ల్యూ కాలేజీకు వెళ్లగా, అక్కడా ఫెసిలిటేషన్ కేంద్రం లేదని, కలెక్టరేట్‌కు వెళ్లాలని చెప్పారు. దీంతో ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులు కలెక్టరేట్ వద్దకు భారీగా చేరుకు న్నారు. దీంతో గందరగోళం నెలకొంది. అప్పటికప్పుడు కలెక్టర్ ఎం హరినారాయణన్, నోడల్ అధికారి వెంకట్రావ్ కలెక్టరేట్‌లో ఇతర జిల్లాల అధికారులకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో వారంతా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

● నేడూ కూడా అవకాశం

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు మరో రోజు గడువు పొడిగించినట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఈసీ ఉత్తర్వుల మేరకు అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో గురువారం ఫెసిలిటేషన్ కేంద్రాలు పనిచేస్తాయని వెల్లడించారు. ఇంకా పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హమ్మయ్య..!

- వర్షం రాకతో చల్లబడ్డ వాతావరణం

నెల్లూరు (హరనాథపురం), మే 8 : జిల్లావ్యాప్తంగా మంగళవారం కురిసిన అకాల వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రతిరోజు 42 డిగ్రీల ఉష్ణోగ్రతకు పైబడి కాచే ఎండ తీవ్రత బుధవారం 34.9 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. నిత్యం ఎండ వేడిమితో అల్లాడిన జనానికి ఈ వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించింది. ఉరుములు, మెరుపులతోపాటు పలుచోట్ల పిడుగులు పడ్డాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. మెట్టప్రాంతాలలో ఈసారి వర్షం అత్యధిక శాతం పడటం విశేషం.

● అత్యధికంగా వరికుంటపాడులో..

జిల్లాలో సగటు వర్షపాతం 25.9 మి.మీగా నమోదైంది. అత్యధికంగా వరికుంటపాడులో 90.2 మి.మీ, అత్యల్పంగా ఉలవపాడులో 1.2 మి.మీ వర్షం కురిసింది. వలేటివారి పాళెం 7.6, కందుకూరు 4.4, లింగసముద్రం 9.8, గుడ్లూరు 3.2, సీతారామపురం 74.6, ఉదయగిరి 79.6, కొండాపురం 18.4, జలదంకి 14.6, జలదంకి 14.6, కావలి 2.8, బోగోలు 16.2, కలిగిరి 26.5, వింజమూరు 12.4, దుత్తలూరు 4.8, మర్రిపాడు 35.6, ఆత్మకూరు 30.2, అనుమసముద్రంపేట 31.6, దగదర్తి 21.4, అల్లూరు 47.4, విడవలూరు 17.4, బుచ్చి 40.2, సంగం 46.2, చేజర్ల 34.2, అనంతసాగరం 35.2, రాపూరు 3.2, పొదలకూరు 50.2, నెల్లూరురూరల్ 40.4, కోవూరు 19.2, ఇందుకూరుపేట 28.4, టీపీ గూడూరు 12.2, ముత్తుకూరు 1.8, వెంకటాచలం 8.2, మనుబోలు 3.4, సైదాపురం 22.4, నెల్లూరు అర్బన్‌లో 38 మి.మీగా నమోదైంది



సీతారామపురం : పడమటి రొంపిదొడ్ల గ్రామంలో మృతి చెందిన గొర్రెలు

● పిడుగుపడి 40 గొర్రెల మృతి

సీతారామపురం : మండలంలోని పడమటి రొంపిదొడ్ల గ్రామంలో పిడుగుపడి 40 గొర్రెలు మృతి చెందాయి. దుగ్గినబోయిన నాగేశ్వరరావు, కోడే శివ, గెట్టిబోయిన తిరుపతయ్యలకు చెందిన గొర్రెలు మృతి చెందడంతో భారీగా నష్టపోయినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

● 'గండిపాళెం'కు వరద

ఉదయగిరి రూరల్ : అకాల వర్షంతో గండిపాళెం జలాశయానికి వరద నీరు చేరిందని జల వనరుల శాఖ డీఈ చంద్రమౌళి తెలిపారు. జలాశయం పైతట్టు ప్రాంతాల్లో వర్షం కురవడంతో దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ప్రవహించాయి. గతంలో జలాశయంలో 3 అడుగుల మేర నీటిమట్టం ఉండ గా ప్రస్తుతం 5 అడుగులకు చేరినట్లు తెలిపారు.



నెల్లూరు : కేవీఆర్ పెట్రోలు బంకు వద్ద వర్షపునీరు



తుమ్మలపెంట రోడ్డులో వేసిన అక్రమ లేఅవుట్

కప్పం కడితే కబ్జా చేసేయొచ్చా!?

మీరు కావలిలో వెంచర్ వేయాలని అనుకుంటున్నారా!? ఇందుకు అన్ని రకాల అనుమతులు పొందినా కుదరదు. ఇవేం లేకపోయినా ఫర్వాలేదు. మొదట ఎమ్మెల్యేను కలవాలంటున్నారు అధికారులు. అక్కడ మాట్లాడుకుని గ్రీన్‌సిగ్నల్ ఇస్తేనే వెంచర్ వేసుకుని, ప్లాట్లు విక్రయించుకోవచ్చు. కాదు కూడ దంటే.. నిబంధనల పేరుతో అధికా రులు.. బెదిరింపులు, దౌర్జన్యాలతో అధికార పార్టీ నేతలు రంగం లోకి దిగుతారు. గడిచిన ఐదేళ్లలో కావలి నియోజకవర్గంలో ఇదే జరిగింది. ప్రభుత్వ స్థలాల కబ్జా, రియల్టర్ల నుంచి వసూలు ఇలా రూ.400 కోట్ల వరకు అధికార పార్టీ నేతలు వేనకేసుకున్నట్టు అంచనా.

- కావలిలో అధికార పార్టీ నేతల తీరిది
- వెంచర్ వేయాలంటే ఎమ్మెల్యేను కలవాల్సిందే!
- హుకూం జారీ చేస్తున్న అధికార యంత్రాంగం
- లేదంటే నిబంధనల పేరుతో కొర్రీ
- ఇప్పటికే రూ.400 కోట్ల ప్రభుత్వ ఆస్తుల కబ్జా
- బెదిరించి పొలాల కొనుగోళ్లు

కావలి, మే 8 : కావలి నియో జకవర్గంలో ప్రభుత్వ ఆస్తులైన నీటిగుంటలు, పంట కాలువలు, పోరంబోకు స్థలాలు, స్మశాన భూము లు ఇలా సుమారు 40వేల అంకణాలకు పైగా ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణకు గుర య్యాయి. తుమ్మలపెంట రోడ్డు పక్కనే 2.5 ఎకరాల నీటి గుంటను రెండు భాగాలుగా చేసి గ్రావెల్‌తోలి పూడ్చేశారు. ఈ వ్యవహారంపై పత్రికలలో కథనాలు రావడంతో అధికా రులు స్పందించి అక్కడ బోర్డు పెట్టారు. ఆ గుంట రెండు భాగాలు పక్కనే ఉన్న లేఅవుట్ లో కలిసి పోయింది. దాని విలువ రూ.10 కోట్ల వరకు ఉంటుంది. ఇలా కావలి పట్టణపరిధిలో సుమారు ఆరేడు గుంటలు లేఅవుట్లలో కలిసి పోయాయి. పంట కాలువలు, వరవ కాలువలు, రోడ్డు పోరం బోకులు, స్మశాన స్థలాలు అన్నిటినీ కలుపు కుని లేఅవుట్లు వేసి అమ్మే శారు. ఒక్కో అంకణం సరాసరి అంకణం లక్ష రూపాయలు వేసుకున్నా రూ.400 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలలు కబ్జాకు గురయ్యాయి.



నీటిగుంటను రెండు భాగాల వరకు పూడ్చిన దృశ్యం

● ఎమ్మెల్యేకూ వాటాలు

ఈ అక్రమ లేఅవుట్లలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కూడా వాటా ఇస్తు న్నట్లు కొందరు లేఅవుట్‌దారులు చెబుతు న్నారు. లేఅవుట్ వేసే ముందు ల్యాండ్ కన్వర్షన్ కోసం రెవెన్యూ అధికారుల వద్దకు వెళితే వారు ఎమ్మెల్యేను కలిసి రమ్మని చెపుతుంటారనే ప్రచారం నడుస్తోంది. ఎమ్మెల్యే ఇంటికి వెళితే 'మీరు చేసేది వ్యాపారం కాబట్టి ఎకరాకు కొంత ట్యాక్స్ చెల్లించాలని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది సూచిస్తున్నారు. ఎవరైనా చెల్లించకుండా లేఅవుట్ వేస్తే ఇక అంతే. రెవెన్యూ, మున్సిపాలిటీ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సదరు స్థలాల వద్ద వాలిపోయి నిబంధనల పేరుతో కొర్రీ పెడుతున్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ట్యాక్స్ చెల్లిస్తే ఆ తర్వాత ఆ బోర్డులను అధికారులు తొలగిస్తారనే ప్రచారం ఉంది. అయితే తన మన అనే తేడా లేకుండా ఎవరైనా పద్ధతి ప్రకారం ట్యాక్స్‌లు చెల్లించాల్సిందే.

● అంతా బెదిరింపులే

అధికారాన్ని అడ్డం పెట్టుకుని అంతా బెదిరింపులతోనే లేఅవుట్లు వేస్తారు. లేఅవుట్లు వేసే ప్రాంతంలో ప్రభుత్వస్థలం ఉంటే దానిని ఆక్రమించి లేఅవుట్లలో కలిపేస్తారు. అదే ప్రైవేట్ స్థలం ఉండి భూ హక్కుదారు అమ్ముకునే ఆలోచన లేకపోయినా బెదిరించి సదరు స్థలాన్ని లాక్కొంటున్నారు. అంతేగాక కొందరు రైతులను నమ్మించి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని వారికి డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారనే ఆరోపణలు కూడా రియల్టర్లపై ఉన్నాయి. పొలాల కొనుగోలులోనే కాదు.. లేఅవుట్ వేసిన తర్వాత ప్లాట్లు కూడా వ్యాపారుల చేత బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

● అంతా అధికారుల సహకారంతోనే..

ప్రభుత్వ ఆస్తుల కబ్జా, చెరువుల్లోని మట్టిని అక్రమంగా లేఅవుట్ల తరలింపు అంతా అధికారుల సహకారంతోనే జరుగుతుందనే ప్రచారం ఉంది. అధికార పార్టీ నాయకులను అడ్డుకుంటే బదిలీలు వస్తాయనే భయంతో కొందరు, మామూళ్ల మత్తులో కొందరు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు మరికొందరు. ఒకవేళ ఎవరైనా అధికారులు అక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారికి ఉన్నతాధికారుల నుంచి ఫోన్లు చేయిస్తుండటంతో అందరూ తెలిసి కూడా వదిలేస్తున్నారని తెలుస్తోంది.

పింఛన్‌కు వెళ్లి తిరిగిరాని లోకాలకు!

- వడదెబ్బకు గురై మృతి చెందిన వృద్ధుడు

నెల్లూరు (వైద్యం), మే 8 : వృద్ధాప్య పింఛను కోసమని వెళ్లిన కుటుంబ పెద్ద ఎంతకూ ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు నెల్లూరులో ముమ్మరంగా గాలించారు. తీరా మూడు రోజుల తర్వాత ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మార్చురీ వార్డులో ఆయన మృతదేహం ఉందని గుర్తించి బోరున విలపించారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం నెల్లూరులోని ఏసీ నగర్‌కు చెందిన ఎల్లోజి వెంకయ్య (75) ఈ నెల నాల్గవ తేదీన పింఛను డబ్బులు బ్యాంకులో పడ్డాయని సచివాలయం సిబ్బంది చెప్పడంతో ఆంధ్రప్రగతి బ్యాంకుకు వెళ్లారు. ఇక్కడ కాదని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో నవాబుపేటకు వెళ్లారు. అక్కడ ఎండవేడిమి తట్టుకోలేక రోడ్డుపైనే స్పృహ కోల్పోయారు. ఇది గమనించిన స్థానికులు అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు వడదెబ్బకు గురయ్యారని భావించి చికిత్స అందించినా ప్రయోజనం లేకపోయింది. ఆదివారం వెంకయ్య మృతిచెందాడు. అయితే, ఇదేమి తెలియని కుటుంబ సభ్యులు వెంకయ్య కోసం నగరమంతా గాలించారు. చివరకు మంగళవారం జీజీహెచ్‌లో మృతదేహం గుర్తించిన కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అంత్యక్రియలు నిర్వహించారు.



మృతుడు వెంకయ్య (ఫైల్)

పాలిసెట్‌లో భళా

- 90 శాతం ఉత్తీర్ణత

నెల్లూరు (విద్య) : పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్- 2024 ఫలితాలు బుధవారం విడుద లయ్యాయి. జిల్లావ్యాప్తంగా పాలిసెట్ పరీక్షను ఏప్రిల్ 27న నిర్వహించారు. జిల్లా నుంచి 3,916 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 3325 మంది హాజరయ్యారు. వీరిలో బాలురు 1858, బాలికలు 1137 మంది కలిపి 2,995 మంది ఉత్తీర్ణత సాధించారు. 90.08శాతం ఉత్తీర్ణత నమోదైందని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లాకు చెందిన ఏ మునిసాయి ప్రీతమ్ రాష్ట్ర స్థాయిలో 160వ ర్యాంకు, ఎస్‌కే సాయికిరణ్ 177వ ర్యాంకు, వై సాయిసాత్విక్ 183వ ర్యాంకు సాధించారు.



మునిసాయి ప్రీతమ్, సాయిసాత్విక్

ఆత్మకూరు ఉదయగిరి

నత్తనడకన ఓటర్ స్లిప్పుల పంపిణీ

సీతారామపురం: మండలంలో బీఎల్ఓల ఓటర్ స్లిప్పుల పంపిణీ నత్తనడ కగా సాగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంటింటికి తిరిగి ఇవ్వాల్సిన వీరు కొ న్ని ఇళ్లకు ఇచ్చి మిగిలినవి స్థానిక నాయకులకు అందజేస్తున్నారు. వారు ఇం టిం టికి పంచుతూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని చర్చించుకుంటున్నారు. అధికా రులు ఓటర్ స్లిప్పుల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

గ్యాస్ ఏజెన్సీ వద్ద తోపులాట

అనంతసాగరం, మే 8: స్థానిక ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద బుధవారం ఖాతాదారులతో తోపులాట నెలకొంది. ఈకేవైసీ చేయించుకోవాలని నిర్వాహకులు ప్రకటించడంతో పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకోవడంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది.

'గిరి' రూపురేఖలు మారుస్తా!

- ప్రతి గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం
- ఉదయగిరి, వింజమూరు ఆసుపత్రుల స్థాయి పెంచుతాం
- ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నెల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడపుట్టి కష్టపడి అమెరికా వరకు ఎదిగి, తిరిగి సొంత గడ్డకు సేవ చేయాలనే ఆశయంతో ఉదయగిరి నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగిన కాకర్ల సురేష్ గెలుపు పట్ల తన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గం పట్ల సంపూర్ణ అవగాహనతో భవిష్యత్తులో తన లక్ష్యాలేమిటో నిర్దేశించుకొని ముందుకు కదులుతున్నారు. ఎన్నికల్లో విజయవకాశాలు, భవిష్యత్ ప్రణాళికలపై ఆయన ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు.

? తొలిసారిగా ఎన్నికలు ఫేస్ చేస్తున్నారు. ఎలా ఉంది

! అసెంబ్లీకి పోటీ చేయడం తొలిసారే కానీ ఎన్నికల నిర్వహణ, పోల్ మేనేజ్‌మెంట్ ఇవేవీ కొత్తకాదు. వీటిపట్ల నాకు సంపూర్ణ అవగాహన ఉంది. ఇప్పటికే డోర్ టు డోర్ కంప్లీట్ చేశా. ప్రజల నుంచి మంచి స్పందన ఉంది. రెండేళ్లుగా నియోజకవర్గంలో తిరుగుతూ నా వంతు సేవ చేస్తున్నాను కదా. నా ఫేస్ అందరికి రీచ్ అయ్యింది. ఓటరు కూడా డిసైడ్ అయిపోయారు. తెలుగుదేశం పట్ల, నా పట్ల వారి స్పందన వారి ముహాల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

? మీ గెలుపునకు దోహదపడే అంశాలు

! నా లీడర్‌షిప్ క్వాలిటీస్. నా క్యాపబులిటీ. నా అనుభవం. ఇవన్నీ నా గెలుపునకు దోహదం చేసే అంశాలు. చిన్నప్పటి నుంచి లీడర్‌షిప్ క్వాలిటీస్ అలవర్చుకున్నాను. ఇక్కడి సమస్యల పట్ల నాకున్న స్పష్టమైన అవగాహన, వాటి పరిష్కారానికి ఉన్న మార్గాలు వీటి ద్వారా ప్రజలకు దగ్గరవుతున్నాను. ముఖ్యంగా ఈ నియోజకవర్గంలో ఆరోగ్య సమస్య చాలా తీవ్రంగా ఉంది. దీనిని క్షేత్రస్థాయి నుంచి వైద్యసేవలు అందేలా చేయాలని నేను రెండేళ్లుగా చేస్తున్న సేవా కార్యక్రమాలు నన్ను ప్రజలకు బాగా దగ్గరచేశాయి. మహిళలు, యువత నుంచి మంచి స్పందన ఉంది. సీనియర్ నాయకుల సహకారం బాగుంది. ఎమ్మెల్యేని పదవిగా అనుకోను. ఒక ఉద్యోగంలా ఫీల్ అవుతాను. వ్యాపారం చేయడానికి రాజకీయాల్లోకి రాలేదు. అందరికి అందుబాటులో ఉండానే వచ్చా. ఈ విషయాలు ఇప్పటికే ప్రజలు గుర్తించారు. నన్ను గెలిపిస్తారు.

? నియోజకవర్గంలో మీ ప్రాధాన్యతలు ఏమిటి

ఇక్కడ తాగునీటి సమస్య చాలా ఎక్కువగా ఉంది. మురికిగుంటల్లో నిల్వ నీటిని వడగట్టుకుని తాగే పరిస్థితి ఉంది. నేను, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఒక పక్కా ప్లాన్‌తో ఉన్నాము. 50 గడపలు ఉన్న ప్రతి గ్రామంలో ఒక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం. జనాభా ఆధారంగా అందరికీ సరిపడే స్థాయిలో వాటర్ ప్లాంట్ సామర్థ్యాలను పెంచుతాం.

- ఉదయగిరి ప్రాంతంలో టూరిజం అభివృద్ధి చేసి దాని ద్వారా ప్రజలకు జీవనోపాధి లభించేలా చేయడం రెండవ టార్గెట్.
- పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి కృషి చేస్తాం.

? యువత కోసం ఏమి చేయనున్నారు

! ప్రధానంగా ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య చాలా తీవ్రంగా ఉంది. చదువుకున్న యువత ఉన్నా వారి చదువులు ఉద్యోగాల సంపాదనకు సరిపోవడం లేదు. పోటీ పరీక్షల్లో నిలబడలేకపోతున్నారు. వీరి స్కిల్స్ పెంచేలా రకరకాల స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను సంబంధించిన శిక్షణ ఇప్పిస్తాం. ఇది ఒక నిరంతర ధర్మంగా స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాలు నడిచేలా ఏర్పాటు చేస్తాం.

- ప్రస్తుతం ఉదయగిరిలో ఒక ఉడ్ కట్లరీ పరిశ్రమ నడుస్తోంది. దీనిస్థాయి పెంచుతాం. అందులో ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చేలా చేస్తాం. నియోజకవర్గంలో సోలార్, ఫర్నిచర్ తయారీ, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు తీసుకొస్తాం. ఈ విషయంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి, నేను ఒక స్పష్టమైన అవగాహన, నిర్ణయానికి వచ్చాం. ఎన్నికల పూర్తయిన వెంటనే ఈ పనులపై దృష్టిపెడతాం. అలాగే ఈ నియోజకవర్గంలో చిరు వ్యాపారులు చాలా మంది ఉన్నారు. వీరికి ఆర్థిక సాయం అందేలా చేసి వీరి వ్యాపార స్థాయిని పెంచుతాం.
- ఈ నియోజకవర్గంలో హెల్త్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. సరైన వైద్యం అందక కొన్ని కుటుంబాలకు కుటుంబాలే కుప్పకూలిన పరిస్థితులు చూశాను. అందుకోసం వింజమూరు, ఉదయగిరి ఆసుపత్రుల స్థాయి పెంచుతాం. మా ట్రస్ట్ ద్వారా నడుస్తున్న ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథాల సంఖ్యను పెంచి మండలానికి విస్తృతంగా వైద్యసేవలు, పరీక్షలు చేస్తాం. అవసరమైన వారిని పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేస్తాం.
- విద్యా ప్రమాణాలను పెంచుతాం. ఉద్యోగ అవకాశాలు కల్పించే కోర్సులను ప్రారంభిస్తాం. ఇందుకోసం అవసరం అయితే సొంత నిధులైనా ఖర్చు చేయడానికి వెనుకాడం.
- అలాగే నియోజకవర్గంలో మొబైల్, నెట్ సేవలు చాలా దారుణంగా ఉన్నాయి. టవర్స్ లేని కారణంగా సిగ్నల్స్ అందడం లేదు. నెట్‌వర్క్ రావడం లేదు. విద్య, విజ్ఞానాలకు మొబైల్ నెట్‌వర్క్ ఎంతో అవసరం. ఆ సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరుస్తాం.

చివరిరోజు ఓటేసిన 129మంది ఉద్యోగులు

ఉదయగిరి, మే 8: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో సరైన సౌకర్యాలు లేక ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. మూడురోజుల పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసిన అధికారులు చివరిరోజు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. నియోజకవర్గంలో 2,336 పోస్టల్ బ్యాలెట్లకు గాను 2,207 ఓట్లు పోలయ్యాయి. మిగిలిన 129 ఓట్లకు చివరిరోజు ఇక్కడ ఏర్పాటు చేసిన కేంద్రంలో ఉద్యోగులు ఓటు వేశారు.

అంగన్‌వాడీ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

సీతారామపురం, మే 8: సంజీవరెడ్డినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన స్థలాన్ని గ్రామానికి చెందిన బండారు రమణమ్మ అక్రమంగా ఆక్రమించినట్లు గ్రామస్థులు, అంగన్‌వాడీ సిబ్బంది బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వారితో మాట్లాడారు. గ్రామ కంఠానికి సంబంధించిన సమస్యలు పంచా యతీ కార్యదర్శికి, ఎంపీడీవోకు తెలియజేయాలని సూచించారు. అనంతరం వారు అక్కడి నుంచి ఎంపీడీఓను కలిపి వినతిపత్రం అందజేశారు. కార్యదర్శి పంపి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల కోడ్ పట్టదా..?

సంగం, మే 8: మరో నాలుగు రోజుల్లో పోలింగ్ జరగనుంది. రాజకీయ నాయకులు ఫొటోలు, ఫ్లెక్సీలు సంగంలో నేటికీ కన్పిస్తున్నాయి. స్థానిక కలిగిరి రహదారిలో వైఎస్ఆర్ విగ్రహానికి ముసుగేసి దాన్ని చుట్టూ ఉన్న కమ్ములు, నిచ్చెనకు వైసీపీ రంగులు అలాగే ఉన్నాయి. ఈ రంగులు అధికారులకు కనిపించకపోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగం, మే 8: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి ఈ నెల 9వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం ప్రిన్స్‌పాల్ ఏడుకొండలు ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన యువతీ, యువకులు అందుకు అర్హులన్నారు.

ఉరుములు, మెరుపుల బీభత్సం

వరికుంటపాడు, మే 8: మండలంలో మంగళవారం రాత్రి నుంచి తెల్లవారేంత వరకు కురిసిన ఓ మోస్తారు జడివాన కురిసింది. భారీ శబ్ధంతో ఉరుములు, మెరుపులతో బీభత్సం సృష్టించడంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో అని ప్రజలు భయాందోళన చెందారు. చాలా గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ఉక్కపోత, దోమల తాకిడితో జనం జాగారం కాశారు.

ఉదయగిరి: మంగళవారం అర్థరాత్రి గంటపాటు కురిసిన అకాలవర్షంతో వాతావరణం చల్లబడింది. సీతారామపురంలో 74.2, వరికుంటపాడులో 90.0, ఉదయగిరిలో 79.6, దుత్తలూరు 102.0 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. కుర్రపల్లి, ఉదయగిరి గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. గండిపాళెంలో మార్గంలో రోడ్డుపై మురుగునీరు నిలిచింది. గాలులకు విద్యుత్ తెగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

బాబు అంటేనే బ్రాండ్.. ఆయనతోనే అభివృద్ధి

- అనంతసాగరం ప్రజాగళంలో వేమిరెడ్డి, ఆనం

అనంతసాగరం, మే 8: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అంటేనే ఒక బ్రాండ్ అని, ఆయనతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ప్రజాగళం ప్రచారం భాగంగా శంకరనగరం, లక్కురాజుపల్లి, రేవూరు, మినగల్లు, నల్లరాజుపాలెం, కొత్తపల్లి, వడ్డిపాలెం, ముత్తుకూరు, పాతదేవరాయపల్లి, లింగంగుంట, అనంతసాగరంలో పర్యటించారు. వారికి టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో దోపిడి పాలన కొనసాగుతుందని ఈ ఎన్నికల్లో ఆ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో 15సార్లు ఆర్టీసీచార్జీలు పెంచి పేదలను దోపిడికి గురిచేశారని విమర్శించారు. ఆత్మకూరులో రెండు సార్లు మేకపాటి సోదరులకు అవకాశం ఇస్తే ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ఆనం ప్రశ్నించారు. తన హయంలో రూ.3,600 కోట్లతో ఆత్మకూరును అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. తిరిగి ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గంలోని అన్ని మండలాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆదర్శగ్రామాలుగా చేసి చూపుతానని హామీ ఇచ్చారు. దోపిడీదారులను ఈ ఎన్నికల్లో పక్కనపెట్టి టీడీపీని ఆదరించి గెలిపించాలని కోరారు. రేవూరులో బీజేపీ నాయకుడు మాకిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ప్రభాకర్ ఆధ్వర్యంలో ముదిరాజ్ కులానికి చెందని 50కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నెల్లూరు మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజ యరెడ్డి, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, టీడీపీ అధ్యక్షురాలు మునగపాటి సునీత, మెట్టుకూరు కృష్ణారెడ్డి, రాపూరు సుజాతమ్మ, మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, నర్సారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతి నాయుడు, రాజయ్యనాయుడు పాల్గొన్నారు.

ఆత్మకూరు: నువ్వూరుపాడు పంచాయతీలోని పాతజంగాలపల్లిలో టీడీపీ అభ్యర్థులు ఆనం రామనారాయణ రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను గెలిపించాలని స్థానిక నేతలతో ఆనం కైవల్యారెడ్డి ప్రచారం చేపట్టారు. ఆమె వెంట పులిమి శైలజారెడ్డి పాల్గొన్నారు.

- 21వ వార్డులోని జ్యోతినగర్ టీడీపీ ఇన్‌చార్జ్‌లు కొత్తపల్లి రమేష్, నలిశెట్టి శ్రీనివాసులు, కొత్తపల్లి కిషోర్ పర్యటించారు.
- బీజేపీ నేతలు కుడుముల సుధాకర్‌రెడ్డి, కరటంపాటి సుధాకర్ పట్టణంలోని సత్రం సెంటర్ నుంచి చాకలివీధి, యాద వ వీధి, బస్టాండ్ సెంటర్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కర టంపాడులోని ఎస్టీ కాలనీలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచ లరావు, గార్లపాటి వేణుగోపాల్ రెడ్డి పర్యటించారు.

సంగం: దువ్వూరులో ఆనం రంగ మయూర్‌రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

చేజర్ల: కాకివాయి గ్రామంలో ఆనం రంగమయూర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల గెలిపించాలని కోరారు.



అనంతసాగరం ప్రచారంలో పాల్గొన్న ఆనం, వేమిరెడ్డి



పాతజంగాలపల్లిలో ఆనం కైవల్యారెడ్డి ఎన్నికల ప్రచారం



కాకివాయిలో ఆనం రంగమయూర్ రెడ్డి ప్రచారం

పరిశ్రమల హబ్‌గా ఉదయగిరి

- టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్



జీ.చెరువుపల్లిలో గజమాలతో కాకర్లను సన్మానిస్తున్న గ్రామస్థులు

ఉదయగిరి రూరల్, మే 8: నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్ది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికే తొలి ప్రాధాన్యత ఇస్తానని ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. పల్లెపల్లెకు కాకర్ల కార్యక్రమంలో భాగంగా బుధవారం జీ.చెరువుపల్లి, జీ.చెర్లోపల్లి, బండగానిపల్లి, జీ.అయ్యావారిపల్లి, పుల్లాయపల్లి, శకునాపల్లి, కృష్ణంపల్లి, ఆర్లపడియలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాకర్లకు ప్రజలు ప్రజలు ఘన స్వాగతం పలికారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. నియోజకవర్గాన్ని 40 ఏళ్లుగా పాలిస్తున్న ఓ కుటుంబం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజలకు గుక్కెడు మంచినీరు అందించలేని వారు ఓట్లు ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో తనతో పాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జీ.అయ్యవారిపల్లిలో మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ చేతల రమణయ్య ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శులు పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డి, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, మతకాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మా నాన్న కాకర్ల సురేష్‌ను గెలిపిం చాలని బుధవారం రాత్రి ఆయన కుమార్తె ధాత్రి, కుమారుడు సంహిత్‌లు పట్టణం లోని సుద్ధబావివీధి, చాకలవీధి, అగ్రహారంలో నాయ కులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్ర మంలో షేక్ రియాజ్, సయ్యద్ సందానీ పాల్గొన్నారు.

వింజమూరు: పట్టణంలో కాకర్ల సురేష్ మరదలు కాకర్ల సురేఖ, కుటుంబసభ్యులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పరిశ్రమలు రావాలంటే కాకర్ల సురేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గురజాల వెంకటరమణయ్య, జుబెల్ రాజా, కోడూరు నాగిరెడ్డి, మంచాల శ్రీనివాస్‌నాయుడు, వసంత, వెంకట్‌రావు, వెంకటేశ్వర్లు, సీహెచ్.వెంకటేష్, ఉన్నారు. ఈ సందర్భంగా టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలు కాకర్ల సురేష్ కుటుంబసభ్యులను కలిసి మద్దతు తెలిపారు. ఎన్ని కల్లో కాకర్ల సురేష్ సైకిల్ గుర్తుకు ఓటు వేసి కాకర్లను గెలిపి స్తామని చెప్పారు. కార్యక్రమంలో కాకర్ల సురేష్ సతీమణి కాకర్ల ప్రవీణ, తనయ ధాత్రి, మాతృమూర్తి, కాకర్ల మస్తానమ్మ, మర దలు కాకర్ల సురేఖ తనయ అస్మిత, కుటుంబ సభ్యులు ముప్ప రాజు పద్మజ, పొన్నం ఝాన్సీ, రావిపాటి సంధ్య పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కాకర్ల సురేఖ



ఉదయగిరిలో ప్రచారం చేస్తున్న కాకర్ల కుమార్తె, కుమారుడు

కౌంటింగ్ సెంటర్లలో అవసరమైన చర్యలు తీసుకోండి

- లెక్కింపు కేంద్రాల పరిశీలనలో కలెక్టర్



ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హర నాథ పురం), మే 8 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్లను, స్ట్రాంగ్ రూము లను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల అనంతరం ఈవీఎంలు భద్రపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ పాల్గొన్నారు.

- **నేడు కూడా పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం**

ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది గురువారం కూడా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే సౌకర్యాన్ని ఈసీ కల్పించిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో ఉన్న రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు. ఇంకా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అగ్నివీర్' నోటిఫికేషన్ విడుదల

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 8: భారత దేశ సైన్యంలో నియామకాలకు సంబందించిన అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదలైందని జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి.. అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 17 నుంచి 21 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ పోస్టులకు కనీసం పదో తరగతి ఉతీర్ణులై ఉండాలని, ట్రేడ్స్ మెన్ పోస్టులకు 8వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు ఫారంలో మొబైల్ నెంబరు నమోదు చేయాలని, పూర్తి చిరునామా, స్కాన్ చేసిన పాస్ పోర్ట్ సైజు ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), మే 8 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, నెల్లూరులోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఈనెల 9 నుంచి జూన్ 10లోపు iti.ap.gov.in వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయించిన ప్రత్యేక సంఖ్యను గుర్తుపెట్టుకోవాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్న తరువాత అభ్యర్థి తాను చేరదలచుకున్న ఐటీఐ ఏ జిల్లాలో ఉందో ఆ జిల్లాను ఎంపిక చేసుకుని దరఖాస్తు పూర్తి చేయాలన్నారు. అనంతరం వారికి సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 10 నుంచి జూన్ 10వతేదీ వరకు సర్టిఫికెట్లను ధ్రువీకరించుకోవాలన్నారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ తేదీలను మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా తెలియచేస్తామన్నారు. పూర్తి వివరాలకు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో సంప్రదించాలని కోరారు.



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్



మైనింగ్ శాఖ దాడుల్లో పట్టుబడ్డ ఎక్స్‌కవేటర్

ఇసుక అక్రమ తరలింపుపై మైనింగ్ దాడులు

- రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

సంగం, మే 8: వెంగారెడ్డిపాళెం సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ తరలింపుపై బుధవారం తెల్లవారుజామున మైనింగ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఇసుకనుతరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నారు. అనంతరం వాహనాలను స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దువ్వూరులో తల్లీకొడుకు మృతి

- ఆలస్యంగా వెలుగులోకి..

సంగం, మే 8: మండలంలోని దువ్వూరులో తల్లీకొడుకులు రమణమ్మ (80), శ్రీనివాసులురెడ్డి (61)లు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల మేరకు.. వృద్ధురాలికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహలై ఇతర ప్రాంతాల్లో వారి భర్తలతో ఉంటున్నారు. కుమారుడికి వివాహం కాకపోవడంతో వారిద్దరే ఉంటున్నారు. కుమారుడికి మద్యం అలవాటు ఉంది. ఈ క్రమంలో బుధవారం వారి ఇంటి పక్కనే ఉన్న ఓ మహిళ దేవుని ప్రసాదం పెట్టేందుకు వారి ఇంటి వద్దకు వెళ్లింది. పిలిస్తే పలకలేదు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుంది. దీంతో ఆమె చుట్టుపక్కల వారికి తెలపడంతో స్థానికులు వెళ్లి పరిశీలించారు. ఇద్దరు చనిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. తెలిసిన వారితో రమణమ్మ కుమార్తెలకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా వండుకున్న అన్నం కూర దబరలోనే ఉంది. శ్రీనివాసులురెడ్డి మృతదేహం మంచం మీద, రమణమ్మ మృతదేహం కింద పడి ఉంది. వడ దెబ్బకు గురై మృతి చెంది ఉంటారని కుమార్తెలు భావించి మృతదేహాలకు దహన సంస్కారాలు చేశారు. ఈ విషయంలో పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

సోమశిలలో 7.992 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 8: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. బుధవారానికి జలాశయంలో 7.992 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

నెల్లూరు(క్రైం), మే 8 : ఏడేళ్ల చిన్నారిపై గుర్తుతెలియని దుండగుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరులోని కోటమిట్ట షాదీమంజిల్ సమీపంలో ఓ కుటుంబం నివసిస్తోంది. అందులోని ఏడేళ్ల పాపపై రెండు రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తి లైంగిక దాడికి యత్నించగా బాలిక అతని నుంచి తప్పించుకొని ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పడంతో వారు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి బాధిత తల్లిదండ్రులను విచారించారు. ఘటనా స్థలంలోని సీసీపుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు.

హతురాలు మృతదేహానికి పోస్టుమార్టం

సంగం, మే 8: జండాదిబ్బలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురైన వృద్ధురాలు సుబ్బమ్మ మృతదేహానికి బుధవారం సంగం పోలీసులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమర్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

హత్యకు గురైన వృద్ధురాలి కేసులో ఇద్దరు అనుమానితులను బుధవారం సంగం పోలీసులు అదుపులోకి తీసుకుని గోప్యంగా విచారిస్తున్నారు. వారి ఇద్దరు గ్రామానికి చెందిన వారే కావడం గమనార్హం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6801
వెండి కిలో ధర	రూ. 83,700
వెండి ఒక గ్రాము	రూ. 85.70

ఎన్నికల వేళ ఇదేమి చోద్యం!

● పైపులైన్ల పేరుతో సీసీ రోడ్లు ధ్వంసం



ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న ముసునూరు, కమ్మపాలెం రోడ్డు మార్జిన్

కావలి రూరల్, మే 8: నవ్విపోదురు గాని నాకేంటి సిగ్గు.. అన్నట్టుగా రెండేళ్ల క్రితం రోడ్డు అంచులు పగలగొట్టి వేసిన పైపులైన్లకు నేడు జాయింట్లంటూ గత ప్రభుత్వ హయాంలో వేసిన సిమెంట్ రోడ్డును ఇప్పుడు ధ్వంసం చేస్తున్నారు. దీనిని చూసిన ప్రజలు ఆదేమి చోద్యం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. కావలి పట్టణ పరిధిలోని ముసునూరులో ఇంటింటికి కుళాయి కనెక్షన్ పేరుతో గతంలో పైప్ లైన్ వేశారు. దాని ద్వారా నేటికి నీటి సరఫరా జరగలేదు. ఎన్నికలు దగ్గర పడడంతో అధికారపార్టీ నేతలు పైపులైన్లకు జాయింట్ల పేరుతో బుధవారం సిమెంట్ రోడ్డు అంచులను ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేపట్టారు. ముసునూరు కమ్మపాలెం రోడ్డు, వడ్డిపాలెం రోడ్డు తదితర రోడ్ల అంచులు ఎక్స్‌కవేటర్‌తో తవ్వి ధ్వంసం చేశారు. 2017-18 సంవత్సరంలో నాటి టీడీపీ ప్రభుత్వంలో వేసిన సీసీ రోడ్లను నేటి వైసీపీ ప్రభుత్వంలో ధ్వంసం చెయ్యడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం



సర్ హెన్నీ డూనాంట్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, మే 8: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో రెడ్‌క్రాస్ ఉద్యమ స్థాపకుడు సర్ హెన్రీ డూనాంట్ చిత్రపటానికి రెడ్‌క్రాస్ బాధ్యులు పూల మాలవేసి నివాళులఅర్పించారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో ఉన్న సాటి మనిషిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. అదే మానవత్వాన్ని సజీవంగా ఉంచడమన్నారు. విద్యార్థి దశలోనే ఆరోగ్యం, సేవా, అంతర్జాతీయ స్నేహం వంటి మానవతా కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించడానికి జూనియర్ రెడ్‌క్రాస్, యూత్‌రెడ్‌క్రాస్ విభాగాలను విద్యార్థులతో ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, సభ్యులు ఓరగంటి వెంకటేశ్వర్లు, కే. హరినారపరెడ్డి, బీఎస్ ప్రసాద్, డీ.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కావలి కందుకూరు



కొండాపురంలో చుట్టూ ప్రహరీ లేని ఎస్సీ సంక్షేమ వసతి గృహం

నా ఎస్సీ, నా బీసీల గతి..

● ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో సమస్యల తిష్ఠ

● విద్యార్థులకు తప్పని తిప్పలు

ఇంతేనా జగనన్నా..?

కొండాపురం, మే 8: నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీలు అని రాగాలు తీసే జగనన్న సరైన వసతులులేక అధ్వాన స్థితిలో ఉన్న ఎస్సీ బీసీ వసతి గృహాల్లో మగ్గుతున్న ఆయా సామాజిక వర్గాల విద్యార్థులు దుస్థితి మాత్రం పట్టడం లేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతి బహిరంగ సభలోనూ నా ఎస్సీ, నా బీసీలంటూ వారి అభివృద్ధికి పలురకాలుగా నిధులు కేటాయిస్తున్నామని చెప్పుకోవడం కేవలం వాగ్దానాలకే పరిమితమైంది. క్షేత్రస్థాయిలో ఎక్కడా నిధులు విడుదల కాక వసతి గృహాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వీటి గతి ఇంతేనా జగనన్నా.. అని వారి తల్లిదండ్రులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

● వసతి గృహాల్లో 100కు పైగా విద్యార్థులు

కొండాపురంలో ఒక ఎస్సీ, ఒక బీసీ సామాజిక వసతి గృహాలు ఉన్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి పేద విద్యార్థులు వసతి గృహాలలో ఉంటూ స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఎస్సీ సామాజిక వసతి గృహంలో విద్యార్థులకు సరైన వసతులులేక అల్లాడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నానని చెప్పుకోవడం కేవలం మాటలకు పరిమితమైంది. మండలంలోని రెండు సామాజిక వర్గాల వసతి గృహాల అభివృద్ధికి రెండు విడతలలో నాడు-నేడు ద్వారా జరిగిన పనులకు ఎంపిక చేయకపోవడం గమనార్హం. ముఖ్యంగా ఎస్సీ వసతి గృహం నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు అది శిథిలావస్థకు చేరుతున్నప్పటికీ చుట్టూ ప్రహరీ నిర్మించలేదు. అలాగే మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. వసతి గృహంలో కిటికీలకు చెక్కలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. అలాగే బీసీ సామాజిక వసతి గృహం నూతన భవన నిర్మాణానికి తెలుగుదేశం ప్రభుత్వంలో స్థానిక ఎస్సీ వసతి గృహం పక్కనే స్థలం కేటాయించారు. ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదన మరుగున పడింది. కేటాయించిన స్థలం స్థానికంగా ఉండేవారు ఆక్రమించుకోవడం జరిగింది. ఆక్రమణకు గురైన స్థలాన్ని విడిపించడంలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు.



బీసీ సంక్షేమ వసతి గృహం

● నిర్లక్ష్యానికి గురైన వసతిగృహాలు

ముఖ్యమంత్రి జగన్ మీటింగులలో నా ఎస్సీ, నా బీసీ అని చెప్పుకొని వారికి ఎటువంటి న్యాయం చేయడం లేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాగ్దానాలు కేవలం నీటి మూటలుగా మిగిలిపోయాయని మండలవాసులు అంటున్నారు. వసతి గృహాలు ఏర్పాటు చేసి దాదాపు 20 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడం విడ్డూరంగా ఉందని తల్లిదండ్రులు అంటున్నారు. ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల పట్ల ఇంత నిర్లక్ష్యం చూపడం దారుణంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. నాడు- నేడు రెండు విడతలుగా ఎంపికలు జరిగి పనులు చేస్తున్నప్పటికీ ఈ రెండు వసతి గృహాలు ఎంపికచేయలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వసతి గృహాలలో సరైన వసతులు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షంతో చల్లబడ్డ వాతావరణం



లింగసముద్రంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

లింగసముద్రం, మే 8 : సుమారు 20 రోజుల నుంచి భానుడి భగ భగలు, వేడి గాలులకు ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడడంతో సేదతీరారు. రాత్రి 9 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము 5 గంటల వరకు లింగసముద్రంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రజలు మండే వేడి గాలుల నుంచి ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ వర్షానికి లింగసముద్రంలోని ప్రధాన రహదారిపై నీరు నిలిచి ద్విచక్ర వాహనచోదకులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బంది కలిగింది.

ఇంటూరి సౌజన్య ఇంటింటి ప్రచారం



కాకుటూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న సౌజన్య

వలేటివారిపాలెం, మే 8 : మండలంలోని కాకుటూరు, వలేటవారిపాలెం, అమ్మపాలెం గ్రామాలలో నియోజకవర్గ ఉమ్మడి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు సతీమణి సౌజన్య బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య తమ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి తమ పార్టీ మేనిఫెస్టోను చూపించి ఉమ్మడి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావును, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పొడపాటి వెంకటేశ్వర్లు, సంగా పాండురంగారావు, సుబ్బారావు, కంచర్ల శాంతారావు, పొడపాటి సుదాకర్, పొడపాటి రామారావు, మధవరావు, మాల్యాద్రి, మధన్, పున్నయ్య, పసుపులేటి సుదాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వేమిరెడ్డిపై విమర్శలు

● కందుకూరు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు

● టీడీపీలోకి భారీగా వలసలు

కందుకూరు, మే 8: తెలుగుదేశం కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని విమర్శించే స్థాయి విజయసాయిరెడ్డికి లేదని, ఓటమి భయం ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తోందని కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. వేమిరెడ్డి డబ్బులు ఇచ్చి వైసీపీ నేతలను కొంటున్నాడని ఉలవపాడులో విజయసాయిరెడ్డి ఆరోపించటం దుర్మార్గమన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ఓటమిని ముందేగ్రహించి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నాడన్నారు. సూట్ కేసు కంపెనీలతో చీకటి సామ్రాజ్యాన్ని సృష్టించినందుకే విజయసాయిరెడ్డి 16 నెలలు జైలులో ఉండివచ్చిన విషయం ప్రపంచానికి తెలుసని, అలాంటి వ్యక్తి అవినీతి మచ్చలేని వేమిరెడ్డిపై విమర్శలు చేయటం విడూద్దరంగా ఉందన్నారు. వాస్తవానికి దొంగల పార్టీ, గజదొంగల పార్టీ వైసీపీ అని ప్రజలంతా గ్రహించి తగినబుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక, మట్టి, కొండలు ఇలా సర్వం స్వాహా చేశారని విమర్శించారు. వైజాగ్‌లో దోచుకున్న భూములు, కొండలకు కొట్టిన గుండ్లే విజచసాయిరెడ్డి దోపిడీకి సజీవ సాక్ష్యాలన్నారు. రామాయపట్నం పోర్టు విషయంలో చెప్పేవన్నీ అబద్ధాలేనని, వెనుకబడిన కందుకూరు ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకుని అక్కడ మేజరు పోర్టు కట్టడానికి చంద్రబాబు ఆలోచన చేస్తే జగన్ దానిని మైనర్ పోర్టుగా మార్చేశారని, దాదాపు 7వేల ఎకరాలను మీ అల్లుడికి ధారాదత్తం చేసేందుకు పెద్ద స్కెచ్ వేశారని, నీ బురిడీ వేషాలు ఎవరికి తెలియవని విమర్శించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు వెనక్కు తీసుకుంటారని, చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని దుష్ప్రచారం చేస్తున్నారని, టీడీపీ, బీజేపీ కలయికతో ముస్లిం సమాజానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని చంద్రబాబే స్వయంగా వివరణ ఇచ్చారని పేర్కొన్నారు. ముస్లింల అభివృద్ధి కోసం గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసింది వైసీపీ కాదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాదు, ముచ్చు శ్రీను, గోచిపాతల మోషే, రాయపాటి శ్రీనివాసరావు, రెబ్బవరపు మాల్యాద్రి, కంద్రా మాల్యాద్రి పాల్గొన్నారు.

ఇంటూరి సమక్షంలో టీడీపీలోకి భారీగా చేరిక

మండలంలోని పాలూరు దొండపాడు పంచాయతీలోని దాసరిపాలెంలో పలువురు వైసీపీ కార్యకర్తలు బుధవారం ఆపార్టీని వీడి టీడీపీలో చేరారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు సూరె వినోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తుమ్మల సురేష్, తుమ్మల శ్యాంప్రసాద్, తుమ్మల నరేష్, తుమ్మల నరసింగరావు, దార్ల రమణయ్య తదితర కుటుంబాల వారు టీడీపీలో చేరగా వారికి నాగేశ్వరరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నార్నె రోశయ్య, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఆళ్ల హరికృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, గోనుగుంట వీరబ్రహ్మం, వల్లంరెడ్డి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

● పట్టణంలోని 25వ వార్డుకి చెందిన మాదాల మాల్యాద్రి, పత్తిపాటి మాల్యాద్రి కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కొమ్మి కోటయ్య, గొంది మాధవరావు, మాదాల మల్లికార్జున, మాదాల మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు. గుడ్లూరు మండలం చినలాటిరిపి పంచాయతీలోని ఆర్‌సీ అగ్రహారంలో గుండ్లపల్లి ప్రసాద్, కొమరగిరి పెదఅంకయ్య, నాగార్జున, నరసింహం, చినఅంకయ్య, సిసింద్రి, కొండయ్య, ఇండ్ల మాల్యాద్రి, పోట్లూరి శ్రీను తదితరులు టీడీపీలో చేరారు.

● అధికార వైసీపీకి కంచుకోటగా ఉన్న మండలంలోని మాచవరంలో పెద్దసంఖ్యలో ఆపార్టీ కార్యకర్తలు ఎన్డీఏ కూటమికి మద్దతుగా టీడీపీ, జనసేన కూటమిలో చేరారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పులి మల్లికార్జున ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో జనసేనలో చేరిన వారంతా కూటమికి మద్దతు ప్రకటించారు. చదలవాడ నరేష్, శీలం విశ్వేశ్వరరావు, వెంకటరావు, దండే కోటేశ్వరరావు, కూనపురెడ్డి హనుమంతరావు, శివయ్య, అనంతనాగయ్య తదితర కుటుంబాలు జనసేనలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాదినేని మాల్యాద్రి, రావూరి మహేంద్ర, యడ్ల బ్రహ్మారెడ్డి, సూరం చిరంజీవిరెడ్డి, కాకుటూరి శ్రీను, గంధం రాము, బొబ్బవరపు రామారావు జయచంద్రారెడ్డి, సూరం శివకోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : దొండపాడులో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



లింగసముద్రం : టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి మహిళకు లబ్ధి

లింగసముద్రం : చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి మహిళకు లబ్ధి చేకూరుతుందని కందుకూరు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో మండలంలోని పెదపవని, ముత్యాలపాడు, ముత్తంవారిపాలెం గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకాలు అమలైతే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. రాష్ట్రమంతా చంద్రబాబునాయుడు పాలన మళ్లీ కావాలని కోరుకుంటుందని, ఈ నెల 13న జరిగే ఎన్నికల తర్వాత ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని నాగేశ్వరరావు అభ్యర్థించారు.

● ముత్యాలపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు కొండూరు ప్రసాద్, కొండూరి అశోక్, గంగవరపు పిచ్చినాయుడు, కొండపునాయుడు, వెంకటేశ్వర్లు, బొబ్బ శ్రీనివాసులు, కన్నె మాధవ, చిన్న రాములు, చిన్న అంకయ్య, గుండాబత్తిన బాబూరావు, మాలకొండయ్య, సురేష్, కుదారి రామయ్య తదితరులు టీడీపీలో చేరారు. వారికి నాగేశ్వరరావు పసుపు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జి కల్పన, నాయకులు యల్లావుల మాధవ, ఒట్టిగుంట వెంకట్రావు, జీ.సాంబయ్య, షేక్ నాయబ్‌రసూల్, పి మాల్యాద్రి, కె సుబ్బులునాయుడు, జనసేన నాయకలుడు నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించాలి

● అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం ● సహజ వనరుల దోపిడీలో దిట్ట కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ● సినీ నటుడు నారా రోహిత్



ప్రచారంలో పాల్గొన్న నారా రోహిత్, క్రిష్ణారెడ్డి తదితరులు

కావలి రూరల్, మే 8: రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించాలంటే టీడీపీని గెలిపించు కోవాలని సినీ నటుడు నారా రోహిత్ పేర్కొన్నారు. కావలి మండలంలోని ఆనెమడుగు, సర్వాయపాలెం, పెదపట్టపుపాలెం పంచాయ తీల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచార యాత్ర నిర్వహిం చారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డికి మద్దతుగా కమెడియన్ రఘు, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిలతో కలసి ప్రచారం నిర్వహించేందుకు గ్రామానికి చేరుకోగా స్థానికులు అడుగడుగున ఘన స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయ డు ఉండాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిని తుంగలో తొక్కిన సైకో ముఖ్యమంత్రి పోయి సైకిల్ రావాలన్నారు. ప్రజల ఆస్తులను దోచుకోవటానికే ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తీసుకువచ్చిందన్నారు. అలాగే నాశిరకం మద్యం తయారు చే యించి ప్రజల ప్రాణాలతో జగన్ చెలగాటమాడుతున్నారన్నారు. 10 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మట్టి, గ్రావెల్ దందాలతో దోచుకోవడం దాచుకోవడంలో దిట్ట అని, ఆయన చేసిన అభివృద్ధి శూన్యమన్నా రు. మే 13న జరగనున్న ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా కావ్య క్రిష్ణారెడ్డిని, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

● ప్రజా సమస్యలు పట్టని దోపిడీదారుడు : కావ్య

ప్రజా సమస్యలు పట్టని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఏ గ్రామాల్లో గ్రావెల్, మట్టి దొరుకుతుందో చెప్పగలడన్నారు. గ్రావెల్, మట్టి, ఇసుక తరలింపుతో కోట్లు గడించిన దోపిడీదారుడని ఆరోపించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

● కావలి కాలకేయుడు ఎమ్మెల్యే : వంటేరు

కావలి కాలకేయుడిగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నిలిచారని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఆరోపించారు. స్వాతి ముత్యంలో కమలహాసన్‌గా రాజకీయా ల్లోకి వచ్చిన ఆయన రక్తం రుచి మరిగిన మృగంలా మారారన్నారు. అభివృద్ధి పనులు మంజూరు చేయించుకోవడం చేతగాని ఎమ్మెల్యే తాము చేపట్టిన అభివృద్ధి పనులను ధ్వంసం చేసి రాక్షసానందం పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, ఎన్డీఏ కూటమి నాయకులు కండ్లగుంట మధుబాబునాయుడు, నాయుడు రాంప్రసాద్, కందుకూరి వెంకట సత్యన్నారాయణ, మామిడి వెంకటేశ్వర్లు, ఉప్పాల యల్లారావు, నారయ్య, వెంకట్రావ్, ఉప్పాల వెంకటయ్య, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



రోహిత్, క్రిష్ణారెడ్డిలకు క్రేన్‌తో గజమాల వేస్తున్న అభిమానులు



మాట్లాడుతున్న సినీ నటుడు నారా రోహిత్

ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం



ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

కలిగిరి, మే 8: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నందిపోగు వెంగళరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెలగపాడు, పాతనాపురం, రావులకొల్లు, ఏపినాపి గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లను సైకిల్‌గుర్తుపై ఓటేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నేతలు బొర్రా వెంగళరావు, గోచిపాతల ఆనందరావు, బక్కా కృష్ణమూర్తి, గంగపట్ల నాగరాజు పాల్గొన్నారు.

ఇంటూరి కోసం తనయుడి ప్రచారం

కందుకూరు, మే 8: కందుకూరు నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు విజయం కోసం ఆయన తనయుడు సందీప్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని కోటేశ్వర థియేటర్, మార్కెట్ సెంటర్లలో చిరువ్యాపారులు, రోజువారీ కూలీలు, కొనుగోలుదారులను పలుకరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా టీడీపీ కూటమి అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కందుకూరు అసెంబ్లీకి పోటీ చేస్తున్న తన తండ్రి ఇంటూరి నాగేశ్వరరావుకు ఒక్క అవకాశం ఇచ్చి చూడాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆయన వెంట ముచ్చు శ్రీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టరు కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్

● పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగానికి నేడు అవకాశం


కందుకూరు, మే 8: పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కు వినియోగించుకోకుండా మిగిలిపోయి ఉన్న ఉద్యోగుల కోసం గురువారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటుచేస్తున్నట్లు సబ్ కలెక్టరు జి. విద్యాధరి బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు ఈ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోకుండా మిగిలిపోయిన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కాకర్ల, వేమిరెడ్డి గెలుపు కోసం ముమ్మర ప్రచారం

కొండాపురం, మే 8: ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల గెలుపు కోసం మండలంలోని రేణమాల ఎస్సీ కాలనీలో బుధవారం టీడీపీ, జనసేన నాయకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. కూటమి మ్యానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ కరపత్రాలను ప్రజలకు అందచేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండారెడ్డి, తోకల మాల్యాద్రి, జనసేన నాయకులు కే.రాఘవేంద్ర, టీ.రమేష్, రహమంతు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు



2018 జనవరి 30న వెంకటగిరి నియోజకవర్గం సైదాపురంలో జిల్లాలోకి ప్రవేశించిన జగన్.. సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల మీదుగా ప్రకాశం జిల్లాలోకి నడక సాగించారు. ఎందరితోనో మాట్లాడారు. అధికారంలోకి రాగానే అన్నీ మార్చేస్తానంటూ హామీలెన్నో ఇచ్చారు. తలలు నిమిరి, నుదుట ముద్దులు పెట్టి, బుగ్గలు గిల్లి ఆయన చెప్పిన మాటలు నమ్మిన ప్రజలు ఒక్క ఛాన్స్ ఇచ్చారు. అంతే ఆ తర్వాత నడిచి వచ్చిన దారులనే జగన్ మరచిపోయారు. గాల్లో తప్ప నేలమీదకు దిగడం మానేశారు. మళ్లీ ఎన్నికలొచ్చాకే బస్సెక్కారు. మాట తప్పనూ, మడమ తిప్పనూ, చేసేదే చెబుతానూ.. అని వేదికలమీద దబాయించి అబద్ధాలు చెప్పే ఈ నాయకుడి పాలనలో అభివృద్ధి ఎలా ఉందో ఆయన నడిచిన దారులే సాక్ష్యం. పాదయాత్ర సమయంలో సవ్యంగా ఉన్న ఈ రోడ్లు ఇప్పుడు ఇలా ఉన్నాయి...

- ఆంధ్రజ్యోతి బృందం

పాదయాత్రే తనను నాయకుడిగా మలచిందని ఆయన చెబుతాడు. రాష్ట్రం దుస్థితి, ప్రజల కష్టాలు కళ్ల చూసిన తర్వాతనే వైసీపీ మేనిఫెస్టో రూపొందించానని అంటారు. నిజమేనా? నమ్మచ్చా? జగన్ మాటలకూ చేతలకూ నడుమ అగాధాలు ఉన్నాయనేందుకు సాక్ష్యమే ఈ కథనం..



సైదాపురం-పొదలకూరు రోడ్డు దుస్థితి

జగన్ నడిచిన దారులు

ఇప్పుడిలా ఉన్నాయ్!

వైసీపీ పాలనకు అద్దం పడుతూ దుస్థితిలో రోడ్లు

నియోజకవర్గం పేరు : నెల్లూరురూరల్

పాదయాత్ర తేదీలు : 2018, ఫిబ్రవరి 2,3,4

నడిచిన గ్రామాలు : సౌత్‌మోపూరు, ములుముడి, కొమ్మరపూడి, దేవరపాళెం

నడిచిన దూరం : 15 కి.మీ

జగన్ నడిచిన రోడ్ల దుస్థితి : నెల్లూరు - తాటిపర్తి రహదారిపై అప్పట్లో గుంతలు ఉండగా ఇప్పుడు గోతులుగా మారాయి.



జొన్నవాడ మలుపు రోడ్డు దుస్థితి

నియోజకవర్గం పేరు : ఆత్మకూరు

పాదయాత్ర తేదీలు : 2018, ఫిబ్రవరి 6, 7

నడిచిన గ్రామాలు : దువ్వూరు, సిద్దీపురం, వెంగారెడ్డి పాళెం, గాంధీ జనసంఘం, పల్లిపాళెం, సంగం

నడిచిన దూరం : 18 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్ల స్థితి : పల్లిపాళెం రహదారి ప్రస్తుతం 5 కిలోమీటర్ల దూరం గుంతలమయంగా మారి అధ్వానంగా ఉంది. రహదారిపై పంట కాలువల కల్వర్టులు కుంగిపోయాయి. రూ20లక్షలతో అధికారులు ప్రతిపాదనలు పంపినా పైసా మంజూరు కాలేదు. అలాగే కలిగిరి రహదారి (సంగం నుంచి కొరిమెర్ల వరకు) అధ్వానంగా ఉంది.



సంగం : సీఎం జగన్ నడిచిన పల్లిపాళెం రహదారి

నియోజకవర్గం పేరు : వెంకటగిరి

పాదయాత్ర తేదీలు : 2018, జనవరి 30

నడిచిన గ్రామాలు : సైదాపురం, షామైన్ రోడ్డు, జోగిపల్లి రోడ్డు, పొక్కందల రోడ్డు, ఊటుకూరు, గ్రిద్దలూరు రోడ్డు, తురిమెర్ల, కలిచేడు, తుమ్మలతలుపూరు రోడ్డు, మలిచేడు రోడ్డు

నడిచిన దూరం : 18 కి.మీ

జగన్ నడిచిన రోడ్ల దుస్థితి : సైదాపురం-పొదలకూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతుండటంతో యజమానులు గగ్గోలు పెడుతున్నారు.



పొదలకూరు రోడ్డు దుస్థితి

నియోజకవర్గం : ఉదయగిరి

పాదయాత్ర తేదీలు : 2018, ఫిబ్రవరి 11, 12, 13, 14, 15

నడచిన గ్రామాలు: తూర్పు గుడ్లదొన, పడమరగుడ్లదొన, అనంతపురం, సిద్దనకొండూరు, పరికోట, కుమ్మర కొండూరు, పెద్దపాడు, వీరారెడ్డిపాలెం, పోలంపాడు, కలిగిరి, క్రిష్ణారెడ్డి పాలెం, కుడుములదిన్నెపాడు, మార్నేనివారిపాలెం, శెట్టిపాలెం, జంగాలపల్లి, ఆదిమూర్తిపురం, కొండాపురం, రేణమాల, నేకునాంపేట.

నడిచినదూరం: 60 కి.మీ

రోడ్ల దుస్థితి : ఈ ఐదేళ్లలో రోడ్ల నిర్మాణమే చేపట్టలేదు. అక్కడక్కడా ప్యాచ్ వర్క్‌లు చేశారు. తూర్పుగుడ్లదొన నుంచి పడమర గుడ్లదొన వరకు రోడ్డు మార్జిన్ దెబ్బతిని ఉంది. పడమరగుడ్ల దొన నుంచి ఉదయగిరి రోడ్డు హైవే వరకు రోడ్లన్నీ గతుకుల మయంగా ఉంది.. కలిగిరి నుంచి నేకునాంపేటవరకు చప్టాలు దెబ్బతిని ఉన్నా మరమ్మతులకు నోచుకోలేదు. అలాగే రోడ్డు మార్జిన్‌లు దెబ్బతిని ఉన్నాయి. శెట్టిపాలెం, ఆదిమూర్తిపురం, కొండాపురం ప్రాంతాలలో అక్కడక్కడ రోడ్లు కూడా దెబ్బతిని ఉన్నాయి.



కొండాపురం : ఆదిమూర్తిపురం వద్ద దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు



కందుకూరు-వెంకటాద్రిపాలెం మధ్య అధ్వానంగా రహదారి

నియోజకవర్గం : కందుకూరు

పాయాత్ర తేదీలు : 2018, ఫిబ్రవరి 16, 17, 18

నడిచిన గ్రామాలు : కొత్తపేట, పెంట్రాల, జంపాలవారిపాలెం, కిలారివారిపలాలెం, లింగసముద్రం, బలిజపాలెం, వెంగళాపురం, గాంధీనగర్, వలేటివారిపాలెం, పోలినేనిపాలెం, కూనెపాలెం, పోకూరు, అత్తంటివారిపాలెం, బడేవారిపాలెం, బొంతవారిపాలెం, కాకుటూరు, చెర్లోపాలెం, కందుకూరు, వెంకటాద్రిపాలెం, అనంతసాగరం.

నడిచిన దూరం : 41 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్ల స్థితి : కొత్తపేట నుంచి వలేటివారిపాలెం వరకు రహదారి పరిస్థిత మరీ అధ్వానంగా మారింది. వలేటివారిపాలెం నుంచి కందుకూరు వరకు ప్రజలు కూడా అధ్వానంగా ఉన్న రోడ్డుపై గత ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే కందుకూరు నుంచి అనంతసాగరం నుంచి కూడా పంచాయతీ రాజ్ రోడ్డు అడుగుకు ఒక గుంతతో అధ్వానంగా మారింది.

పరపతి పాయె...

ఓట్లెలా అడగాలి ?



వైసీపీ ప్రభుత్వ పాలనలో వందలాది మంది సర్పంచులు అప్పుల పాలయ్యారు. వేలాది రూపాయలు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసినా ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు అందలేదు. సర్పంచ్‌గా గెలిచి ఊరికి అభివృద్ధి పనులు చేస్తామని చెప్పి, చివరకు సొంత ఆస్తులు అమ్ముకుని చేతిలో పైసా లేకుండా పోయిందని వారు ప్రస్తుతం ఆందోళన చెందు తున్నారు. తాజాగా సార్వ త్రిక ఎన్నికలు రావడంతో ప్రజల్లోకి వెళ్లి ఎలా ఓట్లు అడగాలని వారు మదనపడు తున్నారు. అయితే పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థులు మాత్రం తమను ఎలాగైనా ఈసారి గెలిపించాలని కాళ్ల పట్టుకుంటున్నారు. 'సర్పంచిగా పోటీ చేయ్.. నీకు అండగా ఉంటాం' అని మూడేళ్ల కిందట చెప్పిన ఆ నాయకులు తీరా లక్షలు ఖర్చయ్యాక కనిపించకుండా పోయారు. వారు కదా చేసిన పనులకు బిల్లులు వస్తాయని డాంబికాలు పలికారు. కానీ పత్తా లేకుండా పోయారు. ఈ విషయాన్ని గమనించిన కొందరు సర్పంచులు అధికార పార్టీని కాదని చాపకింద నీరులా కూటమి అభ్యర్థులను బలపరుస్తున్నారు.

- ఉదయగిరి

ఓటర్ స్లిప్పుల పంపిణీలో వలంటీర్లు

లింగసముద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో బుధవారం ఓటరు స్లిప్పుల పంపిణీలో సచివాలయ సిబ్బంది వెంట వలంటీర్లు కూడా ఉండడం పట్ల ఆ గ్రామ టీడీపీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎన్నికల విధులతో వలంటీర్లకు ఎలాంటి సంబంధం లేదని ఈసీ ఉత్తర్వులు ఇచ్చినా కొందరిలో మార్పులేదన్నారు. వలంటీర్లు ఎందుకు వచ్చారంటూ, టీడీపీ కార్యకర్తలు వారి ఫొటోలు తీయబోగా వారు పారిపోయారని చెప్పారు. సంబంధిత అధికారులు వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

- లింగసముద్రం

ఓట్ల కోసం పడరాని పాట్లు



కూటి కోసం కోటి విద్యలు అన్నట్లుగా.. నాయకులు కూడా ఓట్ల కోసం పడరాని పాట్లు, ఎప్పుడూ వేయని వేషాలు వేస్తున్నారు. ఎన్నడూలేని అనుబంధాలు, ఆప్యాయతలను కనబరుస్తున్నారు. నానా రకాల ఫీట్లు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే యత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో అన్ని పార్టీల నేతలు ఓటర్ల ఇళ్లకు క్యూ కడుతున్నారు. ఇంటింటికి తిరుగుతూ పలకరింపుల జోరు పెంచారు. అక్కా, బావా... అంటూ ఆప్యాయంగా పిలుస్తూ బంధుత్వాలు కలుపుతున్నారు. గ్రామాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఓటర్లను ఆత్మీయంగా పలకరిస్తూ ఈ ఎన్నికల్లో తమ నాయకుడికి ఓట్లు వేయాలని కోరు తున్నారు. అయితే ఎన్డీఏ కూటమి నాయకులు మాత్రం ఐదేళ్ల పాలనలో సర్వే పల్లి నియోజకవర్గంలో జరిగిన ప్రభుత్వ వైఫల్యాలు, దాడులు, అరాచకాలు, దౌర్జన్యాలు, మైనింగ్ దోపిడీ, భూకుంభ కోణాలు, అవినీతి, అక్రమాలను ఎత్తిచూపుతూ ప్రచారంలో దూసుకెళుతున్నారు. దీంతో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంది. దీనికి తోడు అభ్యర్థుల వారసులు సోమిరెడ్డి తరుపున ఆయన కుమారుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కోడలు సోమిరెడ్డి శృతిరెడ్డి, కుమార్తై డాక్టర్ సోమిరెడ్డి సింధురెడ్డి, అక్కా, బావ సంయుక్తమ్మ, రాధాకృష్ణా రెడ్డి, సోదరి కుమార్తై బిందురెడ్డి, సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు వైసీపీ నాయకుల ఆగడాల ను అడ్డుకుంటూ ఓటర్లకు అండగా తాము ఉన్నామంటూ భరోసా ఇస్తున్నారు.

- వెంకటాచలం

నాడు నిఖార్సుగా ఉండేవారు... !



మా రోజుల్లో నాయకులు నిఖార్సుగా ఉండేవారు. ఉన్న పార్టీనే నమ్ముకుని కష్టసుఖాలైనా అందులోనే ఉండేవారు. నేటి కాలంలో రాజకీయ నాయకులు ఏ పార్టీ నుంచి ఏ పార్టీకి ఎప్పుడు ఎలా మారుతారో తెలియని పరిస్థితి. ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ నేతలు పార్టీలు మారుతుంటే వారిని నమ్ముకున్నవారు అయోమయంలో ఉంటున్నారు. నాయకుడు అనేవాడు నీతి, నిజాయితీకి నిలబడాలి. సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలి.

- గోలి సాంబయ్య, సంగం



పైసలిస్తేనే..

ప్రచారానికంట !

పోటీ చేస్తే ఉన్న ఆస్తులు కరిగి పోయేవి. ఇపుడు అధికారం అడ్డపెట్టుకుని కోట్లు సంపాదిస్తున్నారు.

వెంకయ్య : దీనికి పెచారానికి సంబంధం ఏమిటిరా అంతుపట్టడంలేదు

సుబ్బయ్య : అదేరా నీకు తెలిసింది. మన ఎమ్మెల్యే దొరికన కాడికి దోచుకుని కోట్లకోట్లు సంపాదించాడంట.. తెలుసా నీకు ?

వెంకయ్య : అది అందరికీ తెలిసిందే కదా.. ఇప్పుడు కొత్తగా చెప్పేదేంది.

సుబ్బయ్య : వాళ్ల దోపిడీలో ఎంతోకంత మనకిస్తే కదా ..? పెచారానికి వెళ్లేది..! అని నాయకులు బెట్టు చేస్తున్నారట.

వెంకయ్య : ఒరేయ్ సుబ్బయ్యా... ఈ సారి మనూరి నాయకుడు పెచారానికి రాలేదేంట్రా..

సుబ్బయ్య : ఈ ఎన్నికల్లో పైసలివ్వందే నాయకులు పెచారానికి రావట్లేదంటరా...

వెంకయ్య : అదేందీ.. నాయకులు ఓటర్లకు డబ్బులిస్తారని విన్నాం... కానీ నాయకులే పెచారానికి డబ్బులు అడగడం ఏందీ ? ఎప్పుడూ చూడలేదే..

సుబ్బయ్య : కాలం మారిందిరా.. గతంలో నాయకులు ఎన్నికలలో



వెంకయ్య : ఎగస్‌పార్టీ వాళ్ల పెచారానికి వెళ్లే వారి సంగతేమిట్రా ?

సుబ్బయ్య ? వాళ్లుకూడా డబ్బున్నోళ్లే పోటీకి వస్తున్నారు. అక్కడ కూడా పెచారానికి వెళ్లాలంటే పైసలడుగుతున్నారు.

సుబ్బయ్య: ఆ పార్టీ వారు ఈ పార్టీలోకి ఈ పార్టీవారు ఆపార్టీలోకి వెళ్ల కండువాలు మార్చుకుంటున్నారు ఎందుకు ?

వెంకయ్య: పెచారానికి డబ్బులివ్వనపుడు ఇలా ఎవరు డబ్బులిస్తే వాళ్ల పార్టీలోకి మారుతున్నారు.

సుబ్బయ: భలే ఉందే... ఓటర్ల కన్నా నాయకులకే ఎక్కువగా ఎన్నికల పండుగ కనిపిస్తోంది.

వెంకయ్య : పెచారానికి వెళ్లే నాయకులకు ఎంతెంత ఇస్తున్నారు

సుబ్బయ్య : వారి వారి స్థోమతను బట్టి అంతా లచ్చల్లోనే...!

- కావలి

మైనార్టీలనూ

కార్పొరేషన్‌కు పైసా ఇవ్వని జగన్ ప్రభుత్వం

మభ్యపెట్టావు కదన్నా..!?

- క్రైస్తవులకు స్వయం ఉపాధి కల్పన శూన్యం
- నావాళ్లు అన్నావ్.. నువ్వు చేసిన న్యాయమిదేనా ?

నెల్లూరు (వీఆర్సీ) మే 8 : రాష్ట్రంలో కుల కార్పొరేషన్‌లన్నీ కునారిల్లిపోయాయి. 2019 నుంచి వీటికి ఎలాంటి నిధులు మంజూరుకాక నీరసించి పోయాయి. స్వయంఉపాధి లేక ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ యువత అల్లాడిపోతున్నారు. డిగ్రీలు చేతబట్టి ఉద్యోగాలు లేక తల్లిదండ్రులకు భారంగా యువతీయువకులు ఉంటున్నారు. ఇకపోతే స్వయం ఉపాధి పొందుదామంటే ప్రభుత్వం ఎలాంటి పథకాలు అమలు చేయలేదు. పైగా నవరత్నాలు పేరుతో అన్ని రంగాల ప్రజలను ఈ ప్రభుత్వం మోసం చేసింది. అటు ఉద్యోగాలు లేక, ఇటు స్వయం ఉపాధి కరువై మైనార్టీ యువత దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. క్రిస్టియన్‌గా చెప్పుకునే జగన్‌మోహన్‌రెడ్డి ఆ వర్గాలకు ఏమైనా చేశారా ? అంటే అదీ శూన్యమే. అంతేకాక నెల్లూరులోని మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయం నేటికీ అద్దె భవనంలోనే నడుస్తోంది.

● గత టీడీపీ ప్రభుత్వం 2014 నుంచి 2019వరకు పలు సంక్షేమ పథకాలను కుల కార్పొరేషన్‌ల ద్వారా నిరుద్యోగులకు అందజేసింది. తద్వారా ఎంతోమంది యువత ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, టెంట్ హౌస్, కిరాణా, రెడీమేడ్ వస్త్ర దుకాణం.. తదితర యూనిట్లకు సబ్సిడీ రుణాలు తీసుకుని వాటి ద్వారా ఉపాధి పొందుతున్నారు. కానీ వైసీపీ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలతో పాటు మైనార్టీ నిరుద్యోగులు కూడా కోటి ఆశలు పెట్టుకున్నారు. ఈ ఐదేళ్లలో వారి ఆశలు ఆవిరయ్యాయి. ఒక్కరంటే ఒక్కరికి కూడా ఎలాంటి లబ్ధిచేకూరలేదు.

● టీడీపీ హయాంలో 4,374 మందికి ముస్లింలకు, 355 మంది క్రిస్టియన్ యువతకు స్వయం ఉపాధి రుణాలు అందించారు. ఒక్కొక్కరికి లక్ష రూపాయల సబ్సిడీగా కూడా అందచేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు మాత్రమే అందించింది. వీటి ద్వారా నిరుద్యోగులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు.





అద్దె భవనంలో నడుస్తున్న జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్

గతంలో ఇచ్చిన ముస్లి మైనార్టీలకు ఇచ్చిన రుణాల వివరాలు

సంవత్సరం	ముస్లింలు	రుణాలు (రూ.లక్షల్లో)	క్రిస్టియన్లు	రుణాలు(రూ.లక్షల్లో)
2014- 15	398	196.45	67	43.00
2015- 16	1420	422.02	146	102.25
2016-17	938	387.05	44	38.50
2017-18	1642	939.13	39	37.00
2018-19	914	549.65	59	57.00
మొత్తం	4,374	2,494	355	277.75

కోవూరు సర్వేపల్లి

అసంపూర్తిగా సర్వేపల్లి రిజర్వాయర్ పనులు

● నాసిరకంగా నిర్మాణం ● రెండో పంటకు సాగునీరు కరువు ● దిక్కుతోచని స్థితిలో రైతులు



కట్ట తెగిపోకుండా ఏర్పాటు చేసిన మట్టి బస్తాలు



వైసీపీ నేతల మట్టి దోపిడీతో ఏర్పడిన భారీ గుంతలు

వెంకటాచలం, మే 8: జిల్లాలోని ప్రధాన జలాశయాల్లో ఒకటైన సర్వేపల్లి రిజర్వాయర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గడువు పూర్తయినా నేటికి 50 శాతం పనులు కూడా జరగలేదు. గతంలో రిజర్వాయర్ కింద ఉన్న పంట పొలాల్లో రెండుసార్లు పంటలు వేసుకునేవారు. గత రెండు దశాబ్దాలుగా ఎన్నడూలేని విధంగా వైసీపీ పాలనలో రెండో పంటకు సాగునీరు లేకుండా చేశారు. రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు కట్ట బలహీనతల పేరుతో జాప్యం చేస్తుండటమే కారణం. అయితే కట్ట పనులు పూర్తికాకపోవడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటి సామర్థ్యం లేదు. 50 శాతంలోపు కట్ట ఆధునికీకరణ పనులు జరిగినా అవి అత్యంత నాసిరకంగానే జరిగాయి. దీంతో మొన్నటి మిచౌంగ్ తుఫాన్ కారణంగా కట్ట చాలా వరకు కోతకు గురైంది. దీంతో కట్ట తెగిపోకుండా మట్టి బస్తాలు పెట్టారు. భారీ వర్షాలు కురిస్తే మట్టి బస్తాలు కరిగిపోయి కట్ట తెగిపోయే ప్రమాదం ఉంది. కట్ట బలహీనంగా ఉండడంతోపాటు రిజర్వాయర్‌లో పూడిక పేరుకుపోయింది. నాచు సగానికిపైగా అల్లుకుపోవడంతో నీటి సామర్థ్యం తగ్గిపోయింది. పూడికతీత, నాచు తొలగించకుండా వదిలేశారు.

రిజర్వాయర్ పేరుతో వైసీపీ నేతల మట్టి దోపిడీ

సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునీకరణ పనులకు సంబంధించి గత టీడీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రూ.4 కోట్లు మంజూరు చేయించారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రద్దు చేశారు. నాలుగేళ్ల కిందట మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రిజర్వాయర్ కట్టను పరిశీలించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రిజర్వాయర్ దుస్థితిని వివరించారు. దీంతో రూ.11.10 కోట్లు మంజూరు చేయగా, 2021 జూన్ 17న శంకుస్థాపన చేశారు. 2022 కల్లా పనులు పూర్తి కావాల్సి ఉండగా పూర్తికాలేదు. దీంతో రైతులకు సాగునీరు లేకుండా చేశారు. మంత్రి కాకాణి అండదండలతో వైసీపీ నాయకులు రిజర్వాయర్ పరిధిలోని అనికేపల్లి, గొలగమూడి, తిక్కవరప్పాడు, జోసఫ్‌పేట గ్రామాలలో ప్రతి రోజూ మట్టి అమ్ముకొని కోట్ల రుపాయలు దోచుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలన ముగిసినా రిజర్వాయర్ పనులు మాత్రం 50 శాతం కూడా పూర్తికాలేదు. ఇంకెంత కాలానికి పనులు పూర్తి చేస్తారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

నాది ప్రజాబలం.. కాకాణిది ధన బలం : సోమిరెడ్డి



తోటపల్లిగూడూరు : సోమిరెడ్డిని సత్కరిస్తున్న మత్స్యకార నాయకులు

తోటపల్లిగూడూరు, మే 8: సర్వేపల్లి నియోజక వర్గంలో ప్రజాబలానికి ధన బలానికి మధ్య పోటీ జరుగుతోందని టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోడూరు మత్స్యకార గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నేను ప్రజల కోసం బతుకుతుంటే, కాకాణి మాత్రం నియోజక వర్గంలో దోచుకుని ధనం కోసం బతుకుతున్నారని, ఇలాంటి నాయకుడు మనకు అవసరమా అని ప్రజలకు సూచించారు. టీడీపీ హయాం లోనే మత్స్యకార గ్రామాలకు రోడ్లు వేసి బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరబోయిన గంగాధర్, ఆవుల మునిరత్నం, పామంజి దొరబాబు, రామాంజనేయులు, దండు వాసు, తదితరులు పాల్గొన్నారు.

వందల కోట్లు దోచుకుంటే నోటీసులతో సరిపెడతారా..?

పొదలకూరు: మండలంలో ఒక్కో మైన్‌లో మంత్రి కాకాణి, అనుచరులు వందల కోట్లు దోచుకుంటే మైనింగ్ అధికారులు షోకాజ్ నోటీసులు మాత్రమే జారీచేశారని, ఏ ఒక్కరినీ అరెస్టు చేయలేదని అసలు సూత్రదారి మంత్రి కాకాణి అని సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం మండలంలోని మరుపూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే మరుపూరులోని ప్రభుత్వ భూములను గిరిజనులకు పంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, కలిచేటి శ్రీనివాసులురెడ్డి, బత్తల శేషారెడ్డి, హరేంద్రరెడ్డి, అమరేంద్ర, తలచీరు మస్తాన్‌బాబు, ఆదాల సుగుణమ్మ పాల్గొన్నారు.

● **వెంకటాచలం:** సోమిరెడ్డిని గెలిపించాలని కోరుతూ కుమార్తె సింధురెడ్డి అనికేపల్లి గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో పథకాలు, సోమిరెడ్డి హయంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, నాయకులు చల్లా రవీంద్ర, గొట్టం బ్రహ్మయ్య, రాజన్న సైన్యం సభ్యులు తదితరులున్నారు.

● **తోటపల్లిగూడూరు:** సోమిరెడ్డిని గెలిపించాలని కోరుతూ కోడలు శృతిరెడ్డి వరిగొండలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్వేపల్లి ప్రజలు సోమిరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడూరు శ్రీనివాసులురెడ్డి, కర్పూరం శ్రీనివాసరెడ్డి, జానా రమణయ్య, కిషోర్, జనసేన నాయకులు సందీప్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మలపూడి ఎంపీటీసీ టీడీపీలో చేరిక

మనుబోలు: కొమ్మలపూడి ఎంపీటీసీ సభ్యురాలు గుండాల శిరీషాతో పాటు పలు కుటుంబాలు బుధవారం గ్రామ టీడీపీ నాయకులు మన్నెమాల భాస్కర్‌రెడ్డి, మన్నెమాల శ్రీనువాసులురెడ్డి, వద్దినేని మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో నెల్లూరులో సోమిరెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలాగే ఎంపీపీ గుండాల వజ్రమ్మ కోడలు గుండాల కల్పన టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, నెల్లూరులోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఈనెల 9 నుంచి జూన్ 10లోపు iti.ap.gov.in వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయించిన ప్రత్యేక సంఖ్యను గుర్తుపెట్టుకోవాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్న తరువాత అభ్యర్థి తాను చేరదలచుకున్న ఐటీఐ ఏ జిల్లాలో ఉందో ఆ జిల్లాను ఎంపిక చేసుకుని దరఖాస్తు పూర్తి చేయాలన్నారు. అనంతరం వారికి సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 10 నుంచి జూన్ 10వతేదీ వరకు సర్టిఫికెట్లను ధ్రువీకరించుకోవాలన్నారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ తేదీలను మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా తెలియచేస్తామన్నారు.

బుచ్చిలో పింక్ పోలింగ్ స్టేషన్ ప్రారంభం



పెద్దూరులో పింక్ పోలింగ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్

బుచ్చిరెడ్డిపాళెం, మే 8: బుచ్చిరెడ్డిపాళెం నగరపంచాయతీ పెద్దూరులో పింక్ పోలింగ్ స్టేషన్‌ను అసిస్టెంట్ కలెక్టర్ వి సంజనాసిన్హా, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ నగర కమిషనర్ రమణబాబు ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం జేసీ మాట్లాడుతూ కేవలం 17వ పోలింగ్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని మహిళా ఓటర్ల కోసం పింక్ పోలింగ్‌స్టేషన్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జిల్లాలోనే రెండో పోలింగ్ స్టేషన్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, స్వీపింగ్ నోడల్ అధికారి పీవీ రత్నం, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 65 మంది గైర్హాజరు

వెంకటాచలం, మే 8: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో బుధవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 65 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల్లో 688 మంది విద్యార్థులకుగాను 645 మంది హాజరు కాగా మిగిలిన 43 గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 363 మంది విద్యార్థులకుగాను 341 మంది హాజరు కాగా మిగిలిన 22 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

నాలుగో రోజు 124 ఓట్లు పోల్

వెంకటాచలం, మే 8: సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి వెంకటాచలంలోని క్యాబా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 124 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ రూపంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలిరోజు 387, రెండవ రోజు 608, మూడవ రోజు 260, నాలుగో రోజు 124 కలిపి ఇప్పటికి 1379 ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

గ్రామాల్లో టీడీపీ, బీజేపీ నేతల ముమ్మర ప్రచారం

వెంకటాచలం, మే 8 : మండలంలోని గ్రామాల్లో బుధవారం సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో ఆపార్టీ నేతలు, కార్యకర్తలు అట్రంవారికండ్రిగ గ్రామంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.

పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టీడీపీ నేతల సమీక్ష



టీడీపీ నేతలతో చర్చిస్తున్న బీద రవిచంద్ర

వెంకటాచలం, మే 8: నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసంలో ఆయన కుమారుడు సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమాలు, పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు.

కౌంటింగ్ సెంటర్లలో అవసరమైన చర్యలు తీసుకోండి

● లెక్కింపు కేంద్రాల పరిశీలనలో కలెక్టర్



ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథపురం), మే 8 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్లను, స్ట్రాంగ్ రూములను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల అనంతరం ఈవీఎంలు భద్రపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ పాల్గొన్నారు.

● **నేడు కూడా పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం**

ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది గురువారం కూడా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే సౌకర్యాన్ని ఈసీ కల్పించిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. ఇంకా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అగ్నివీర్' నోటిఫికేషన్ విడుదల

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 8: భారత దేశ సైన్యంలో నియామకాలకు సంబంధించిన అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదలైందని జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి.. అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 17 నుంచి 21 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ పోస్టులకు కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ట్రేడ్స్ మెన్ పోస్టులకు 8వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు ఫారంలో మొబైల్ నెంబరు నమోదు చేయాలని, పూర్తి చిరునామా, స్కాన్ చేసిన పాస్ పోర్ట్ సైజు ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా నకిలీ పోస్టింగ్ ఆర్డర్

● విజయవాడ కేంద్రంగా నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ల రాకెట్

ఏలూరు క్రైం, మే 8 : జిల్లా రెవెన్యూ అధికారి పోస్టింగ్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకుని వచ్చిన ఓ యువకునితోపాటు అతడిని ఉద్యోగంలో చేర్పించడానికి వచ్చిన మరో వ్యక్తిపై ఏలూరు జిల్లా ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి చీటింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. నెల్లూరులోని కొండాయపాలెంకు చెందిన చెందిన నాటకరాణి వెంకట్ ఈనెల 6వ తేదీన ఏలూరు కలెక్టరేట్‌కు వచ్చి అక్కడ ఉన్న కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు వద్దకు వెళ్లాడు. తాను జిల్లా రెవెన్యూ అధికారిగా జాయిన్ కావడానికి వచ్చానని పోస్టింగ్ ఆర్డర్ చూపించాడు. సంబంధిత సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. బుధవారం వెంకట్‌తోపాటు గుంటూరు జిల్లా గుంటూరులోని రామాబిల్డింగ్ సెంటర్‌కు చెందిన పందిటి నాగార్జున అనే వ్యక్తిని తీసుకుని బుధవారం మధ్యాహ్నం కలెక్టర్ ఆఫీస్‌కు వచ్చారు. తాను పంచాయతీరాజ్ కమిషనర్‌ను అంటూ ఐడీ కార్డును పందిటి నాగార్జున కలెక్టరేట్‌లో ఉన్న ఏవోకు పంపించాడు. ఆ కార్డు చూసి అవాక్కయిన ఏవో నకిలీ అని గుర్తించి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. ఆ పేరు మీద ఎవరు ఏ పోటీ పరీక్షల్లో సెలెక్ట్ కాలేదని ధ్రువీకరించుకున్న తరువాత అది నకిలీ అపాయింట్‌మెంట్ అని గుర్తించి బుధవారం రాత్రి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఏఏవో విశ్వేశ్వరరావు ఫిర్యాదు చేశారు. త్రీ టౌన్ సీఐ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు రామారావు, ప్రసాద్ విచారణ చేపట్టారు. వెంకట్, నాగార్జునలను అదుపులోకి తీసుకుని వారిద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకట్‌తో పాటు అనేక మంది బాధితులు ఉన్నట్టుగా ప్రాథమికంగా గుర్తించారు. విజయవాడ కేంద్రంగా ఒక ముఠా లక్షలాది రూపాయలు తీసుకుని నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తున్నట్లుగా ప్రాథమికంగా గుర్తించారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

నారాయణ గెలుపు ఆవశ్యకతను వివరించండి

● టీడీపీ శ్రేణులకు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పతనమే మన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఈ వారం రోజులు కష్టపడి పనిచేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. బాలాజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలు, బూత్ కన్వీనర్లు, ఇన్‌చార్జిలతో కోటంరెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ కోసం పని చేసిన వారికి రాజకీయ ప్రాధాన్యత, గుర్తింపు ఉంటుందన్నారు. ఐదేళ్లపాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రౌడీలను దీటుగా ఎదుర్కొన్న కార్యకర్తలు అందరినీ అక్కున చేర్చుకుంటామని భరోసా ఇచ్చారు. నగర నియోజకవర్గంలో నారాయణ గెలుపు ఆవశ్యకతను గడపగడపకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేపీ చౌదరి, అంచూరి శ్రీనివాసులు నాయుడు, ఆకుల హనుమంతు పాల్గొన్నారు.

దువ్వూరులో తల్లీకొడుకు మృతి

● ఆలస్యంగా వెలుగులోకి..

సంగం, మే 8: మండలంలోని దువ్వూరులో తల్లీకొడుకులు రమణమ్మ (80), శ్రీనివాసులురెడ్డి (61)లు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల మేరకు.. వృద్ధురాలికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహలై ఇతర ప్రాంతాల్లో వారి భర్తలతో ఉంటున్నారు. కుమారుడికి వివాహం కాకపోవడంతో వారిద్దరే ఉంటున్నారు. కుమారుడికి మద్యం అలవాటు ఉంది. ఈ క్రమంలో బుధవారం వారి ఇంటి పక్కనే ఉన్న ఓ మహిళ దేవుని ప్రసాదం పెట్టేందుకు వారి ఇంటి వద్దకు వెళ్లింది. పిలిస్తే పలకలేదు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుంది. దీంతో ఆమె చుట్టుపక్కల వారికి తెలపడంతో స్థానికులు వెళ్లి పరిశీలించారు. ఇద్దరు చనిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. తెలిసిన వారితో రమణమ్మ కుమార్తెలకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా వండుకున్న అన్నం కూర దబరలోనే ఉంది. శ్రీనివాసులురెడ్డి మృతదేహం మంచం మీద, రమణమ్మ మృతదేహం కింద పడి ఉంది. వడ దెబ్బకు గురై మృతి చెంది ఉంటారని కుమార్తెలు భావించి మృతదేహాలకు దహన సంస్కారాలు చేశారు. ఈ విషయంలో పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

నెల్లూరు(క్రైం) : ఏడేళ్ల చిన్నారిపై గుర్తుతెలియని దుండగుడు లైంగిన దాడికి యత్నించిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరులోని కోటమిట్ట షాదీమంజిల్ సమీపంలో ఓ కుటుంబం నివసిస్తోంది. అందులోని ఏడేళ్ల పాపపై రెండు రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తి లైంగిక దాడికి యత్నించగా బాలిక అతని నుంచి తప్పించుకొని ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పడంతో వారు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి బాధిత తల్లిదండ్రులను విచారించారు. ఘటనా స్థలంలోని సీసీఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు.

హతురాలు మృతదేహానికి పోస్టుమార్టం

సంగం, మే 8: జండాదిబ్బలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురైన వృద్ధురాలు సుబ్బమ్మ మృతదేహానికి బుధవారం సంగం పోలీసులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమర్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

హత్యకు గురైన వృద్ధురాలి కేసులో ఇద్దరు అనుమానితులను బుధవారం సంగం పోలీసులు అదుపులోకి తీసుకుని గోప్యంగా విచారిస్తున్నారు. వారి ఇద్దరు గ్రామానికి చెందిన వారే కావడం గమనార్హం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6801
వెండి కిలో ధర	రూ. 83,700
వెండి ఒక గ్రాము	రూ. 85.70

గంగమ్మకు ఘనంగా నెలపొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ పరమేశ్వరి

మనుబోలు, మే 8: స్థానిక పెద్దచెరువు వద్దనున్న గంగమ్మ పరమేశ్వరికి బుధవారం మనుబోలు యాదవసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నెలపొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి క్షీర, పంచామృతాభిషేకాలు, కుంకుమపూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు ఉభయదాతలుగా చల్లా శ్రీధర్, ప్రసన్న దంపతులు వ్యవహరించారు. భక్తులు పొంగళ్ళు సమర్పించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

అవినీతి నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలి

నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి దంపతుల పిలుపు ● జాతరను తలపించిన రోడ్‌షో



బుచ్చిరెడ్డిపాళెం: చెన్నూరురోడ్డులో వేమిరెడ్డి దంపతుల రోడ్‌షోలో పాల్గొన్న జనం



బుచ్చిరెడ్డిపాళెం: రోడ్డు షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న వేమిరెడ్డి దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 8: అవినీతి నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఎన్డీఏ కూటమి టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో బుధవారం బుచ్చి, చెన్నూరు రోడ్డులో వేమిరెడ్డి దంపతుల రోడ్‌షో జాతరను తలపించింది. బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభలో వారు మాట్లాడుతూ పంచాయతీలలో ఎక్కడికి వెళ్ళినా సమస్యలపై ప్రజలు ఏకరువు పెడతున్నారన్నారు. కోవూరు నియోజకవర్గాన్ని ప్రత్యేకించి బుచ్చిని అవినీతిమయం చేసి ప్రజల కనీస సమస్యలు తీర్చలేని నాయకులు ఏముఖం పెట్టుకుని వచ్చి ఓట్లు అడుగుతారన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా నన్ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రశాంతిరెడ్డి అభ్యర్థించారు.

గెలిపించండి... అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తాం

త్వరలో జరగనున్న ఎన్నికల్లో గెలిపించండి జిల్లాతోపాటు కోవూరు నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఎలా వుంటుందో చూపిస్తామని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని టీడీపీ నాయకులు, ఎంపీ శేషయ్య, బత్తల హరికృష్ణ ఆధ్వర్యంలో సాల్మానుపురం, వడ్డిపాళెంలో కొండారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాగేంద్ర, సర్పంచు రజనీకాంత్, రాజేష్, వెంకటేశ్వర్లు, మురళి, బుచ్చి నగర పంచాయతీలోని 10, 14,15,17వార్డుల్లో ఆవార్డుల ఇన్‌ఛార్జులు బాల కుమార్, బాలకృష్ణ, కొండయ్య, హరనాద్, కిషోర్, తాళ్ళ నరసింహ స్వామి, కౌన్సిలర్ వైష్ణవి బీజేపీ నాయకులు శ్రీనివాసులు, మోహన్, జనసేన నాయకులు మాదవ్, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేము రాజకీయాల్లో వచ్చింది ప్రజలకు సేవ చేసుకునేందుకేనన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి గ్రామంలో ప్రతి సమస్యనూ తీర్చి నియోజకవర్గాన్ని ఒక రోల్ మాడల్‌గా తీర్చిదిద్ది మీకు బహుమానంగా ఇస్తానన్నారు. ఇఫ్కో భూములను పారిశ్రామికవాడగా చేసి ప్రధానంగా కోవూరు నియోజకవర్గం నిరుద్యోగ యువతకు, జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను తప్పకుండా కల్పిస్తామని మాటిచ్చారు. ప్రచారంలో 20 వార్డుల ఇన్‌ఛార్జులు, గోవర్ధన్‌రెడ్డి, ఎస్ శ్రీనివాసులురెడ్డి, బి మురళి, సుబ్రమణ్యంనాయుడు, గుత్తా శ్రీనివాసులు, నందయ్య, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోవూరులో జోరుగా ప్రచారం

కోవూరు : వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు మండల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. స్థానిక దళితకాలనీలో టీడీపీ నాయకులు బాల కృష్ణారెడ్డి, హరిరెడ్డి, పచ్చిపాల విజయసాయిరెడ్డి నాయకత్వంలో ప్రచారం చేశారు. మోడేగుంట, చెర్లోపాళెం గ్రామాల్లోని గమళ్ల పాళేల్లో గౌడసంఘం నాయకులు దాసరి విజయకుమార్, దాసరి మురళీమోహన్, అన్నం వెంకటేశ్వర్లు, తదితరులు ఇంటింటికీ తిరిగి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి వేమిరెడ్డి దంపతుల్ని గెలిపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్ధించారు.

విడవలూరు : మండల పరిధిలోని పార్లపల్లి, విడవలూరు, దండిగుంట గ్రామాల్లో బుధవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు వేగూరు చంద్రారెడ్డి, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, గిరిష్ కరపత్రాలను అందజేశారు. విడవలూరులో గ్రామ ఉపసర్పంచు పదిళ్ల సుబ్రహ్మణ్యం, నాయకుడు బండ్ల బాబాయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి బ్యాలెట్ నమూనాపై ఓటర్లకి అవగాహన కల్పించారు. దండిగుంట గ్రామంలో కుడుములు మల్లికార్జున ఎన్నికల ప్రచారం నిర్వహించి వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు.



కోవూరు : కొత్తూరు దళిత కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు



విడవలూరు : ఎన్నికల ప్రచారం చేస్తున్న ఉప సర్పంచు పదిళ్ల సుబ్రహ్మణ్యం తదితరులు

కూటమి వైపే ఉద్యోగులు

- ప్రజలు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు రావాలి
- టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్



నెల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ఉద్యోగులు కూటమివైపు నిలబడ్డారని, వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జెడ్ శివప్రసాద్ అన్నారు. బుధవారం నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులు విజ్ఞతతో వ్యవహరించారన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో మెజారిటీ ఓట్లు ఎన్డీఏ కూటమికి దక్కుతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్‌ను, బిడ్డల భవిష్యత్‌ను ఆలోచించుకొని ఈ నెల 13న ఓటు వేసేందుకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. 95 శాతానికిపైగా పోలింగ్ నమోదయ్యేలా అందరూ కృషి చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని విమర్శించారు. ల్యాండ్, శాండ్, మైనింగ్, మద్యం మాఫియాలు రాజ్యమేలుతున్నాయని, వీటన్నింటికీ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. నిధులు, విధులు లేని కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన వైసీపీ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను దగా చేసిందని దుయ్యబట్టారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తున్న ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని శివప్రసాద్ ప్రజలను అభ్యర్థించారు.

చంద్రబాబుతోనే ఏపీ అభివృద్ధి

- రోడ్ షోలో అభ్యర్థులు వీపీఆర్, శ్రీధర్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న వీపీఆర్, శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 8 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్నింటా అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు ఒక్కడే సరైన నాయకుడని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 2వ డివిజన్ పెద్దచెరుకూరు, సిరిగార్డెన్స్ ప్రాంతాల్లో వారు రోడ్ షో నిర్వహించారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో రాష్ట్రానికి ఆయన అవసరం ఎంతో ఉందన్నారు. సంపద సృష్టించి ఆపై సంక్షేమం, అభివృద్ధి కొనసాగించాలన్నారు. సంపద లేకుండా ఇవి రెండూ ఎక్కువ కాలం కొనసాగించలేమని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ద్వారా ఉద్యోగులంతా టీడీపీకి మద్దతిచ్చారంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి 36వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 30,31 డివిజన్లకు చెందిన వైసీపీ నాయకులు పార్థసారథి, శ్రీనివాసులును కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం 17వ డివిజన్ వడ్డిపాళెం, గుండ్లపాళెం ప్రాంతాల్లో ఎన్నిక ప్రచారాలు, ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు కుడుముల నాగేశ్వరరావు గౌడ్ (కేఎన్ఆర్), ఉప్పల ఈశ్వరయ్య, మనుబోలు శేషారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చెన్నారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, బండి శ్రీకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారానికి తరలివచ్చిన అభిమాన గణం

నేను రూరల్ ప్రజల ప్రతినిధిని.. వారి గెలుపును వారే లిఖించుకుంటారు!

- అన్నా.. అని పిలిస్తే పరుగెత్తుకు వెళ్లేవాడిని...
- అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
- నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : 'ఇవి నెల్లూరు రూరల్ ప్రజల ఆత్మాభిమానానికి.. వైసీపీ నిరంకుశ వైఖరికి మధ్య జరుగుతున్న ఎన్నికలు. నేను రూరల్ నియోజకవర్గ ప్రజల ప్రతినిధిని మాత్రమే. వారి గెలుపును వారే లిఖించుకుంటారు.' అని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. హ్యాట్రిక్ విజయం కోసం బరిలో దిగిన ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో తన విజయావకాశాలను పంచుకున్నారు.

? మీ గెలుపునకు దోహదపడే అంశాలు

! చిన్న కరెక్షన్. ఈ ఎన్నికలు నా వ్యక్తిగతమైనవి మాత్రమే కావు. నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించకపోగా, కక్ష పూరితంగా వ్యవహరించిన వైసీపీ ప్రభుత్వానికి, నెల్లూరు రూరల్ ప్రజల ఆత్మాభిమానానికి మధ్య జరుగుతున్న ఎన్నికలివి. నేను నా నియోజకవర్గ ప్రజల ప్రతినిధిగా ఈ ఎన్నికల్లో నిలబడ్డాను అంతే. వారిని వారే గెలిపించుకుంటారు.

? మీ గెలుపును ప్రభావితం చేసే అంశాలు

! చంద్రబాబు. ఆయన పరిపాలన తీరు. ఆయన పట్ల ప్రజలకు ఉన్న నమ్మకం. రూరల్ నియోజకవర్గ ప్రజలందరూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావాలని కోరుకొంటున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే నేను ప్రభుత్వాన్ని నిలదీశాను. రూరల్ నియోజకవర్గంపై ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించాను. స్పందించకపోగా నాపై ఆ పార్టీ పెద్దలు కక్ష కట్టారు. అయినా నా ప్రజలకు జరగాల్సిన మేళ్ల విషయంలో రాజీపడలే. జిల్లాస్థాయి సమావేశాల్లో ఇదేమి అన్యాయమని ప్రశ్నించా. సమాధానం చెప్పకపోగా గొంతు విప్పిన నేరానికి నాపై రకరకాల తప్పుడు కేసులు పెట్టారు. వాటి కోసం కోర్టుల చుట్టూ తిరిగా. రూ.లక్షలు ఖర్చు పెట్టుకున్నా. నా ప్రజల కోసమే నేను వైసీపీ నుంచి బయటకు వచ్చా. నా గెలుపు నా వ్యక్తిగతం కాదు. రూరల్ నియోజకవర్గ ప్రజల గెలుపు. ఆ విషయాన్ని ప్రజలు గుర్తించారు. వారి గెలుపును వారే లిఖించుకుంటారు.

? మీకే ఎందుకు ఓటు వేస్తారనుకొంటున్నారు

! అవతలి వ్యక్తి ఏనాడైనా జనంలోకి వచ్చారా. నియోజకవర్గంలో ఎవరి సమస్యలనైనా పట్టించుకున్నారా. నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఇన్నేళ్లలో ఏ రోజైనా ఇంట్లో ఉన్నానా. ఎప్పుడూ ప్రజల మధ్య గడిపాను. ఎమ్మెల్యే అయినా సాతిధారణ మనిషిగా ప్రజలతో కలుసున్నాను. శ్రీధరన్నా.. అని పిలుపు వినపడితే చాలు నిమిషాల్లో అక్కడ వాలిపోతాను. ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలబడతాను. ఎమ్మెల్యే పదవిని ఒక బాధ్యతగా నిర్వర్తిస్తున్నాను. మరి నిత్యం ప్రజల మధ్య ఉండే నాకు కాక ఇంకెవరికి ఓటేస్తారు. కష్ట సుఖాల్లో ఎవరైతే వారి పక్కన నిలబడతారో వారికే ఓటు వేస్తారు.

? నియోజకవర్గ ప్రజలకు మీరిచ్చే హామీలు

! నాకు చెప్పింది చేయడమే తెలుసు. కూటమి అధికారంలోకి రావడం ఖాయం. చంద్రబాబు ముఖ్యమంత్రి అవడం ఖాయం. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గెలవడం ఖాయం. నన్ను ఎమ్మెల్యేగా ప్రజలు దీవించడం ఖాయం. ఇవన్నీ జరిగిన తరువాత చంద్రబాబు ఆశీస్సులతో, ఎంపీ ఇతర ముఖ్యనాయకుల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా. ఆమంచర్ల బ్రిడ్జి నిర్మాణం, పొటేపాళెం కలుజు నిర్మాణం, బీసీ భవన్, అంబేడ్కర్ స్టడీసర్కిల్ నిర్మాణాలు చేపడతాం. బారాషాహీద్ దర్గాలో పెండింగ్ పనులు పూర్తి చేస్తా. కొమ్మరపూడి, దొంతాలి, దేవరపాళెంలో ఆగిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చేస్తా. అర్ధంతరంగా ఆగిపోయిన గురుకుల పాఠశాల నిర్మాణం పూర్తి చేస్తా. క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్, షాదీమంజిళ్ల నిర్మాణాలు, గణేష్ ఘాట్ అభివృద్ధి చేపడతా. అన్నింటికన్నా ముఖ్యంగా నా నియోజకవర్గ ప్రజలకు తోడుంటా.

? ప్రజలకు మీరు చేసుకునే విన్నపం

! ప్రజలందరికి ఒకటే విజ్ఞప్తి చేసుకొంటున్నా. ఈ రోజు జరుగుతున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించినవి. ఈ వైసీపీ ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో అందరికి తెలుసు. మన ఊర్లో ఇసుక మనం ఎత్తుకోలేం. మన ఊర్లో మట్టి మనం తోలుకోలేం. నిత్యావసర వస్తువులు అసలు కొనలేం. సంక్షేమం పేరుతో పది రూపాయలు ఇచ్చి రూ.వంద సహజ వనరులను దోచుకొంటున్నారు. ఈ ప్రభుత్వం పోవాలి. ప్రజలకు మంచి రోజులు రావాలి. రూరల్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యేగా మరో ఐదేళ్లపాటు అందుబాటులో ఉంటూ సేవ చేసుకునే భాగ్యం నాకు కల్పించాలి.

ఘాట్ ఘోష!

- అధ్వానంగా స్వర్ణాల చెరువు తీరం
- టీడీపీ హయాంలో సుందరంగా ఘాట్ నిర్మాణం
- నేడు టైల్స్ ధ్వంసం... పేరుకున్న చెత్త
- పర్యాటకులకు ఆహ్లాదం కరువు



అధ్వానంగా ఉన్న స్వర్ణాల చెరువు ఘాట్

నెల్లూరు (సాంస్కృతికం), మే 8 : వ్యాపారపరంగా ఆక్వా సాగు, ఆధ్యాత్మికపరంగా రొట్టెల పండుగ నెల్లూరుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చాయి. మత సామరస్యానికి ప్రతీకగా ఏటా ఐదు రోజులు నగరంలోని బారా షహీద్ దర్గా ప్రాంగణంలో స్వర్ణాల చెరువు తీరాన రొట్టెల పండుగ భారీ ఎత్తున జరుగుతుంది. దేశవిదేశాల నుంచి లక్షలాది మంది యాత్రికులు తరలివచ్చి చెరువులో కోర్కెల రొట్టెలు పట్టుకుంటారు. మిగిలిన రోజుల్లోనూ ఈ ప్రాంతానికి సందర్శకులు వస్తుంటారు. పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందాల్సిన ఈ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యం వల్ల అధ్వానంగా, అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది.

ఏటా జరిగే రొట్టెల పండుగకు వచ్చే భక్తులు 2016వ సంవత్సరానికి ముందు వరకు స్వర్ణాల చెరువులో బురద, మురికి నీటిలోనే రొట్టెలు మార్చుకునేవారు. నాడు రాష్ట్ర మున్సిపల్ మంత్రిగా ఉన్న పొంగూరు నారాయణ స్వర్ణాల చెరువును అభివృద్ధి చేయాలని సంకల్పించా రు. రొట్టెల పండుగకు రాష్ట్ర పండుగగా గుర్తింపు తీసుకువచ్చారు. స్వర్ణాల చెరువు తీరాన దాదాపు 190మీటర్ల పొడవున ఘాట్ నిర్మించారు. ఆ ప్రాంతమంతా పచ్చదనం పెంచారు. చిల్డ్రన్స్‌పార్కు ఏర్పాటు చేశారు. చెట్ల కింద భక్తులు సేదతీరేందుకు అరుగులు కట్టించారు. ఘాట్ పర్యవేక్షణ బాధ్యతను నగర పాలక సంస్థకు అప్పగించారు. రాత్రిపూట అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసేందుకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. దీంతో స్వర్ణాల ఘాట్ నెల్లూరు నగరానికే వన్నె తెచ్చింది. ఉదయం, సాయంత్రం నగర ప్రజలు విహారం కోసం తండోపతండాలుగా తరలివచ్చేవారు.

ప్రభుత్వం మారాక పతనం

రాష్ట్రంలో 2019 ఎన్నికల అనంతరం వైసీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో స్వర్ణాల ఘాట్ నిర్లక్ష్యానికి గురైంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అంతకుముందు చేసిన పనులు దెబ్బతిన్నాయి. రొట్టెల పండుగకు రెండు వారాల ముందు రూ.లక్షలు వెచ్చించి తాత్కాలిక మరమ్మతులు చేయించడం, పండుగ అయిపోయిన తర్వాత వదిలివేయడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం ఘాట్ పూర్తిగా ధ్వంసమైంది. మెట్లపై ఏర్పాటు చేసిన టైల్స్ ఊడిపోయాయి. చెత్త భారీగా పేరుకుపోయింది. పచ్చదనం కోసం నాటిన మొక్కలు నీరులేక ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. చిల్డ్రన్స్ పార్కులోని వస్తువులు దెబ్బతిన డంతో ఆ పార్కు ఎందుకు పనికిరాకుండా పోయింది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలతో చెత్తకుండీగా మారింది.



ఘాట్‌లో ధ్వంసమైన మెట్లు, ఊడిపోయిన టైల్స్



పాచి, మురుగుతో నీరు



ఘాట్‌లో పేరుకున్న వ్యర్థాలు, సంరక్షణలేక ఎండిన మొక్కలు

జగన్ పాలనలో తీవ్ర ఇబ్బందులు

- డాక్టర్ పొంగూరు సింధూర

నెల్లూరు (విద్య), మే 8 : జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు గడిచిన ఐదేళ్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర తెలిపారు. నగరంలోని 7వ డివిజన్‌లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నారా చంద్రబాబునాయుడు ఎంతో శ్రమించి రాష్ట్రానికి పరిశ్రమలు, ప్రాజెక్టులు తీసుకువస్తే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగన్ వాటన్నింటినీ నిర్వీర్యం చేశారన్నారు. ఆంధ్ర రాష్ట్రంలోని వైసీపీ అసమర్థ పాలనలో తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాల్లో తెలుగు ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రానికి స్వర్ణయుగం రావాలంటే చంద్రబాబు పాలన రావాలన్న ప్రజల ఆకాంక్ష త్వరలోనే నెరవేరబోతోందన్నారు. ఆయన పాలనలో కొత్త పరిశ్రమలతోపాటు స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు కాబోతున్నాయని చెప్పారు. ప్రజలంతా కూటమికి అండగా ఉండి ఈనెల 13న జరిగే ఎన్నికల్లో నగర ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఆకాశాన్నంటిన నిత్యావసర సరుకుల ధరలు...

వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలన్నీ సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎదిగిపోయాయని నారాయణ కుమార్తె పొంగూరు శరణి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని 11వ డివిజన్‌లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో సామాన్యులు జీవనం సాగించే పరిస్థితులు లేవని, వైసీపీ ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. అన్ని విభాగాల్లోనూ వైఫల్యం చెందిన వైసీపీ తిరిగి ఎన్నికల్లో గెలిచేందుకు అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే తమ సమస్యలన్నీ తీరిపోతాయన్న నమ్మకం ప్రజల్లో వచ్చిందన్నారు. అందరి ఆశలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు.



ఓటు అభ్యర్థిస్తున్న నారాయణ కుమార్తె శరణి



నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనసేన నాయకులు

నారాయణ సార్ విజయమే లక్ష్యం...

నగర ఎమ్మెల్యేగా డాక్టర్ పొంగూరు నారాయణ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని జనసేన పార్టీ నాయకులు తెలిపారు. నగరంలోని గోమతినగర్ నారాయణ క్యాంపు కార్యాలయంలో బుధవారం జనసేన నాయకుడు నూనె మల్లికార్జునయాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నేతలు, కార్యకర్తలం తా శ్రమించి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. నారాయణ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమిలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని, అందరూ కష్టపడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

పీజీ ఫలితాల్లో 'కృష్ణచైతన్య' ప్రతిభ

నెల్లూరు (విద్య), మే 8 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విడుదల చేసిన పీజీ ఆర్గానిక్ కెమిస్ట్రీ రెండవ సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని కృష్ణచైతన్య పీజీ కళాశాల విద్యార్థులు విశ్వవిద్యాలయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచారని కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, పీ రాణా ప్రమోద్‌రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తమ విద్యార్థులు కే జ్ఞానదీపిక 90 శాతం, వీ శ్రావణి 87శాతం మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాలను సొంతం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రెడ్‌క్రాస్ అన్నదానం

నెల్లూరు (వైద్యం) మే 8 : ప్రపంచ రెడ్‌క్రాస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు, సహాయకులకు బుధవారం అన్నదానం చేశారు. రెడ్‌క్రాస్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, జనార్దన్‌రాజు మాట్లాడుతూ నగరంలోని ఐదు కేంద్రాల్లో చలివేంద్రాలు, రెడ్‌క్రాస్ మెడికల్ షాపు వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు.

ఘనంగా ఠాగూర్ జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మే 8 : నెల్లూరు వర్ధమాన సమాజంలో బుధవారం రాత్రి విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలు జరిగాయి. ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేజర్ల వినయ రవీంద్రునిపై ఆలపించిన గీతం శ్రోతల ప్రశంసలు అందుకుంది. రచయిత డాక్టరు చంద్రకళ బొమ్మల గూటిలో ఠాగూర్ అనే శీర్షికన రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యంలో బాల్యం అనే అంశాలపై ఉపన్యసించారు. కార్యక్రమంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయురాలు డాక్టర్ లక్ష్మీసుహాసినీ, బాలభవన్ డైరెక్టర్ జీ సుభద్రాదేవి, వర్ధమాన సమాజం అధ్యక్షుడు పొన్నాల రామసుబ్బారెడ్డి, కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట). మే 8: జనసేన పార్టీలో నెల్లూరు రూరల్ నాయకుడు కుడుముల సురేష్ ఆధ్వర్యంలో బుధవారం పలువురు యువకులు చేరారు. నగరంలోని సుబేదార్‌పేటలో ఉన్న పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ సమక్షంలో వారు కండువా కప్పుకున్నారు. ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి పనిచేయాలని కిషోర్ పిలుపునిచ్చారు.

కూటమిదే విజయం : కేతంరెడ్డి

నెల్లూరు (విద్య), మే 8 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులదే విజయమని తెలుగుదేశం పార్టీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 42వ డివిజన్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగరంలో ఏప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి విశేష స్పందన లభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలంతా వీపీఆర్‌ను, నారాయణను గెలిపించుకునేందుకు సిద్ధమని చెప్పారు. నెల్లూరు అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలవాలంటే వీపీఆర్, నారాయణతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా మాక్ పోలింగ్ ఈవీఎంతో ఓటింగ్ ఎలా వేయాలో, ఏ స్థానంలో తమ అభ్యర్థులున్నారో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఓటింగ్ చేయించారు.

తిరుపతిలో పోటాపోటీగా

తిరుపతిలో వైసీపీ, జనసేన పార్టీల నేతలు సోమవారం నుంచే నగదు పంపిణీ చేపట్టారు. సోమవారం ఉదయం నుంచే బూత్ స్థాయిలో ఓటర్లకు నగదు పంచడం మొదలైంది. ఓటుకు రూ. 2వేల చొప్పున ముట్టజెపుతుండగా కొన్ని చోట్ల స్థానిక నేతలు చేతివాటం చూపి రూ. వెయ్యి, రూ. 1500 చొప్పున మాత్రమే అందజేసినట్టు సమాచారం. ఓటరు స్లిప్పులు చూసి నంబర్లు నమోదు చేసుకుని మరీ నగదు పంపిణీ చేస్తున్నట్టు సమాచారం. అధికార పార్టీ నేతలు మాత్రం ఓటుకు రూ. 3 వేల వంతున ఓటరు స్లిప్పులతో నిమిత్తం లేకుండా పంపకాలు చేస్తుండడంతో జనమే విస్తుపోతున్నారు. ఏ స్థాయిలో అక్రమార్జన వుంటే ఈ స్థాయిలో నగదు పంపకాలు జరుగుతాయని చర్చించుకుంటున్నారు.

ఓటుకు నోటు!

గతానికి భిన్నంగా ముందే మొదలైన ప్రలోభాల పర్వం

ఈసారి సార్వత్రిక ఎన్నికలకు ప్రధాన పార్టీల తరపున ప్రలోభాల పర్వం ముందే మొదలైపోయింది. పోలింగ్ ముందు రోజు రాత్రి చేపట్టే పంపకాలు వారం రోజుల ముందే మొదలు కావడం గమనార్హం. పోలింగ్ తేదీ సమీపించే కొద్దీ పోలీసులతో పాటు ప్రత్యర్థుల నిఘా పెరుగుతుందని భావించి వీలైనంత ముందుగా ఓటర్లకు నగదు చేర్చేందుకు నేతలు ముందస్తు పంపకాలకు సిద్ధపడిపోతున్నారు. వెంకటగిరి, తిరుపతి నియోజకవర్గాల్లో సోమవారం నుంచే నగదు పంపిణీ ప్రారంభం కాగా చంద్రగిరి, గూడూరు, సత్యవేడుల్లో వైసీపీ వర్గీయులు మంగళవారం పంపిణీకి శ్రీకారం చుట్టగా శ్రీకాళహస్తిలో బుధవారం నుంచీ నగదు, చీరల పంపకాలు మొదలయ్యాయి. చంద్రగిరిలో రెండు విడతల పంపిణీకి చెవిరెడ్డి వర్గీయులు వ్యూహం పన్నినట్టు సమాచారం. సూళ్ళూరుపేటలో విద్యుత్ సరఫరా ఆపేసి మరీ చీకట్లో నగదు పంపిణీ చేశారు. పుత్తూరులో నగదు కంటే ముందుగా అధికార పార్టీ నేతలు మద్యం పంపిణీకి శ్రీకారం చుట్టేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



శ్రీకాళహస్తిలో వైసీపీ నగదు, చీరల పంపిణీ

శ్రీకాళహస్తిలో వైసీపీ వర్గీయులు బుధవారం నుంచీ ఓటుకు రూ. 2 వేలు నగదుతో పాటు చీరలు పంపిణీ చేయడం ప్రారంభించారు. అయితే చీరలు మరీ నాసిరకంగా వున్నాయని మహిళలు వాపోవడం కనిపించింది. కాగా ఓటర్లకు పంపిణీ చేసేందుకు వైసీపీ నేతలు భారీగా చీరలు తెప్పించారని సమాచారం. వాటిని పలుచోట్ల నిల్వ వుంచారని, ఆ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక ప్రభుత్వాస్పత్రి చేరువలోని ఓ గోదాము నుంచీ చీరలను ఆటోలో తరలిస్తుండగా టీడీపీ వర్గీయులు పట్టుకుని పోలీసులకు పట్టించారు. కాగా టీడీపీ వర్గీయులు సైతం బుధవారం నుంచీ ఓటుకు రూ. 2 వేల వంతున పంపిణీ మొదలు పెట్టారు.

సత్యవేడులో స్వతంత్ర అభ్యర్థి హల్‌చల్

సత్యవేడు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో వున్న రమేష్ బాబు వర్గీయులు హల్‌చల్ చేస్తున్నారు. ప్రధాన పార్టీలకు మించి హడావిడి చేస్తున్నారు. ఎక్కడికి ప్రచారం వెళ్ళినా వెంట 500 మందికి తగ్గకుండా చూసుకుంటున్నారని, ప్రచారానికి వచ్చే ప్రతి ఒక్కరికీ రోజుకు రూ. 500 చొప్పున చెల్లిస్తున్నారని సమాచారం. దానికి తోడు అభ్యర్థి పది మంది బౌన్సర్లను వెంటపెట్టుకోవడంతో నియోజకవర్గంలో హడావిడి పెరిగిందని చెబుతున్నారు. ఈ అభ్యర్థి అనుచరులు పంపకాలకు కూడా సిద్ధపడ్డారని, ఓటుకు రూ. 2 వేలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని సమాచారం.

చంద్రగిరిలో రెండు విడతలకు వైసీపీ వ్యూహం

చంద్రగిరి నియోజకవర్గంలో మంగళవారం వైసీపీ వర్గీయులు నగదు పంపిణీ ప్రారంభించారు. చంద్రగిరి పట్టణంలో పంపిణీ ప్రారంభించిన వైసీపీ వర్గీయులు ఓటుకు రూ. 2 వేల వంతున అందజేస్తున్నారు. పార్టీలు, వర్గాలతో నిమిత్తం లేకుండా అందరికీ పంచుతున్నట్టు సమాచారం. రెండు విడతల్లో నగదు పంపిణీ చేయాలనే వ్యూహం సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. గత ఎన్నికల్లో తొలి విడత ఓటుకు రూ. వెయ్యి అందజేసి చివరలో మరో విడత ఇంటికి రూ. 1500 చొప్పున పంపిణీ చేశారు. ఇపుడు కూడా అదే వ్యూహంతో తొలి విడత రూ. 2 వేల చొప్పున పంపిణీ చేస్తున్నారని, టీడీపీ వర్గీయుల పంపకాలను బట్టి మలి విడత అదనపు నగదు పంపిణీకి ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు సమాచారం. కాగా టీడీపీ వర్గీయులు బుధవారం నుంచీ రూ.2 వేల చొప్పున పంపిణీ చేస్తున్నారు.

గూడూరులో రూ.వెయ్యి చొప్పున

గూడూరు పట్టణంలో రూ. 1500 చొప్పున పంచిన వైసీపీ నేతలు గ్రామాల్లో రూ. వెయ్యి చొప్పున పంపిణీ చేస్తున్నారు. చిట్టమూరులో సోమవారం రాత్రి నుంచీ, గూడూరు పట్టణంలో మంగళవారం రాత్రి నుంచీ, మిగిలిన మండలాల్లో బుధవారం నుంచీ పంపకాలు మొదలయ్యాయి. టీడీపీ నేతలు బుధవారం మధ్యాహ్నం నుంచీ నియోజకవర్గవ్యాప్తంగా ఓటుకు రూ. వెయ్యి చొప్పున పంపిణీ ప్రారంభించారు.

పుత్తూరులో ఇంటింటికీ మద్యం

నగరి నియోజకవర్గంలో భాగమైన పుత్తూరు, వడమాలపేట మండలాల్లో ప్రధాన పార్టీల నేతలు ఇంకా నగదు పంపకాలు మొదలు పెట్టలేదు. అయితే అధికార పార్టీ వర్గీయులు మాత్రం ఆదివారం నుంచే ఇంటింటికీ మద్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు సమాచారం. బూత్ స్థాయిలో రోజుకు ఒక కేస్ మద్యం బాక్స్ అంటే 48 క్వార్టర్ బాటిళ్లు చేరవేస్తుండగా బాటిళ్ళను ప్రతి ఇంటికీ రోజు మార్చి రోజు అందజేస్తున్నట్టు చెబుతున్నారు. పోలింగ్ రోజు వరకూ రోజూ మద్యం పంపిణీ చేయాలని ముఖ్యనేత ఆదేశించినప్పటికీ కిందిస్థాయి నేతలు చేతివాటం చూపి రోజు మార్చి రోజు అందజేస్తున్నట్టు సమాచారం. అయితే టీడీపీ వైపు నుంచీ ఇంకా నగదు గానీ, మద్యం గానీ పంపిణీ మొదలు కాలేదు.

సూళ్ళూరుపేటలో విద్యుత్ ఆపేసి నగదు పంపిణీ

సూళ్ళూరుపేటలో వైసీపీ వర్గీయులు నగదు పంపిణీ మొదలు పెట్టారు. మంగళవారం రాత్రి నుంచీ ఓటుకు రూ. వెయ్యి చొప్పున అందజేస్తున్నారు. నాయుడుపేట పట్టణంలో నగదు పంపిణీ ప్రారంభించిన ఆ పార్టీ నేతలు మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరా ఆపివేయించి మరీ చీకటిలో నగదు అందజేసినట్టు చెబుతున్నారు.టీడీపీ వైపు కూడా నిధులు చేరుతున్నాయని, అయితే ఓటరుకు రూ. 500 చొప్పున ఇవ్వాలా లేక రూ. వెయ్యి చొప్పున ఇవ్వాలా అన్నది నిర్ణయించుకోలేదని సమాచారం.

వెంకటగిరిలో టీడీపీ ముందంజ

వెంకటగిరిలో నగదు పంపకాల్లో టీడీపీ ముందంజ వేసింది. వైసీపీ వర్గీయులు ఓటుకు రూ. 3 వేల చొప్పున పంపిణీ చేస్తారని మూడు రోజులుగా ప్రచారం జరుగుతుండగానే టీడీపీ వర్గీయులు ఓటుకు రూ. 2 వేల వంతున నియోజకవర్గంలో ఇప్పటికే 70 శాతం మందికి చేరవేసినట్టు తెలిసింది. హైదరాబాదు నుంచీ ఓ పారిశ్రామికవేత్త మనుషులు, చెన్నై, గుంటూరు నుంచీ ముఖ్యనేత సన్నిహితులు స్థానిక పార్టీ నేతల సమక్షంలో నగదు పంపిణీ చేస్తున్నారు. మద్యం పంపిణీ చేయనప్పటికీ మండలాలకు చేరిపోయినట్టు సమాచారం. వైసీపీ వర్గీయులు మాత్రం ఓటుకు రూ. 2500 వంతున ఇవ్వాలని ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు తెలిసింది.నగదు పంపిణీ కోసం వాకాడులో ఆ పార్టీ ముఖ్యనేతకు చెందిన విద్యా సంస్థ నుంచీ ఉద్యోగులు రంగప్రవేశం చేశారు. మద్యం కూడా మండలాలకు తరలించి పంపిణీకి సిద్ధం చేశారని సమాచారం.



శ్రీకాళహస్తిలోని గోదాములో చీరల మూటలను పరిశీలిస్తున్న సీఐ రారాజు

శ్రీకాళహస్తిలో 3250 చీరల సీజ్

- ముగ్గురు వైసీపీ నేతలపై కేసు

శ్రీకాళహస్తి, మే 8:శ్రీకాళహస్తిలో వైసీపీ నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు సిద్ధం చేసిన 3250 చీరలను అధికారులు సీజ్ చేశారు. ఆటో డ్రైవరుతో పాటు ముగ్గురు వైసీపీ నాయకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ రారాజు కథనం మేరకు... శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని చెంచులక్ష్మి కాలనీ రోడ్డులో వున్న ఓ గోదాంలో కొందరు చీరలను భారీగా నిల్వ చేసి ఆటోలో తరలించేందుకు సిద్ధమయ్యారు.స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రారాజు సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆటోతో సహా రాజీవ్ నగర్ కాలనీ చెందిన ఉదయ్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం అధికారులకు సమాచారం అందించారు. 13 పార్సిల్ మూటల్లో 3250 చీరలున్నట్టు నిర్ధారించారు.వైసీపీ ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి సన్నిహితులైన సలీం, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు బుల్లెట్ జయశ్యాం, మాజీ సభ్యుడు మున్నా తనను చీరలు తరలించమని చెప్పినట్లుగా ఆటో డ్రైవర్ వాంగ్మూలం ఇచ్చాడు. ఆ ప్రకారం ముగ్గురు వైసీపీ నేతలపై కేసు నమోదు చేసినట్లు సీఐ రారాజు తెలిపారు.

రేణిగుంటలో వైసీపీ చీరల పంపిణీ



రేణిగుంటలో పంచుతున్న చీరలు

రేణిగుంట, మే 8:రేణిగుంటలో వలంటీర్ల సహకారంతో బుధవారం డబ్బు, చీరలను వైసీపీ నాయకులు పంపిణీ చేశారు.రాత్రి వేళల్లో వీధిదీపాలను ఆఫ్ చేయించి మరీ డబ్బులు పంపిణీ చేస్తున్నారు. జీఎం వీధిలో వైసీపీకి చెందిన మహిళలు చీరలు పంపిణీ చేస్తుండగా ఫ్లయింగ్‌స్క్వాడ్ సిబ్బంది పట్టుకునేందుకు ప్రయత్నించగా చీరలు పడేసి పరారయ్యారు.దీంతో ఒక బ్యాగులో ఉన్న చీరలను స్వాధీనం చేసుకున్నారు.

60 వేల ఓటరు స్లిప్పులు వెనక్కొచ్చాయ్!

తిరుపతిలోని 3లక్షలమంది ఓటర్లలో 80 శాతానికే పంపిణీ

మిగిలినవి ఫేక్ ఓటర్లవేనా ?

తిరుపతి, మే 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3.02 లక్షల మంది ఓటర్లు వుండగా అందులో బుధవారం నాటికి కేవలం 2.40 లక్షల మందికి మాత్రమే ఓటరు స్లిప్పులు అందాయి.మిగిలిన 20 శాతం అంటే 60 వేలమందికి పంపిణీ కావాల్సిన స్లిప్పులు కార్యాయాలకు వెనక్కు వచ్చాయి. అంటే అందులో అధిక శాతం బోగస్ ఓట్లుగా భావించాల్సి వస్తోంది.ఈనెల 1వ తేదీ నుంచీ జిల్లావ్యాప్తంగా ఓటర్లకు అధికార యంత్రాంగం స్లిప్పులను పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. స్లిప్పుల పంపిణీకి బుధవారం చివరి రోజు. అయితే తిరుపతి నియోజకవర్గంలో 3,02,503మంది ఓటర్లకు గానూ బుధవారం సాయంత్రానికి 2,41,133 మందికి మాత్రమే స్లిప్పులు చేరాయి. అంటే 79.71 శాతం మందికే ఓటరు స్లిప్పులు అందాయి. మిగిలిన 61,370 మందికి స్లిప్పులు చేరలేదు. ఇళ్ళకు తాళాలు వేసుకుని బయట ప్రాంతానికి వెళ్ళిన వారు, ఇతర ప్రాంతాలకు నివాసం మార్చిన వారు, డబుల్ ఎంట్రీలు, మృతులు, బోగస్ ఓటర్లు వంటి కారణాలతోనే ఇంతమందికి స్లిప్పులు అందకుండా పోయే అవకాశముంది. అయితే ప్రాక్టికల్‌గా చూస్తే వేసవి సెలవుల్లో స్వస్థలాలకు, బంధువుల ఊళ్ళకు, టూర్లకు వెళ్ళే కుటుంబాలు అత్యల్పంగానే వుంటాయి. శాశ్వతంగా నివాసం మార్చిన వారు కూడా తక్కువే. ఓటర్ల జాబితా నుంచీ తొలగని మృతుల పేర్లు సైతం స్వల్పంగానే వుంటాయి. డబుల్ ఎంట్రీలు, దొంగ ఓటర్లే అధికంగా వుండే అవకాశముంది. ఓటర్ల జాబితా సవరణలు చేపట్టినప్పటి నుంచీ ప్రతిపక్షాలు తిరుపతిలో భారీగా దొంగ ఓట్లు చేర్చారని ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. కిందిస్థాయి అధికారుల నుంచీ ఎన్నికల కమిషన్ దాకా అసంఖ్యాకంగా ఫిర్యాదులు చేశారు. ఈ ఆరోపణలు, ఫిర్యాదులూ నిజమేనని ఇపుడు 61 వేల స్లిప్పులు మిగిలిపోవడాన్ని బట్టి అనుమానించాల్సి వస్తోంది.జిల్లాలో మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో 90శాతానికి పైగా ఓటర్లకు స్లిప్పులు అందాయి.కేవలం తిరుపతిలోనే 20 శాతానికి మించి ఓటర్లకు స్లిప్పులకు చేరకుండా అధికారుల వద్దే మిగిలిపోయాయి. వీటిని ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్ కేటగిరీల్లో విభజించి బీఎల్‌వోలు తహసిల్దారుకు, ఆయన కలెక్టర్‌కు జాబితా అందజేయాల్సి వుంది.నిజమైన ఓటర్లు నివాసం మార్చడం లేదా తాత్కాలికంగా ఎటైనా వెళ్ళి వుంటే అలాంటి వారికి పోలింగ్ కేంద్రాల వద్దే పోలింగ్ రోజు స్లిప్పులు అందుబాటులో వుంచుతామని అధికారులు చెబుతున్నారు. అదెలా వున్నా భారీ సంఖ్యలో బోగస్ ఓటర్లు వెలుగు చూసే అవకాశమున్నందున అధికారుల తదుపరి చర్యలు ఎలా వుంటాయో వేచి చూడాల్సి వుంది.

పాలిసెట్‌లో 88 శాతం ఉత్తీర్ణత



కె.సాహిత్, 25వ ర్యాంకు కదిరిమంగళం, వడమాలపేట మండలం



కె.వెంకటసత్యం, 153వ ర్యాంకు తాళ్వాయిపాడు, పెళ్లకూరు మండలం



జి.జ్ఞానేష్, 172వ ర్యాంకు నాయుడుపేట

తిరుపతి(విద్య), మే 8: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం గతనెల 27వ తేదీన నిర్వహించిన ఏపీ పాలిసెట్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో మన జిల్లా విద్యార్థులు 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. 4,436 మంది పరీక్ష రాయగా.. 3,909మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.తిరుపతిలోని విశ్వం స్కూల్లో శిక్షణ తీసుకున్న కె.సాహిత్ 120 మార్కులకుగాను 118 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 25వ ర్యాంకు సాధించి, జిల్లా స్థాయిలో ఒకటో స్థానంలో నిలిచారు. పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన కె.వెంకటసత్యం 115 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 153వ ర్యాంకు, జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచాడు. నాయుడుపేటకు చెందిన జి.జ్ఞానేష్ 114 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 172వ ర్యాంకు, జిల్లా స్థాయిలో మూడో స్థానం పొందారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు రేపటివరకు తత్కాల్ గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), మే 8: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని ఇంటర్ విద్యామండలి శుక్రవారం వరకు పొడిగించింది. ఈ మేరకు మండలి తిరుపతి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెలలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలకు తత్కాల్ విధానంలో దరఖాస్తు చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగియగా, రెండ్రోజులు పొడిగించినట్లు వెల్లడించారు.

కొత్త ఓటర్ల సంఖ్య 41,993

తిరుపతి(కలెక్టరేట్), మే 8: జిల్లాలో ఈదఫా ఎన్నికల్లో 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లు 41,993 మంది తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 18,12,980 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 8,83,330, మహిళా ఓటర్ల సంఖ్య 9,29,466గా ఉంది. ఇతర ఓటర్లు (ట్రాన్స్‌జెండర్స్)184మంది, సర్వీసు 862, ఎన్ఆర్ఐ 291, దివ్యాంగులు 24,596, 85ఏళ్లు దాటిన ఓటర్లు 7,924మంది ఉన్నారు. పెరిగిన ఓటర్లలో 90శాతంపైగా తొలిసారి ఓటు హక్కు పొందిన యువ ఓటర్లే కావడం గమనార్హం. చంద్రగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 3,15,159మంది ఓటర్లు ఉండగా.. సత్యవేడులో అత్యల్పంగా 2,15,385మంది ఓటర్లు ఉన్నారు.


నేడు కూడా పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

తిరుపతి (కలెక్టరేట్), మే 8: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, అత్యవసర సేవల్లో ఉన్న వారు మొత్తం ఈ నాలుగు రోజుల్లో 17,525మంది ఆయా నియోజకవర్గాల్లోని ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మన జిల్లాలో పని చేస్తున్న ఇతర జిల్లాల ఉద్యోగులు 4350మంది కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు.85ఏళ్లు పైబడిన వృద్ధులు, పోలింగ్‌కేంద్రాలకురాలేని దివ్యాంగులు 1,077 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఇంకా పోస్టల్‌బ్యాలెట్‌కు రాని ఉద్యోగులకు గురువారం మధ్యాహ్నం వరకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

2018 జనవరి 30న వెంకటగిరి నియోజకవర్గం సైదాపురంలో జిల్లాలోకి ప్రవేశించిన జగన్.. సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల మీదుగా ప్రకాశం జిల్లాలోకి నడక సాగించారు. ఎందరితోనో మాట్లాడారు. అధికారంలోకి రాగానే అన్నీ మార్చేస్తానంటూ హామీలెన్నో ఇచ్చారు. తలలు నిమిరి, నుదుట ముద్దులు పెట్టి, బుగ్గలు గిల్లి ఆయన చెప్పిన మాటలు నమ్మిన ప్రజలు ఒక్క ఛాన్స్ ఇచ్చారు. అంతే ఆ తర్వాత నడిచి వచ్చిన దారులనే జగన్ మరచిపోయారు. గాల్లో తప్ప నేలమీదకు దిగడం మానేశారు. మళ్లీ ఎన్నికలొచ్చాకే బస్సెక్కారు. మాట తప్పనూ, మడమ తిప్పనూ, చేసేదే చెబుతానూ.. అని వేదికలమీద దబాయించి అబద్ధాలు చెప్పే ఈ నాయకుడి పాలనలో అభివృద్ధి ఎలా ఉందో ఆయన నడిచిన దారులే సాక్ష్యం. పాదయాత్ర సమయంలో సవ్యంగా ఉన్న ఈ రోడ్లు ఇప్పుడు ఇలా ఉన్నాయి...

- ఆంధ్రజ్యోతి బృందం

పాదయాత్రే తనను నాయకుడిగా మలచిందని ఆయన చెబుతాడు. రాష్ట్రం దుస్థితి, ప్రజల కష్టాలు కళ్ల చూసిన తర్వాతనే వైసీపీ మేనిఫెస్టో రూపొందించానని అంటారు. నిజమేనా? నమ్మచ్చా? జగన్ మాటలకూ చేతలకూ నడుమ అగాధాలు ఉన్నాయనేందుకు సాక్ష్యమే ఈ కథనం..





సైదాపురం-పొదలకూరు రోడ్డు దుస్థితి

జగన్ నడిచిన దారులు
ఇప్పుడిలా ఉన్నాయ్!
వైసీపీ పాలనకు అద్దం పడుతూ దుస్థితిలో రోడ్లు

నియోజకవర్గం పేరు : నెల్లూరురూరల్

పాదయాత్ర తేదీలు : 2018, ఫిబ్రవరి 2,3,4

నడిచిన గ్రామాలు : సౌత్‌మోపూరు, ములుముడి, కొమ్మరపూడి, దేవరపాళెం

నడిచిన దూరం : 15 కి.మీ

జగన్ నడిచిన రోడ్ల దుస్థితి : నెల్లూరు - తాటిపర్తి రహదారిపై అప్పట్లో గుంతలు ఉండగా ఇప్పుడు గోతులుగా మారాయి.



జొన్నవాడ మలుపు రోడ్డు దుస్థితి

నియోజకవర్గం పేరు : ఆత్మకూరు

పాదయాత్ర తేదీలు : 2018, ఫిబ్రవరి 6, 7

నడిచిన గ్రామాలు : దువ్వూరు, సిద్దీపురం, వెంగారెడ్డి పాళెం, గాంధీ జనసంఘం, పల్లిపాళెం, సంగం

నడిచిన దూరం : 18 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్ల స్థితి : పల్లిపాళెం రహదారి ప్రస్తుతం 5 కిలోమీటర్ల దూరం గుంతలమయంగా మారి అధ్వానంగా ఉంది. రహదారిపై పంట కాలువల కల్వర్టులు కుంగిపోయాయి. రూ.20లక్షలతో అధికారులు ప్రతిపాదనలు పంపినా పైసా మంజూరు కాలేదు. అలాగే కలిగిరి రహదారి (సంగం నుంచి కొరిమెర్ల వరకు) అధ్వానంగా ఉంది.



సంగం : సీఎం జగన్ నడిచిన పల్లిపాళెం రహదారి

నియోజకవర్గం పేరు : వెంకటగిరి

పాదయాత్ర తేదీలు : 2018, జనవరి 30

నడిచిన గ్రామాలు : సైదాపురం, షామైన్ రోడ్డు, జోగివల్లి రోడ్డు, పొక్కుందల రోడ్డు, ఊటుకూరు, గ్రిద్దలూరు రోడ్డు, తురిమెర్ల, కలిచేడు, తుమ్మలతలుపూరు రోడ్డు, మలిచేడు రోడ్డు

నడిచిన దూరం : 18 కి.మీ

జగన్ నడిచిన రోడ్ల దుస్థితి : సైదాపురం-పొదలకూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతుండటంతో యజమానులు గగ్గోలు పెడుతున్నారు.



పొదలకూరు రోడ్డు దుస్థితి

నియోజకవర్గం : ఉదయగిరి

పాదయాత్ర తేదీలు : 2018, ఫిబ్రవరి 11, 12, 13, 14, 15

నడచిన గ్రామాలు: తూర్పు గుడ్లదొన, పడమరగుడ్లదొన, అనంతపురం, సిద్దనకొండూరు, పరికోట, కుమ్మర కొండూరు, పెద్దపాడు, వీరారెడ్డిపాలెం, పోలంపాడు, కలిగిరి, క్రిష్ణారెడ్డి పాలెం, కుడుములదిన్నెపాడు, మార్నేనివారిపాలెం, శెట్టిపాలెం, జంగాలపల్లి, ఆదిమూర్తిపురం, కొండాపురం, రేణమాల, నేకునాంపేట.

నడిచినదూరం: 60 కి.మీ

రోడ్ల దుస్థితి : ఈ ఐదేళ్లలో రోడ్ల నిర్మాణమే చేపట్టలేదు. అక్కడక్కడా ప్యాచ్ వర్క్‌లు చేశారు. తూర్పుగుడ్లదొన నుంచి పడమర గుడ్లదొన వరకు రోడ్డు మార్జిన్ దెబ్బతిని ఉంది. పడమరగుడ్ల దొన నుంచి ఉదయగిరి రోడ్డు హైవే వరకు రోడ్లన్నీ గతుకుల మయంగా ఉంది.. కలిగిరి నుంచి నేకునాంపేటవరకు చప్టాలు దెబ్బతిని ఉన్నా మరమ్మతులకు నోచుకోలేదు. అలాగే రోడ్డు మార్జిన్‌లు దెబ్బతిని ఉన్నాయి. శెట్టిపాలెం, ఆదిమూర్తిపురం, కొండాపురం ప్రాంతాలలో అక్కడక్కడ రోడ్లు కూడా దెబ్బతిని ఉన్నాయి.



కొండాపురం : ఆదిమూర్తిపురం వద్ద దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు



కందుకూరు-వెంకటాద్రిపాలెం మధ్య అధ్వానంగా రహదారి

నియోజకవర్గం : కందుకూరు

పాయాత్ర తేదీలు : 2018, ఫిబ్రవరి 16, 17, 18

నడిచిన గ్రామాలు : కొత్తపేట, పెంట్రాల, జంపాలవారిపాలెం, కిలారివారిపలాలెం, లింగసముద్రం, బలిజపాలెం, వెంగళాపురం, గాంధీనగర్, వలేటివారిపాలెం, పోలినేనిపాలెం, కూనెపాలెం, పోకూరు, అత్తంటివారిపాలెం, బడేవారిపాలెం, బొంతవారిపాలెం, కాకుటూరు, చెర్లొపాలెం, కందుకూరు, వెంకటాద్రిపాలెం, అనంతసాగరం.

నడిచిన దూరం : 41 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్ల స్థితి : కొత్తపేట నుంచి వలేటివారిపాలెం వరకు రహదారి పరిస్థిత మరీ అధ్వానంగా మారింది. వలేటివారిపాలెం నుంచి కందుకూరు వరకు ప్రజలు కూడా అధ్వానంగా ఉన్న రోడ్డుపై గత ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే కందుకూరు నుంచి అనంతసాగరం నుంచి కూడా పంచాయతీ రాజ్ రోడ్డు అడుగుకు ఒక గుంతతో అధ్వానంగా మారింది.

పరపతి పాయె...
ఓట్లెలా అడగాలి ?



వైసీపీ ప్రభుత్వ పాలనలో వందలాది మంది సర్పంచులు అప్పులు పాలయ్యారు. వేలాది రూపాయలు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసినా ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు అందలేదు. సర్పంచ్‌గా గెలిచి ఊరికి అభివృద్ధి పనులు చేస్తామని చెప్పి, చివరకు సొంత ఆస్తులు అమ్ముకుని చేతిలో పైసా లేకుండా పోయిందని వారు ప్రస్తుతం ఆందోళన చెందు తున్నారు. తాజాగా సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రజల్లోకి వెళ్లి ఎలా ఓట్లు అడగాలని వారు మదనపడు తున్నారు. అయితే పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థులు మాత్రం తమను ఎలాగైనా ఈసారి గెలిపించాలని కాళ్లు పట్టుకుంటున్నారు. 'సర్పంచిగా పోటీ చేయ్.. నీకు అండగా ఉంటాం' అని మూడేళ్ల కిందట చెప్పిన ఆ నాయకులు తీరా లక్షలు ఖర్చయ్యాక కనిపించకుండా పోయారు. వారు కదా చేసిన పనులకు బిల్లులు వస్తాయని డాంబికాలు పలికారు. కానీ పత్తా లేకుండా పోయారు. ఈ విషయాన్ని గమనించిన కొందరు సర్పంచులు అధికార పార్టీని కాదని చాపకింద నీరులా కూటమి అభ్యర్థులను బలపరుస్తున్నారు.

- ఉదయగిరి

ఓటర్ స్లిప్పుల పంపిణీలో వలంటీర్లు

కట్టుకథ.. గవరం !

లింగసముద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో బుధవారం ఓటరు స్లిప్పుల పంపిణీలో సచివాలయ సిబ్బంది వెంట వలంటీర్లు కూడా ఉండడం పట్ల ఆ గ్రామ టీడీపీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎన్నికల విధులతో వలంటీర్లకు ఎలాంటి సంబంధం లేదని ఈసీ ఉత్తర్వులు ఇచ్చినా కొందరిలో మార్పులేదన్నారు. వలంటీర్లు ఎందుకు వచ్చారంటూ, టీడీపీ కార్యకర్తలు వారి ఫొటోలు తీయబోగా వారు పారిపోయారని చెప్పారు. సంబంధిత అధికారులు వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

- లింగసముద్రం

ఓట్ల కోసం పడరాని పాట్లు



అధికార యోగ

కూటి కోసం కోటి విద్యలు అన్నట్లుగా.. నాయకులు కూడా ఓట్ల కోసం పడరాని పాట్లు, ఎప్పుడూ వేయని వేషాలు వేస్తున్నారు. ఎన్నడూలేని అనుబంధాలు, ఆప్యాయతలను కనబరుస్తున్నారు. నానా రకాల ఫీట్లు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే యత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో అన్ని పార్టీల నేతలు ఓటర్ల ఇళ్లకు క్యూ కడుతున్నారు. ఇంటింటికి తిరుగుతూ పలకరింపుల జోరు పెంచారు. అక్కా, బావా... అంటూ ఆప్యాయంగా పిలుస్తూ బంధుత్వాలు కలుపుతున్నారు. గ్రామాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఓటర్లను ఆత్మీయంగా పలకరిస్తూ ఈ ఎన్నికల్లో తమ నాయకుడికి ఓట్లు వేయాలని కోరు తున్నారు. అయితే ఎన్డీఏ కూటమి నాయకులు మాత్రం ఐదేళ్ల పాలనలో సర్వే పల్లి నియోజకవర్గంలో జరిగిన ప్రభుత్వ వైఫల్యాలు, దాడులు, అరాచకాలు, దౌర్జన్యాలు, మైనింగ్ దోపిడీ, భూకుంభ కోణాలు, అవినీతి, అక్రమాలను ఎత్తిచూపుతూ ప్రచారంలో దూసుకెళుతున్నారు. దీంతో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంది. దీనికి తోడు అభ్యర్థుల వారసులు సోమిరెడ్డి తరుపున ఆయన కుమారుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కోడలు సోమిరెడ్డి శృతిరెడ్డి, కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధురెడ్డి, అక్కా, బావ సంయుక్తమ్మ, రాధాకృష్ణా రెడ్డి, సోదరి కుమార్తె బిందురెడ్డి, సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు వైసీపీ నాయకుల ఆగడాల ను అడ్డుకుంటూ ఓటర్లకు అండగా తాము ఉన్నామంటూ భరోసా ఇస్తున్నారు.

- వెంకటాచలం

నాడు నిఖార్సుగా ఉండేవారు... !

నాటి రోజుల్లో...



మా రోజుల్లో నాయకులు నిఖార్సుగా ఉండేవారు. ఉన్న పార్టీనే నమ్ముకుని కష్టసుఖాలైనా అందులోనే ఉండేవారు. నేటి కాలంలో రాజకీయ నాయకులు ఏ పార్టీ నుంచి ఏ పార్టీకి ఎప్పుడు ఎలా మారుతారో తెలియని పరిస్థితి. ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ నేతలు పార్టీలు మారుతుంటే వారిని నమ్ముకున్నవారు అయోమయంలో ఉంటున్నారు. నాయకుడు అనేవాడు నీతి, నిజాయితీకి నిలబడాలి. సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలి.

- గోలి సాంబయ్య, సంగం



పైసలిస్తేనే..
ప్రచారానికంట !

సెటైర్ మందు



వెంకయ్య : ఒరేయ్ సుబ్బయ్యా... ఈ సారి మనూరి నాయకుడు పెచారానికి రాలేదేంట్రా..

సుబ్బయ్య : ఈ ఎన్నికల్లో పైసలివ్వందే నాయకులు పెచారానికి రావట్లేదంటరా...

వెంకయ్య : అదేందీ.. నాయకులు ఓటర్లకు డబ్బులిస్తారని విన్నాం... కానీ నాయకులే పెచారానికి డబ్బులు అడగడం ఏందీ? ఎప్పుడూ చూడలేదే..

సుబ్బయ్య : కాలం మారిందిరా.. గతంలో నాయకులు ఎన్నికలలో పోటీ చేస్తే ఉన్న ఆస్తులు కరిగి పోయేవి. ఇప్పుడు అధికారం అడ్డపెట్టుకుని కోట్లు సంపాదిస్తున్నారు.

వెంకయ్య : దీనికి పెచారానికి సంబంధం ఏమిటిరా అంతుపట్టడంలేదు

సుబ్బయ్య : అదేరా నీకు తెలిసింది. మన ఎమ్మెల్యే దొరికన కాడికి దోచుకుని కోట్లకోట్లు సంపాదించాడంట.. తెలుసా నీకు ?

వెంకయ్య : అది అందరికీ తెలిసిందే కదా.. ఇప్పుడు కొత్తగా చెప్పేదేంది.

సుబ్బయ్య : వాళ్ల దోపిడీలో ఎంతోకంత మనకిస్తే కదా ..? పెచారానికి వెళ్లేది..! అని నాయకులు బెట్టు చేస్తున్నారట.

వెంకయ్య : ఎగస్‌పార్టీ వాళ్ల పెచారానికి వెళ్లే వారి సంగతేమిట్రా ?

సుబ్బయ్య ? వాళ్లుకూడా డబ్బున్నోళ్లే పోటీకి వస్తున్నారు. అక్కడ కూడా పెచారానికి వెళ్లాలంటే పైసలడుగుతున్నారు.

సుబ్బయ్య: ఆ పార్టీ వారు ఈ పార్టీలోకి ఈ పార్టీవారు ఆపార్టీలోకి వెళ్ల కండువాలు మార్చుకుంటున్నారు ఎందుకు ?

వెంకయ్య: పెచారానికి డబ్బులివ్వనపుడు ఇలా ఎవరు డబ్బులిస్తే వాళ్ల పార్టీలోకి మారుతున్నారు.

సుబ్బయ : భలే ఉందే... ఓటర్ల కన్నా నాయకులకే ఎక్కువగా ఎన్నికల పండుగ కనిపిస్తోంది.

వెంకయ్య : పెచారానికి వెళ్లే నాయకులకు ఎంతెంత ఇస్తున్నారు

సుబ్బయ్య : వారి వారి స్థోమతను బట్టి అంతా లచ్చల్లోనే...!

- కావలి

మైనార్టీలనూ
కార్పొరేషన్‌కు పైసా ఇవ్వని జగన్ ప్రభుత్వం
మభ్యపెట్టావు కదన్నా..!?

- **క్రైస్తవులకు స్వయం ఉపాధి కల్పన శూన్యం**
- **నావాళ్లు అన్నావ్.. నువ్వు చేసిన న్యాయమిదేనా ?**



అద్దె భవనంలో నడుస్తున్న జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్



మోసం గురూ!

నెల్లూరు (వీఆర్పీ) మే 8 : రాష్ట్రంలో కుల కార్పొరేషన్లన్నీ కునారిల్లిపోయాయి. 2019 నుంచి వీటికి ఎలాంటి నిధులు మంజూరుకాక నీరసించి పోయాయి. స్వయంఉపాధి లేక ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ యువత అల్లాడిపోతున్నారు. డిగ్రీలు చేతబట్టి ఉద్యోగాలు లేక తల్లిదండ్రులకు భారంగా యువతీయువకులు ఉంటున్నారు. ఇకపోతే స్వయం ఉపాధి పొందుదామంటే ప్రభుత్వం ఎలాంటి పథకాలు అమలు చేయలేదు. పైగా నవరత్నాలు పేరుతో అన్ని రంగాల ప్రజలను ఈ ప్రభుత్వం మోసం చేసింది. అటు ఉద్యోగాలు లేక, ఇటు స్వయం ఉపాధి కరువై మైనార్టీ యువత దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. క్రిస్టియన్‌గా చెప్పుకునే జగన్‌మోహన్‌రెడ్డి ఆ వర్గాలకు ఏమైనా చేశారా ? అంటే అదీ శూన్యమే. అంతేకాక నెల్లూరులోని మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయం నేటికీ అద్దె భవనంలోనే నడుస్తోంది.

● గత టీడీపీ ప్రభుత్వం 2014 నుంచి 2019వరకు పలు సంక్షేమ పథకాలను కుల కార్పొరేషన్‌ల ద్వారా నిరుద్యోగులకు అందజేసింది. తద్వారా ఎంతోమంది యువత ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, టెంట్ హౌస్, కిరాణా, రెడీమేడ్ వస్త్ర దుకాణం.. తదితర యూనిట్లకు సబ్సిడీ రుణాలు తీసుకుని వాటి ద్వారా ఉపాధి పొందుతున్నారు. కానీ వైసీపీ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలతో పాటు మైనార్టీ నిరుద్యోగులు కూడా కోటి ఆశలు పెట్టుకున్నారు. ఈ ఐదేళ్లలో వారి ఆశలు ఆవిరయ్యాయి. ఒక్కరంటే ఒక్కరికి కూడా ఎలాంటి లబ్ధిచేకూరలేదు.

● టీడీపీ హయాంలో 4,374 మందికి ముస్లింలకు, 355 మంది క్రిస్టియన్ యువతకు స్వయం ఉపాధి రుణాలు అందించారు. ఒక్కొక్కరికి లక్ష రూపాయల సబ్సిడీగా కూడా అందచేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు మాత్రమే అందించింది. వీటి ద్వారా నిరుద్యోగులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు.

గతంలో ఇచ్చిన ముస్లి మైనార్టీలకు ఇచ్చిన రుణాల వివరాలు

సంవత్సరం	ముస్లింలు	రుణాలు (రూ.లక్షల్లో)	క్రిష్టియన్లు	రుణాలు(రూ.లక్షల్లో)
2014- 15	398	196.45	67	43.00
2015- 16	1420	422.02	146	102.25
2016-17	938	387.05	44	38.50
2017-18	1642	939.13	39	37.00
2018-19	914	549.65	59	57.00
మొత్తం	4,374	2,494	355	277.75

జన కేతనం

మీకు మళ్లీ ఓటెందుకెయ్యాలి?

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ప్రజా దర్బార్‌ల గురించి జనం కథలు కథలుగా చెప్పుకుంటారు. ఎవరు ఏ పనితో వచ్చినా పలకరించి కూర్చోబెట్టి వింటారు. అర్జీ తీసుకుని అనుచరులకు అప్పగిస్తారు. పనులపై వచ్చినవారు ఆయన రిసీవింగ్‌కి సంబరపడిపోతారు. అంతే.. ఆ తర్వాత అతీగతీ ఉండదు. ఆయన దర్బార్ దీనికే పరిమితం కాదు. మాట వినని, దారికి రాని వారి సంగతి తేల్చే పనులూ అక్కడే పురమాయిస్తారని చెబుతారు. శ్రీకాళహస్తీశ్వరుడి ఆలయాన్నే అవినీతితో అపవిత్రం చేసేసిన ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదనరెడ్డి గురించి జనం చెప్పుకుంటారు. ఆయన అనుచరగణం రౌడీయిజం గురించి, దౌర్జన్యాల గురించి ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా స్పందించరు. తన స్టయిలే వేరన్నట్టుగా వ్యవహరిస్తారు. ఈ ఐదేళ్లూ ఆయన రాజకీయ, పాలనా శైలి, అభివృద్ధి అంటని తీరూ... ఎన్నికల వేళ చర్చగా మారాయి.


- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఆర్భాటపు నేత

ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ఏది చేసినా ఆర్భాటం, హడావుడి ఆకాశాన్నంటుతుంది. కరోనా సాయం అయినా, దేవుడి ఉత్సవం అయినా ప్రదర్శనకే ప్రాధాన్యం ఇస్తారు.

- ఊరందూరులో ఒక మహానగరమే రాబోతోందంటూ సీఎంతో ఇళ్ల కాలనీకి శంకుస్థాపన చేసిన తీరు అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడక్కడ కనీస సదుపాయాలు కూడా లేక పది కుటుంబాలే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నాయి.
- ఇనగలూరు వద్ద అపాచీ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నామంటూ ఊరూవాడా హోరెత్తించారు. సీఎం జగన్ స్వయంగా వచ్చి 2022 జూన్ 23వ తేదీన భూమి పూజ చేసి శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. ఆ మరుసటి రోజే శిలాఫలకం అదృశ్యమైంది. పరిశ్రమ నెలకొల్పే పనులు కనీసంగా కూడా మొదలు కాలేదు.

రౌడీ దర్బార్



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి స్టయిలే వేరు.

ఆర్భాటమే తప్ప అభివృద్ధి శూన్యం

భూకబ్జాలు.. ఇసుక దోపిడీ

- నియోజకవర్గంలో మట్టి, ఇసుక, గ్రావెల్, మద్యం వంటి అక్రమ వ్యాపారాలతో ఎమ్మెల్యే రూ. కోట్లకు పడగలెత్తారనే ఆరోపణలున్నాయి.
- నియోజకవర్గంలో ఎక్కడా ప్రభుత్వ పోరంబోకు, బంజరు భూములు మిగల్చలేదన్న ఆరోపణలు వచ్చాయి. వాటిల్లో వెంచర్లు వేసి, ప్రైవేటు సంస్థలకు విక్రయించి భారీగా సంపాదించారనే ఆరోపణలున్నాయి.

ముక్కంటి వెండిని దోచేసిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, భార్య, అత్త కలిసి ఆలయం నుంచి వెండిని అక్రమంగా బెంగళూరుకు తరలించి అమ్మేస్తున్నారని ఎమ్మెల్యే అనుచరుడు హేమచంద్రారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. వెండికి సంబంధించిన రూ.10 లక్షల నగదు తన ఖాతాకు జమ చేసినట్లు తెలియజేశారు. లాక్‌డౌన్ సమయంలో మద్యం దుకాణాల నుంచి తరలించి సొమ్ముచేసుకున్నారని కూడా ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు కూడా చేయడం సంచలనం అయ్యింది.



శ్రీకాళహస్తి ప్రజల చెవిలో పూలు

హామీ: మన్నవరంలో ఎన్‌టీపీసీ-భెల్ పరిశ్రమను పూర్తి చేయించి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.
అమలు: ఐదేళ్లలో దాని గురించి పట్టించుకోనేలేదు.

హామీ: సోమశిల స్వర్ణముఖి లింకు కాలువను పూర్తి చేసి రైతులకు అంకితమిస్తాం.
అమలు: టీడీపీ ప్రభుత్వంలో జరిగిన పనులు తప్ప కనీసం ఒక్క అడుగు కూడా కాలువ పనులు జరగలేదు.

హామీ: శ్రీకాళహస్తి మున్సిపల్ వార్డుల్లోనూ, గ్రామాల్లోనూ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లు పెట్టి శుద్ధజలం సరఫరా చేస్తాం.
అమలు: ఆ దిశగా కనీస ప్రయత్నం చేయలేదు.

హామీ: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో స్విమ్స్ తరహాలో వైద్య సేవలు అందిస్తాం.
అమలు: ప్రభుత్వ ఆస్పత్రిలో అదనపు అంతస్తు నిర్మించి చేతులు దులుపుకోవడం తప్ప చేసిందేమీ లేదు.

హామీ: శ్రీకాళహస్తిలో మెడికల్ కాలేజీ నెలకొల్పుతాం.
అమలు తీరు: ఐదేళ్లలో ఎక్కడా ఆ ప్రస్తావన కూడా తీసుకురాలేదు.

హామీ: స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను జేఎన్టీయూకు అప్పగించి మరింత అభివృద్ధి చేస్తాం.
అమలు: ఎమ్మెల్యేగా గెలిచాక స్కిట్ కళాశాల పూర్తిగా మూతపడింది.

హామీ: స్వర్ణముఖి నదిని ప్రక్షాళన చేసి, సుందరీకరణ చేస్తాం.
అమలు: ఐదేళ్ళూ కాలక్షేపం చేసి, ఎన్నికల షెడ్యూలు వెలువడే ముందు శంకుస్థాపన చేసి హడావిడి చేశారు. పనులు మాత్రం మొదలు కాలేదు.

దాడులు.. దౌర్జన్యాలు

శ్రీకాళహస్తిలో ఈ ఐదేళ్ళలో రౌడీయిజం, దాడులు, పెరిగిపోయాయి. ఎమ్మెల్యే అనుచరగణం దబాయింపులకూ, దౌర్జన్యాలకూ అంతులేదు.

- టిఫిన్ సెంటర్ నడుపుకునే మునిరాజమ్మను యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ పలకరించారు. ఆమె తన సమస్యలు చెప్పుకుంది. ఇవి మీడియాలో రావడంతో వైసీపీ నేతలు దాడి చేశారు. టిఫిన్ అంగడి ధ్వంసం చేశారు. ఎదురు ఆమె మీదే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు.
- ఎమ్మెల్యే తన ఆస్తులు గుంజుకున్నారని, ఆయనతో తనకు ప్రాణహాని వుందని స్వయంగా ఎమ్మెల్యే భార్య సోదరుడు సామాను శ్రీధర్‌రెడ్డి మీడియా సమావేశంలో ఆరోపించారు.
- నియోజకవర్గంలోని పరిశ్రమల యాజమాన్యాలను బెదిరించి వాటాలు వసూలు చేశారని, ట్రాన్స్‌పోర్టులు, ఉద్యోగాల నియామకం వంటి కాంట్రాక్టులు బలవంతంగా దక్కించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఓ ప్రముఖ పరిశ్రమ విషయంలో వేధింపులకు దిగారని, యాజమాన్యం తనకున్న సంబంధాలతో కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్ళడంతో వారి ద్వారా తీవ్ర మందలింపులకు గురయ్యారనే ప్రచారం జరుగుతోంది.
- స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా దౌర్జన్యాలకు, దాడులకు, కిడ్నాప్‌లకు పాల్పడిన ఉదంతాలున్నాయి.
- పాల సరఫరా సహకార సంఘం ఎన్నికల్లో నామినేషన్ వేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు కారుపై వైసీపీ కార్యకర్తలు పట్టణ నడిబొడ్డున ఆర్టీసీ కూడలిలో రాళ్ళతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు.

జంగమయ్య సన్నిధిలో అవినీతి తాండవం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవినీతి తాండవించింది. అంది వచ్చిన ప్రతీ అవకాశంలో స్వలాభం చూసుకున్నారు. పారిశుధ్యం కోసం ఉపయోగించే చీపురు పుల్లల దగ్గర నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణ వరకూ అన్ని స్థాయిల్లోనూ అందిన కాడికి దోచేశారు.

- అయిన వారికే కాంట్రాక్టులు కట్టబెట్టడం. వాటి నుంచి కమీషన్లు గుంజేయడం చేశారు. సెల్ ఫోన్, లగేజీ, కార్ పార్కింగ్, టెండర్లలో భక్తుల నుంచి అధిక ధరలతో దోపిడీ చేశారు.
- గోశాలలో గడ్డి కొనుగోళ్ల వ్యవహారంలో గోల్‌మాల్ చేశారు.
- ఆలయ నిధులతో ఇంజనీరింగ్ విభాగం ప్రతిపాదనలు అడ్డం పెట్టుకొని అవసరం లేని నిర్మాణ పనులన్నీ చేపట్టారు. కమీషన్ల కక్కుర్తితో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేశారు.

ఆలయంలో ఆదాయ స్థావరాల్లో విధులు కేటాయించేందుకు ఎవరైనా ముడుపులు చెల్లించాల్సిందే.

- పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది కన్నా అధిక సంఖ్యలో పేర్లు నమోదు చేసి లక్షలాది రూపాయలు దోపిడీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ముక్కంటి ఆలయం రాహు కేతు పూజల సమయంలో దోషం పోవాలంటే దక్షిణ చెల్లించాలంటూ భక్తుల నుంచి బలవంతంగా వసూలు చేశారు. నెలకు రూ.1కోటి చొప్పున పోగవుతుందని అంచనా. అక్రమ సొమ్మును రాహు కేతు పూజల వద్ద పనిచేసే సిబ్బంది మొదలు నాయకుల దాకా వాటాలు వెళ్తాయని ప్రచారం ఉంది.
- వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే తన అనుచరులను ఉచిత సేవకుల పేరుతో పీఆర్‌ఓ కార్యాలయంలో అనధికారికంగా 100 మందిని నియమించారు. వీరు వైట్ కాలర్ దళారీలు దర్జాగా దర్శనాలు చేయిస్తుంటారు. ఎమ్మెల్యే అండదండలు ఉండడంతో ఇష్టారాజ్యంగా అడ్డదారిలో దర్శనాలు చేస్తుంటారు. ఒక్కో దళారి రోజు సంపాదన రూ.10 వేలకి తగ్గదని చెబుతారు.
- మహాశివరాత్రి ఉత్సవాలలో కాంట్రాక్టులను అయిన వారికే కట్టబెడుతూ భారీగా సొమ్ము మింగేశారు. ఉదాహరణకు ఈ ఏడాది ఎంత ఖర్చు అయ్యిందీ వెల్లడించలేదు.

ఆఫీసుల్లో నిఘా

- నియోజకవర్గంలోని రెవెన్యూ కార్యాలయాల్లో చీమ చిటుక్కుమన్నా తనకు తెలిసేలా వంద శాతం సిబ్బందిని తనకు కావాల్సిన వారినే నియమించుకున్నారని, వారిలో పరస్పరం ఒకరిపై ఒకరు నిఘా వుండేలా ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. తద్వారా తహసిల్దారు కార్యాలయాల్లో ఏ ఫైలు కదిలినా తన దృష్టికి వచ్చేలా జాగ్రత్త పడ్డారనే ప్రచారముంది. ప్రతి ఫైలూ తనకు తెలిసే, తనకు వాటా వుండేలా ఆదేశాలు జారీ చేశారనే ఆరోపణలున్నాయి.
- భూముల కబ్జా విషయాల్లో సహకరించిన రెవెన్యూ అధికారులపై అత్యున్నత స్థాయి నుంచీ చర్యలకు ఆదేశాలు వచ్చినా వారిని కాపాడారని, కనీసం బదిలీలు కూడా కాకుండా అడ్డుకున్నారనే ఆరోపణలున్నాయి.

రాజుగారి గుండెలుజారిన కత



తిరుగే లేని చక్రవర్తిగా ఐదేళ్లూ వైభోగం అనుభవించిన ఆయనకి చిన్న డౌటనుమానం వచ్చింది. తన ముందు చేతులు కట్టుకుని ఎంతో వినయ విధేయతలు ప్రదర్శిస్తూ, తాను నోరు తెరిస్తే వహ్వా.. వహ్వా అంటూ పొగడ్తలతో ముంచెత్తే సామంతరాజుల నిజ స్వరూపం తెలుసుకోవాలని అనిపించింది. రాజు తలచుకుంటే కొదవేముంది? అసలే వేషాలు వేయడంలో మాంచి అనుభవం ఉండడంతో, చీకటి పడ్డాక మారు వేషంలో నగరమంతా తెగ తిరిగేశాడు. టీయంగళ్ల దెగ్గిర, బస్టాండుల్లో జనం మాటలు విన్నాక కోపం నషాళానికి అంటింది. ఒరలోని కత్తిని కసిగా బయటకీ లోపలకీ రెండుమూడు సార్లు తీసి తోసి, మారు వేషంలో ఉన్నామని గుర్తుకొచ్చి.. ఇంక తిరిగేది చాలించేసి కోటకి తిరిగి వచ్చేశాడు. ఉన్నపళంగా అత్యవసర సమావేశానికి రావలసిందిగా సామంతులకు ఆదేశాలు జారీ చేశాడు. ఏమి ఉపద్రవమో అని భయపడతా కొందరూ, మానవత్వం.. మంచితనం అంటూ మళ్లీ అవే నీతి మాటలు ఎన్నిసార్లు వినాల్నో ఏమో అని వణుకుతూ మరికొందరూ అర్ధరాత్రి మీటింగుకు హాజరయ్యారు.

ముళ్ల పొద మీద కూర్చున్నట్టుగా సింహాసనంపై ఉన్న రాజుగారిని చూడగానే మేటర్..సీరియస్సే అని అర్థమైపోయింది అందరికీ. ఎర్రజీరలతో ఉబ్బిన కళ్లతో అందరినీ ఒకసారి కలియజూసి గొంతు సవరించుకుని మొదలు పెట్టాడు..

"ఎవుర్ని నమ్మాలో..ఎవుర్ని అనుమానించాలో అర్థమే కావడం లేదు." అని గ్యాప్ ఇచ్చాడు. ఎప్పుడూ గంభీరంగా వినిపించే ఆయన కంఠంలోని వణుకుని చూసి సామంతులంతా విచిత్రపోయారు.


"మైసాకి పనికిరానోళ్లందరినీ సామంతరాజులను చేశాను కదా! నాముందు చిత్తం దొరా..అంటూనే, నా వెనకాల గూటాలు దించే పని మొదులు పెట్టారు. శత్రుదుర్భేద్యం అనుకున్న నా కోటకు బీటలేంది? ఏదో మాటవరసకు నేనెంతో సౌమ్యుడిని అని పదే పదే చెప్పాను గదా అని ఎక్కి తొక్కేద్దాం అనుకుంటా ఉండారేమో.. తాట తీస్తా.. ఒక్కొక్కరికీ. ఎగస్పార్టీవాళ్లతో చేతులు కలిపినోళ్లని మేమే ఎండబెట్టిన పేరూరు చెరువులో వేసి తొక్కతా.. అసలే నాది జైలు బ్యాక్‌గ్రౌండ్ అని మరిచిపోబాకండి" అని దీనంగా హెచ్చరించగానే పరిస్థితి కట్టుదప్పుతా ఉందని గ్రహించిన వాడై యువ రాజు గొంతు విప్పాడు.

"సిద్ధం అని మనం ప్రకటించిన యుద్ధంలో విజయం మనదే.. అయినా తండ్రిగారు ఎందుకో సందేహపడుతున్నారు కాబట్టి మీరంతా మీ విధేయతను ప్రకటించుకోవాలి" అని కత్తులు కరకరలాడే మెత్తని స్వరంతో ఆదేశించాడు. సామంతులు సణుక్కున్నా.. ఒక్కొక్కరుగా నడి సమావేశ మందిరంలోకి వచ్చి వినయ విధేయ వీర భక్త ప్రదర్శనలతో రక్తి కట్టించారు. ఒకరు పులేషం వేసి రంజింపజేయగా, మరొకరు నర్రున చాకు దూసి తన చేతిపై గాటు పెట్టుకుని బొటబొటగారే నెత్తురు వేలికద్దుకుని యువరాజు నుదుటిన బొట్టు దిద్దారు. ఇంకొకరు ఆవేశంగా చొక్కా చింపేసుకుని గుండెలు చూపిస్తూ 'దీన్ని కోసి చూడండి.. మీరే కనిపిస్తారు' అని ఉన్మాదంగా అరిచారు.

ఈ ప్రదర్శనలన్నీ చూశాక రాజుగారూ, యువరాజుగారూ నిమ్మళించారు. అనవసరంగా అనుమానించానే అని చింతపడ్డారు. 'ఇంక పాండి ఇళ్లకె' అని అందరినీ పంపేసి తెల్లారే దాకా హాయిగా ఏసీలేసుకుని నిద్రపోయారు.

మరుసటి రోజు: నిద్రలేవగానే తెలిసిన సమాచారం విని పెద్దరాజుకీ, బుల్లిరాజుకీ చెంబుడు వేడి వేడి నీళ్లు తాగినా ఉదయపు పని సాఫీగా సాగలేదు. రాత్రి వీరంగాలు వేసినవాళ్లలో ఇద్దరు జంప్. ఇంకొకరు రాత్రికి ముహూర్తం పెట్టుకున్నారు. ఇంకొందరు క్యూలో నిలబడ్డారు అని విని.. 'హతవిధీ.. ఏమిటీ విపరీతం..' అని యువరాజు వైపు పెద్ద రాజు బేలగా చూశాడు. తండ్రిని ఆ స్థితిలో తొలిసారి చూసిన యువరాజుకు అన్నీ జారిపోయాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఛాలెంజ్ ఓటు అంటే....?

ఓటర్ల జాబితాలో పేరున్నా... ఓటు వేసేందుకు అనర్హుడని రాజకీయపార్టీల ఏజెంట్లు సవాలు చేయడాన్ని ఛాలెంజ్ ఓటు అంటారు. ఓటేయడానికి వచ్చిన ఎవరినైనా పోలింగ్ కేంద్రంలోని ఏజెంట్లు అనుమానించి, ఆ వ్యక్తి నకిలీ అని అభ్యంతరం ప్రకటిస్తారు. అది తన ఓటే అని ఓటేయడానికి వచ్చినవారు చెబితే, ఫిర్యాదు చేసిన ఏజెంటు నుంచి డిపాజిట్‌గా రూ.5 అక్కడి అధికారి తీసుకుంటారు. ఆ తర్వాత ఈవీఎంలో గాక బ్యాలెట్ పేపర్ ఇచ్చి రహస్య పద్ధతిలోనే ఓటేయమంటారు. దాన్ని జాగ్రత్త పరుస్తారు. ఆ ఓటరు నకిలీనో కాదో స్థానిక సిబ్బందితో ప్రాథమిక విచారణ జరిపిస్తారు. అతని పేరు, వయస్సు, తండ్రి పేరు, చిరునామా, ఫోటో తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారణ అయితే ఆ ఓటును లెక్కింపులోకి స్వీకరిస్తారు. బోగస్ అని తేలితే మాత్రం అధికారులు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.

- తిరుపతి కలెక్టరేట్



టెండర్ ఓటు అంటే ?

ఒక్కోసారి ఓటు వేయడానికి వచ్చేసరికి మీ ఓటు వేసేశారు అని ఎన్నికల సిబ్బంది చెబుతారు. అంటే ఆ ఓటు ఇంకెవరో వేసి వెళ్ళిపోయారన్నమాట. ఇటువంటి సమయంలో ఓటరు తన హక్కును వినియోగించుకోవడానికి తన ఓటు తనే వేస్తానని పట్టుబట్టవచ్చు. ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయచ్చు. వాస్తవంగా ఓటు వేయలేదని నిర్ధారణకు వస్తే ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం ఇస్తారు. ఈ ప్రక్రియనే టెండర్డ్ ఓటు అంటారు. ఇందుకోసం ప్రతి పోలింగ్ బూత్‌లో 20 చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. ఇవి బ్యాలెట్ యూనిట్ పైన అమర్చిన వాటిలాగే ఉంటాయి. ఈ బ్యాలెట్‌ను తీసుకుని ఓటరు కంపార్టుమెంట్‌లోకి వెళ్ళి ఓటు వేసి ఆ పత్రాలు కవర్‌లో పెట్టి ప్రిసైడింగ్ అధికారికి అందజేస్తారు. ఆ బ్యాలెట్ పత్రం వెనుక ఇంక్(సిరా)తో టెండర్డ్ బ్యాలెట్ అని రాస్తారు. దీనిని లెక్కింపులో పరిగణనకు తీసుకుంటారు.


- తిరుపతి కలెక్టరేట్

యో... చూసుకోబళ్లా



ఇటీవలే ఆ నాయకుడు టీడీపీని వీడి వైసీపీ కండువా కప్పుకున్నాడు. కొత్త పార్టీలో చేరిన ఉత్సాహంతో ప్రచారంలో గొంతు చించుకునేలా నినాదాలూ చేస్తున్నాడు. 'అమ్మా.. అయ్యా.. మన గుర్తు మీకు తెలుసు కదా.. సైకిల్. సైకిల్ గుర్తుకే మీ ఓటు' అని తరచూ అభ్యర్థిస్తుండడంతో పక్కనున్నవాళ్లు అవాక్కవుతున్నారు. ఆ తర్వాత సర్దుకుని ఫ్యాను గుర్తుకే అని చెబుతున్నాడు. తిరుపతి నగరంలో వీధి వీధినా ఇటువంటి టంగ్‌స్లిప్ సంఘటనలూ రోజూ జరుగుతూనే ఉన్నాయి. పోలింగ్ దగ్గరపడేసరికి అటు నుంచి ఇటూ, ఇటు నుంచి అటూ నాయకులు పార్టీలు మారేస్తున్నారు. కొత్త కండువాలతో జనం ముందుకు వెళ్లినా పాత వాసనలు వదలడం లేదు. పార్టీల పేర్లూ, గుర్తులూ తప్పు చేప్పేసి నాలుక కొరుక్కుంటున్నారు. 'ఎందియా...యో..నువ్వు, చూసుకోబళ్లా' అని పక్కనున్నవాళ్లు విసుక్కుంటే.. 'మహా మహా మంత్రులే మాట తడబడి సీఎం చంద్రబాబు అని అసెంబ్లీలో ఎన్నిసార్లు అనేసినారు.. యా.. నాదేముండాది' అని సర్దుకుంటున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆల్ ఇన్ ఆల్.. నేదురుమల్లి

నాలుగు చట్టసభలకు ప్రాతినిధ్యం వహించిన అరుదైన ఘనత జిల్లాలోని వాకాడుకు చెందిన నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. శాసనమండలి, శాసనసభలకు ఒక్కోసారి, రాజ్యసభ, లోక్‌సభలకు మూడేసిసార్లు చొప్పున ఎన్నికయ్యారు. 1972, 2009, 2010లలో రాజ్యసభకు నేదురుమల్లి ప్రాతినిధ్యం వహించారు. ఇక లోక్‌సభకు 1998లో బాపట్ల నుంచి, 1999లో నర్సరావుపేట నుంచి, 2004లో విశాఖపట్టణం నుంచి ఎన్నికయ్యారు. 1978లో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన నేదురుమల్లి 1978-1983 మధ్య మర్రి చెన్నారెడ్డి కేబినేట్‌లో మంత్రిగానూ చేశారు. 1989లో వెంకటగిరి నుంచి శాసనసభకు ఎన్నికై 1989-90 మధ్య కాలంలో మంత్రిగా చేశారు. 1990లో ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నారు. 1992 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసి పలు ఆరోపణలతో గద్దెదిగారు. ఆరు సార్లు ఎంపీ అయినా ఒక్కసారి కూడా కేంద్ర కేబినేట్‌లో నేదురుమల్లికి మంత్రిగా అవకాశం దక్కలేదు.

-గూడూరు

నాలుగో రోజు ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్


గూడురు పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు

గూడూరు అర్బన్/సూళ్లూరుపేట, మే 8: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరుకానున్న ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న పోస్టల్ బ్యా లెట్ ఓటింగ్ బుధవారం నాలుగో రోజు ప్రశాంతంగా జరిగింది. జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలోని ఫెసిలిటేసన్ సెంటర్‌లో అధి కారులు 7 పోలింగ్ కేంద్రాల్లో 111మంది ఓటు వేశారు. మొత్తం 2,627 ఓట్లు ఉండగా బుధవారానికి 2409 ఓట్లు పోలవడంతో 91.70 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. సూళ్లూరుపేట పట్టణం వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేం ద్రంలో నాల్గో రోజు బుధవారం పోస్టల్ బ్యాలెట్ ప్రశాంతంగా కొన సాగింది. ఇప్పటివరకు 95.33 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 1907 ఓట్లుగాను 1818 మంది ఓటు హక్కు వినియోగించుకొన్నట్లు ఆర్వో తెలిపారు. సీఐ మధుబాబు, ఎస్ఐ రహీంరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వహించాలి: ఆర్వో

సూళ్లూరుపేట, మే 8: సార్వత్రిక ఎన్నికల విధులను ఉద్యోగులు బాధ్యతగా నిర్వహించాలని ఆర్వో చంద్రముని చెప్పారు. బుధవారం రాత్రి ఆయన సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ఆవరణలో రూట్, సెక్టార్ అధికారులు, బీఎల్వోలతో సమావేశయ్యారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను సంబంధిత సిబ్బంది ముందస్తుగా చూసుకోవాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు ఆయా పార్టీ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలోనే రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 12వ తేదీ ఉదయం 7 గంటలకు విధులు కేటాయించిన ఉద్యోగులందరూ తప్పకుండా హాజరుకావాలన్నారు. ఏఈఆర్వో గోపాలకృష్ణ, తహశీల్దార్ ఇక్బాల్, కల్యాణి, ఎన్నికల డీటీలు రాజేంద్ర, పవన్‌కుమార్, గోపినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల జగన్ పనైపోయింది: బీజేపీ

కోట, మే 8: ఎన్నో అబద్ధాలు చెప్పి నాలుగున్నరయేళ్లపాటు ప్రజలను మోసం చేసిన సీఎం జగన్ పనైపోయిందని ఆయన్ను ఆంధ్రులు ఇంటికి సాగనంపేపనిలో నిమగ్నమయ్యారని బీజేపీ రాష్ట్ర పథాదికారి, నియోజకవర్గ పరిశీలకుడు కె.శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్‌లో ప్రచారం అనంతరం మీడియాతో మాట్లాడుతూ... నరేంద్రమోదీ ఆధ్వర్యంలో సాగుతున్న పరిపాలనను దేశ ప్రజలు ప్రసంశల వర్షం కురిపిస్తుంటే ఒక్క జగన్ మాత్రం కేంద్రప్రభుత్వ సొమ్ములతో కులుకుతూ విమర్శలు గుప్పించడం హాస్యస్పదమన్నారు. నాలుగున్నర యేళ్లలో జరిగిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలు అన్ని కేంద్రప్రభుత్వ నిధులన్నారు.

కార్యకర్తల జోలికొస్తే సహించేదిలేదు: నెలవల



పెళ్లకూరులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం - ఓజిలి మండలం పెద్దపరియలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నెలవల విజయశ్రీ

పెళ్లకూరు/ఓజిలి/నాయుడుపేట, మే 8: టీడీపీ నాయకులు, కార్యకర్తలను బెదించాలని చూస్తే సహించేది లేదని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. బుధవారం కానూరురాజుపాళెంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి టీడీపీ కార్యకర్తలకు ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఒకవేళ ఇదే పద్ధతి కొనసాగిస్తే తాను సిద్ధంగా ఉన్నామని ఎక్కడికి రమ్మన్నా వస్తానని, ఎటువంటి పరిణామాల్నైనా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజాస్వామ్యంలో బెదింపులకు పాల్పడటం మంచి పద్ధతికాదన్న విషయం తెలుసుకోవాలని హితవు పలికారు. ఆయనతోపాటు వి.మురళీకృష్ణారెడ్డి, సంచికృష్ణయ్య, నాగేంద్రప్రసాద్‌రెడ్డి, పేరం మధునాయుడు, శేఖర్‌నాయుడు, మనోహర్‌రాజు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

టీడీపీ ప్రచార హోరు...

ఓజిలి మండలం పెదపరియ, భట్లకనుపూరు, వెంకటరెడ్డిపాళెం పంచాయతీల్లో టీడీపీ ఎన్నికల ప్రచారం జాతరను తలపించింది. గ్రామాల్లో టీడీపీ నాయకులకు అపూర్వ స్వాగతం లభించింది. పెద్దసంఖ్యలో జనం ఈ ప్రచారంలో పాల్గొన్నారు. సూపర్ సిక్స్‌తో ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు విజయకుమార్‌నాయుడు, శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమికి ప్రజల బ్రహ్మరథం


ప్రచారంలో విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణయ్య, ప్రవీణ్ తదితరులు

టీడీపీ, బీజేపీ, జనసేన ఎన్డీఏ కూటమికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలో విజయగణపతి దేవస్థానంలో పూజల అనంతరం బీజేపీ నాయకుడు ఆర్.కృష్ణయ్య, జనసేన ఇన్‌చార్జి ప్రవీణ్ తదితరులు పిచ్చిరెడ్డితోపు, టీచర్స్ కాలనీ, 18వ వార్డులో చేసిన ప్రచారానికి అడుగడుగున ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందల కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, శోభారాణి, సుధీర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, గంగాప్రసాద్, సుధీర్, రాజేష్‌నాయుడు, రాజశేఖర్, జీవీఆర్ నాయుడు, కిషోర్, బీజేపీ నాయకులు జె.మాల్యాద్రినాయుడు, రాజశేఖర్‌రెడ్డి, గుంజి శ్రీను, సూరి, జనసేన నాయకులు గిండి సతీష్ తదితరులు ఉన్నారు.

వెంకటగిరిలో టీడీపీ సునామీ సృష్టిస్తుంది: కురుగొండ్ల



పారవోలు ఎన్నికల ప్రచారంలో కురుగొండ్ల రామకృష్ణ, ఎంపీపీ తనూజారెడ్డి తదితరులు - టీడీపీలో చేరిన డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాల వైసీపీ నాయకులతో కురుగొండ్ల

వెంకటగిరి, డక్కిలి, మే 8: సార్వత్రిక ఎన్నికల్లో వెంకటగిరి నియోజకవర్గంలో టీడీపీ సునామీ సృష్టిస్తుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పారవోలు, చింతగుంటల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ... వైసీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారన్నారు. ప్రతిరోజు వేకువ జామునుంచే వైసీపీని వీడి వచ్చిన వారిని పార్టీలోకి ఆహ్వానించేందుకు కూడా సమయం సరిపోవడం లేదంటే అతిశయోక్తి కాదన్నారు. దీంతో ఉయం ఎన్నికల ప్రచారం బాగా ఆలస్యం అవుతోందన్నారు. వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో చేరే వారిని చూస్తుంటే వెంకటగిరి నియోజకవర్గంలో ఆ పార్టీ దాదాపుగా ఖాళీ అయినట్టుగా తెలుస్తోందన్నారు. వెంకటగిరిలో నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి గెలవడని తెలుసుకున్న తర్వాతే వైసీపీ శ్రేణులంతా ఆ పార్టీని వీడి టీడీపీలో చేరేందుకు సిద్ధపడుతున్నారన్నారు. అయితే ఎన్నికలకు ఒక్క రోజు ముందు వచ్చి చేరినా వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఎన్నికల అనంతరం ఎవరు పార్టీలోకి వచ్చినా చేర్చుకొనేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, ఎంపీపీ తనూజారెడ్డి, శివారెడ్డి, జి.విద్యాలత, పప్పు చంద్రమౌళిరెడ్డి, తోట రామచంద్రయ్య, కాపా శ్రీనివాసులు నాయుడు, తోట కృష్ణయ్య, జి.వెంకటేశ్వర్లు, ఎం. మురళి, శివనారాయణ, వీరాస్వామి దశయ్య, రేవతి, కె.కోటేశ్వరరావు, నాగార్జున, తిరుపాల్, రమణయ్య తదితరులు కురుగొండ్ల వెంట ఉన్నారు.

సునామీలా చేరికలు...

వెంకటగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వైసీపీని వీడి వచ్చిన వారితో టీడీపీ కార్యాలయం కిక్కిరిసింది. డక్కిలి మండలం ఆల్తూరుపాడు సీనియర్ వైసీపీ నాయకులు ఎం.మునిభాస్కరరెడ్డి, చైతన్య, దేవులపల్లి వైసీపీ నేత ఎల్లారెడ్డి, ఆల్తూరుపాడు సర్పంచు జి.రత్నయ్య, ఎంపీటీసీ సభ్యురాలు భారతితో పాటు సుమారు 200 వైసీపీ కుటుంబాల, బాలాయపల్లి మండలం నుంచి 300 కుటుంబాలు, వెంకటగిరి నుంచి 200 కుటుంబాలు, రాపూరు, సైదాపురం తదితర మండలాల నుంచి వచ్చిన వారందరినీ రామకృష్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కలిగిరి సభకు 26 బస్సులు...

రాజంపేట పార్లమెంటు పరిధిలోని కలికిరిలో బుధవారం మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ హాజరైన సభకు వెంకటగిరి నుంచి 26 బస్సుల్లో టీడీపీ శ్రేణులు తరలివెళ్లాయి. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల కుమార్తె లక్ష్మీసాయిప్రియ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమిదే విజయమన్నారు.


రాజంపేట పార్లమెంటు పరిధిలోని కలికిరిలో మోదీ, చంద్రబాబు, పవన్ సభకు వెంకటగిరి నుంచి బయలుదేరిన బస్సులకు జెండా ఊపుతున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల కుమార్తె లక్ష్మీసాయిప్రియ

కూటమి అభ్యర్థులను గెలిపించండి: వరప్రసాద్



సభా ప్రాంగణంలో బీజేపీ నాయకులతో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు - ప్రధాని మోదీకి వరప్రసాద్ అభివాదం

తడ, మే 8 : అన్నమయ్య జిల్లా కలికిరిలో జరిగిన బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి బహిరంగ సభలో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు పాల్గొన్నారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మాజీ సీఎం, రాజంపేట బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్న బహిరంగసభకు వరప్రసాద్ హాజరయ్యారు. తనను ప్రధానికి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ బహిరంగసభలో వారితోపాటు టీడీపీ నాయకుడు ఎల్.రమణ, జనసేన నాయకుడు నాగేంద్రబాబు, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


సభికులకు అభివారం చేస్తున్న వరప్రసాద్ తదితరులు

వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసం



వాకాడు మండలం కోడివాక, గూడూరు 8వ వార్డులో టీడీపీ అభ్యర్థి తనయుడు జశ్వంత్‌కుమార్ ప్రచారం

గూడూరు, మే 8: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసమైందే తప్ప అభివృద్ధి శూన్యమని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ తనయుడు డాక్టర్ జశ్వంత్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని 8వ వార్డులో కూటమి అభ్య ర్థులను గెలిపించాలని ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ పేదలకు రూ.10 ఇచ్చి రూ.వంద లాగేసిందన్నారు. యేటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని యువతను మోసం చేసిందన్నారు. అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందాలన్నా చంద్రబాబుని సీఎంగా చేసుకోవాల్సి ఉందన్నారు. ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించిరానున్న ఎన్నికల్లో వైసీపీని గద్దెదించాలన్నారు. భారతి, సందీప్, జగదీష్, సునీల్, వెంకటసాయి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

యువత భవిష్యత్తుకు గ్యారెంటీ

వాకాడు, మే 8: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే యువత భవిష్యత్తుకు గ్యారెంటీ అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ తనయుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కోడివాడక, మూలపడవ, పూడిరాయిదొరవు పంచాయతీల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కక్షపూరిత రాజకీయాల నుంచి ఆంధ్రరాష్ట్రానికి విముక్తి కలగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేద్దామన్నారు. యువనేత లోకేశ్ పాదయాత్రలో యువతకు భరోసా కల్పించేలా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారన్నారు. తీరప్రాంతాలను అభివృద్ధి చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. డి.మధుసూదన్‌రెడ్డి, కె.దయాకర్, బి.ప్రమీల, డి.కృష్ణమూర్తి, గంగాధర్‌రెడ్డి, టి.శ్రీనివాసులురెడ్డి, టి.రమణయ్య, కొప్పుల సురేష్, గౌస్‌మొహిద్దీన్, చిరంజీవమ్మ, ధనుంజయ, సునీత, కవిత, మామిడి గోవిందయ్య పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేద్దాం

చిల్లకూరు, మే 8: ఎన్నికలు దగ్గరకు వచ్చాయని సమయం తక్కువగా ఉందని ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేసి టీడీపీని గెలిపించుకోవాలని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక తానంకి నానాజీ నివాసంలో కొండేపాటి గంగాప్రసాద్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియంతలా పాలిస్తున్న వైసీపీని అంతమొందించి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పించేందుకు కూటమి ఏర్పడిందన్నారు.


గంగాప్రసాద్, బీదా రవిచంద్రలతో చర్చిస్తున్న పాశిం సునీల్‌కుమార్

పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు, మే 8: పట్టణంలోని బాలాజీనగర్‌లో ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో శ్రీనివాసులు సహకారంతో దుస్తులు పంపిణీ చేశారు.

మద్యం రవాణాపై అప్రమత్తం

వెంకటగిరిటౌన్, మే 8: సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అక్రమంగా మద్యం తరలించడాన్ని అడ్డుకోవాలని అనంతపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డీప్యూటీ కమిషనర్ టి.విజయ్ శేఖర్ ఆదేశించారు. వెంకటగిరి సెబ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ తమిళనాడు, కర్ణాటక మద్యం ఏపీలోకి వచ్చే అవకాశం ఉందని తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. గూడూరు సీఐ వినయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోడ్డు ప్రమాదాలు: ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, మే 8 : పట్టణంలోని తుమ్మూరు సమీపంలో బైక్ అదుపుతప్పిన సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కోట పట్టణానికి చెందిన రవి నాయుడుపేట నుంచి తిరిగి వెళ్తుండగా తుమ్మూరు సమీపంలో అదుపు తప్పి కింద పడ్డాడు. నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో బుధవారం రాత్రి రెండు బైకులు ఢీ కొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ద్వారకాపురానికి చెందిన చిరంజీవి మేనకూరులోని పెట్రోల్ బంకుకు తిరిగి వెళ్తుండగా మరో బైక్ ఢీకొంది. రెండు ఘటనలో క్షతగాత్రులను 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్సలు అందించారు.

కూటమి విజయానికి సైనికుల్లా పనిచేద్దాం

కోట, మే 8: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి మహిళా సైనికురాలిగా పనిచేసి సైకో సీఎం జగన్‌ను తరిమికొట్టాలని తెలుగుమహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు జి.సుష్మారెడ్డి కోరారు. మండల పరిధిలోని తిన్నెలపూడి, నారుమిట్ట దళిత, గిరిజనవాడల్లో ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గూడూరులో ఎమ్మెల్యేగా పాశిం సునీల్‌కుమార్‌ను గెలిపించుకుందామంటూ ప్రచారం నిర్వహించారు. అదే విధంగా సెంట్రల్ బ్యాంక్ వైస్ ఛైర్మన్, సీనియర్ టీడీపీ నాయకులు ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎం.మల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో కోటమ్మగుడి కాలనీ, గవండ్లపాళెంలో ప్రచారం నిర్వహించారు.

టీడీపీలో పలువురి చేరిక

వాకాడు, మే 8: మండలంలోని పూడిరాయిదొరవు పంచాయతీలోని తానాకట్ట, పూడికుప్పం నుంచి బుధవారం పలువురు వైసీపీ కుటుంబాలు టీడీపీ అభ్యర్థి పాశి సునీల్‌కుమార్ కుమారుడు జశ్వంత్‌కుమార్ సమక్షంలో ఎల్లబోతు రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం జశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ... కూటమి ప్రకటించిప పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఈగల కృష్ణయ్య, ఎస్.రామయ్య, టి.మునుస్వామి, రమేష్, నాగయ్య, పి.మిరాలరెడ్డి, ఎం.అయ్యలరెడ్డి, టి.సుబ్బారెడ్డి, విజయ్‌కుమార్, ఎం.గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోట, మే 8: మండల పరిధిలోని చిట్టేడు బాలికల ఐటీఐలో మొదటి విడత ఐటీఐ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ అద్దంకి రాజేశ్వరరావు తెలిపారు. ఈనెల 10వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు ఆయా కళాశాలల్లోని ఖాళీగా ఉన్న కోర్సుల్లో ప్రవేశాలకు గడువు ప్రకటించడం జరిగిందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థిని విద్యార్థులు కళాశాల వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.